www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 22-5-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 36 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి రా. 6.48 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: స్వాతి ఉ. 7.46 తదుపరి విశాఖ; వర్జ్యం: మ. 1.42-3.24; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.37; అమృతఘడియలు: రా. 11.53-1.35; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విమానంలో భారీ కుదుపులు

ఒకరి మృతి, 30 మందికి గాయాలు

లండన్ నుంచి వెళ్తున్న సింగపూర్ ఎయిర్‌లైన్స్‌లో ఘటన 2

బ్యాంకాక్‌లో అత్యవసర ల్యాండింగ్

హెచ్ఐవీ టీకా.. ట్రయల్ సక్సెస్!

ప్రయోగాత్మక వ్యాక్సిన్‌తో యాంటీబాడీలు

డ్యూక్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞుల ఘనత

మరిన్ని పరిశోధనలు చేయాలని వెల్లడి 2

40 ఏళ్లుగా సవాల్‌గా మారిన మహమ్మారి





పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో ఈవీఎంను నేలకేసి కొడుతున్న వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి

పిన్నెల్లి అరాచకం

- స్వయంగా ఈవీఎం ధ్వంసం చేసిన ఎమ్మెల్యే
- పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో ఘటన
- సీసీ కెమెరాలో రికార్డయిన విధ్వంసం
- అడ్డుకున్న ఏజెంట్‌పై గొడ్డలి వేటు
- మాచర్లలో ఏడుచోట్ల ఈవీఎంల ధ్వంసం
- తీవ్రంగా స్పందించిన ఎన్నికల కమిషన్
- సంబంధీకులపై కఠిన క్రిమినల్ చర్యలు
- డీజీపీకి సూచించాలని సీఈవోకు ఆదేశం
- పిన్నెల్లిని నిందితుడిగా చేర్చిన పోలీసులు
- ఆయనపై అనర్హత వేటు వేయండి: టీడీపీ అభ్యర్థి

గుంటూరు/అమరావతి-ఆంధ్రజ్యోతి/మాచర్ల, మే 21: పోలింగ్ రోజున పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. టీడీపీ శ్రేణులపై దాడులతో పాటు ఓటమి భయంతో పిన్నెల్లి సోదరులు బూత్‌లలోకి స్వయంగా చొరబడి ఈవీఎంలను ధ్వంసం చేశారు. అడ్డుకున్న టీడీపీ ఏజెంట్లపై పోలింగ్ బూత్‌లోనే దాడిచేశారు. పిన్నెల్లి దాష్టీకాలకు సంబంధించిన సీసీ ఫుటేజ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిని ఎన్నికల కమిషన్ తీవ్రంగా

మిగతా 11వ పేజీలో...

రాష్ట్రంలో రెడ్ అలర్ట్!

సాధారణంగా పోలింగ్ రోజు పోలీసులు టెన్షన్‌తో గడుపుతారు. హింసాత్మక ఘటనలు జరిగే అవకాశాలుంటాయనే అంచనాతో అదనపు బలగాలను రప్పించి పోలింగ్ కేంద్రాలకు పహారాను పెంచుతారు. కానీ, రాష్ట్రంలో పోలింగ్ మరుసటి రోజున భారీగా హింస చోటు చేసుకుంది. ఫలితాలు వెల్లడయ్యే జూన్ 4వ తేదీన కూడా హింస పెచ్చరిల్లవచ్చునని కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర పోలీస్ యంత్రాంగం బలంగా అనుమానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మారణాయుధాలు, నాటుబాంబుల కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇళ్లలోని అటకలు, పశువుల పాకల్లోని గడ్డివాములు, ఊరి చివర పాడుబడ్డ షెడ్లలో కార్డన్ సెర్చ్‌లు కొనసాగుతున్నాయి. పోలింగ్ బందోబస్తు కోసం వచ్చిన కేంద్ర బలగాలు.. ఫలితాలు వెలువడిన తర్వాత 15 రోజులపాటు రాష్ట్రంలోనే ఉండాలని ఈసీ ఇదివరకే ఆదేశించింది.



గుంటూరు జిల్లా తెనాలిలో పోలీసుల తనిఖీలు

- మారణాయుధాలు, బాంబుల కోసం ఇల్లిల్లూ జల్లెడ
- అటకలు, గడ్డివాములు, పాడుబడ్డ షెడ్లలో సోదాలు
- పోలింగ్ అనుభవాల దృష్ట్యా పూర్తి అప్రమత్తత
- బాణసంచా అమ్మకాలు, బాటిళ్లలో పెట్రోల్‌పై నిషేధం
- సరైన రికార్డులు లేని వాహనాలు వందల్లో సీజ్
- అనుమానితులపై సమాచారం ఇవ్వాలన్న డీజీపీ

ఓట్ల లెక్కింపు రోజు హింసాత్మక ఘటనలు?

రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల విస్తృత సోదాలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

ఓట్ల లెక్కింపు రోజున రాష్ట్రంలో భారీగా అల్లర్లు జరుగుతాయనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరస్పరం దాడులకు దిగే అవకాశం ఉందంటూ నిఘా విభాగం వరుస హెచ్చరికలతో చర్యలకు సిద్ధమయ్యారు. ఈ నెల 13న పోలింగ్ రోజు, ఆ తర్వాత చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాల్లో ముమ్మర గాలింపు చర్యలు మొదలయ్యాయి. మరీ ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాలు పల్నాడు, రాయలసీమ జిల్లాల పోలీసు అధికారులను అప్రమత్తం చేశాయి. పోలింగ్ తర్వాత జరిగిన అల్లర్లను అడ్డుకోలేకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ఎస్పీల నుంచి ఎస్ఐల దాకా అధికారులపై ఈసీ చర్యలతో ఇప్పటి నుంచే జాగ్రత్త పడుతున్నారు. కౌంటింగ్ రోజు ఎలాంటి హింసాత్మక ఘటనలకు అవకాశం

మిగతా 11వ పేజీలో...

దాడుల నిందితులపై హత్యాయత్నం కేసులు

- ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లలో సెక్షన్ 307 చేర్పు
- కుట్ర, ప్రజా ప్రాతినిధ్య చట్టం కూడా..
- కోర్టుల్లో మెమోలు వేసిన పోలీసులు
- పల్నాడులో మరో రెండు ఎఫ్ఐఆర్‌లు
- మూడు జిల్లాల్లో 35కు చేరిన కేసులు
- నిందితుల కోసం పోలీసుల వేట
- ఎవ్వరినీ వదిలి పెట్టొద్దు 11
- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశం

సుప్రీంకూ అదే స్క్రిప్టు!

ఎన్జీటీకి ఇచ్చినట్లు 'మన' ఫార్మాట్‌లోనే ఉండాలి

- ఇసుక తవ్వకాల్లో అక్రమాలే లేవని చెప్పండి
- తవ్వకాలు, అక్రమాల్లేవని రిపోర్టు ఇవ్వండి
- కలెక్టర్లపై ముఖ్య అధికారి, వసూల్ రాజా ఒత్తిళ్లు
- వారికి నేరుగా నీలకంఠుడి ఫోన్లు
- అందరూ ఇదే పాటించాలని స్పష్టీకరణ
- భిన్నంగా పంపితే తెలిసిపోతుందని బెదిరింపు
- మీరే దొరికిపోతారని బ్లాక్‌మెయిలింగ్
- పెద్దలు చెప్పినట్లు చేస్తే కోర్టుతో సమస్య
- అందుకు భిన్నంగా వెళ్తే పెద్దలతో తంటా
- ఒత్తిళ్లతో నలిగిపోతున్న కలెక్టర్లు

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు కళ్లకు గంతలు కట్టేందుకు ఓ ముఖ్య అధికారి మంత్రాంగం మొదలు పెట్టారు. ఇసుక రీచ్ (బీ2)ల్లో అసలు తవ్వకాలే జరగడం లేదని.. ఇంతకు ముందు కూడా తవ్వలేదని.. అక్కడ కనీసం మనిషి నడిచిన ఆనవాళ్లు కూడా కనిపించడం లేదంటూ నివేదిక ఇవ్వాలని కలెక్టర్లపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. అంతా ఒక్క మాట మీద నిలబడి.. గతంలో జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కి ఇచ్చినట్లుగా.. ఏ అక్రమాలూ లేవన్న ఏకవాక్య ఫార్మాట్‌కు కట్టుబడి ఉండాలని ఆదేశించినట్లు తెలిసింది.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై జేపీ వెంచర్స్‌కు ఎన్జీటీ భారీ పెనాల్టీ విధించిన సంగతి తెలిసిందే. ట్రైబ్యునల్ తీర్పుపై సుప్రీంకోర్టులో జేపీ వెంచర్స్ అప్పీల్‌చేయగా స్టే లభించింది. తాజాగా ఈ కేసు విచారణకొచ్చింది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఇదివరకు జేపీ వెంచర్స్, ఇప్పుడు కొత్త కాంట్రాక్టు సంస్థలైన ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీలు కూడా అక్రమ తవ్వకాలు చేస్తున్నాయంటూ

మిగతా 12వ పేజీలో...



ఎన్ఐఏ అదుపులో టెకీ 12

- రాయదుర్గంలోని సుహిల్ నివాసంలో తనిఖీలు
- బెంగళూరు పేలుళ్లతో సంబంధంపై అనుమానం
- బెంగళూరుకు తరలింపు

అదో మోసగాళ్ల ముఠా!

- రూ.20 లక్షల కోట్ల అవినీతిలో భాగస్వాములు.. 'ఇండీ' కూటమిపై మోదీ ఫైర్
- ఆ పార్టీలు కుల, మత, కుటుంబవాదులు.. తొలి దశలోనే వాటి పనైపోయింది
- తర్వాతి 4 విడతల్లోనూ చావుదెబ్బే.. మిగతా రెండు దశల్లో కూడా ఇంతే
- అంబేడ్కర్ లేకుంటే రిజర్వేషన్లకు నెహ్రూ అంగీకరించేవారు కాదు: ప్రధాని



హిందూ-ముస్లింల మధ్య మోదీ చిచ్చు 2

ఆయన ప్రజా జీవితం నుంచి తప్పుకోవాలి: ఖర్గే


ఒడిశాకు తుఫాన్ ముప్పు!


నేడు అల్పపీడనం

- ఎల్లుండికి వాయుగుండంగా..
- 25న రాత్రి తుఫాన్ తీరం దాటే అవకాశం
- 23 నుంచి రాష్ట్రంలో పెరగనున్న ఎండలు 12
- 30 కల్లా కేరళలోకి నైరుతి రుతుపవనాలు?



అనంతపురంలో గాలివానకు కూలిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు





ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాల్లో
హానికర రసాయనాలు లేవు

న్యూఢిల్లీ, మే 21: ఎవరెస్ట్, ఎండీహెచ్ కంపెనీల మసాలాలు, ఇతర ఉత్పత్తుల్లో హానికర రసాయనాలు లేవని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రకటించింది. వీటి శాంపుల్స్‌లో ఇథిలీన్ ఆక్సైడ్ (ఈటీవో)గానీ, కాన్సర్ కారక రసాయనాలుగానీ లేవని తెలిపింది. ఈ రెండు కంపెనీలు విక్రయించే ఉత్పత్తుల శాంపుల్స్‌ను విస్తృతంగా సేకరించి పరీక్షలు జరపగా ఈ విషయం వెల్లడైనట్టు పేర్కొంది. ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాల్లో అనుమతులకు మించి రసాయనాలున్నట్టు హాంకాగ్ ఫుడ్ అథారిటీ ఆరోపించిన నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ పరీక్షలు జరిపింది. మసాలాల్లో సూక్ష్మక్రిములు నశించేలా స్టెరిలైజ్ చేసేందుకు ఇథిలీన్ ఆక్సైడ్‌ను ఉపయోగిస్తుంటారు. ఇది పరిమితికి మించితే క్యాన్సర్ సహా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

ఒక్కో దశకు విజయం మరింత చేరువ

» జూన్ 4న ఇండియా కూటమి ప్రభుత్వం : కేజ్రీవాల్



న్యూఢిల్లీ, మే 21 : ఒక్కో దశ పోలింగ్ ముగిసేకొద్దీ ఇండియా కూటవిు విజయానికి మరింత చేరువ అవుతోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. "మోదీ పతనం ఖాయం. ఈ విషయం జూన్ 4వ తేదీన తేలిపోతుంది. ఇండియా కూటమి సుస్థిరమైన, పూర్తి కాలపు ప్రభుత్వాన్ని అందిస్తుంది" అని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ వాసులను పాకిస్థానీయులుగా పేర్కొంటే సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ఉద్దేశించి కేజ్రీవాల్ హెచ్చరించారు. రాహుల్, కేజ్రీవాల్‌లకు ఇండియాలో మద్దతు లేదని, వారి మద్దతుదారులు పాకిస్థాన్‌లో ఉన్నారని అమిత్‌షా అనడాన్ని కేజ్రీవాల్ ఆక్షేపించారు. "62 సీట్లు, 56 శాతం ఓట్లు ఆప్‌కు ఇచ్చి ఢిల్లీ ప్రజలు అందించారు. 117 సీట్లకు 92 సీట్లు ఆప్‌కు పంజాబీలు అందించారు. గోవా ప్రజలు ఆప్ పట్ల ప్రేమను, విశ్వాసాన్ని ప్రకటించారు. గుజరాతీలు ఆప్‌కు 14 శాతం ఓట్లు అందించారు. మరి.. ఢిల్లీ వాసులు, పంజాబీలు, గోవావాసులు, గుజరాతీలు అంతా పాకిస్థానీయులేనా?" అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాగా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మరోసారి అరవింద్ కేజ్రీవాల్‌పై విరుచుకుపడ్డారు. ఆప్ ఎంపీ స్వాతీ మాలివాల్ వంటి మహిళల పట్ల ఆయన వైఖరి ఏమిటనేది కేజ్రీవాల్ మౌనమే చెప్తోందని సక్సేనా విమర్శించారు. కాగా, స్వాతీ మాలివాల్ బీజేపీ కోసం పని చేస్తున్నారన్న తమ వాదనను సక్సేనా విమర్శలు బలపరుస్తున్నాయని ఆప్ ఆరోపించింది.

2004 నాటి క్షణాలు పునరావృతం: జైరాం

న్యూఢిల్లీ, మే 21: ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి స్పష్టమైన ఆధిక్యం లభిస్తుందని, 2004 నాటి క్షణాలను జూన్ 4న మరోసారి చూడబోతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో భారీగా పుంజుకోవడమే కూటమి బలమైన పనితీరుకు నిదర్శనమని తెలిపారు. మంగళవారం పీటీఐ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. ఎన్నికలంటే అదేమీ అందాల పోటీనో, కౌన్ బనేగా పీఎం పోటీనో కాదని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రతిష్ఠ మసకబారిపోయిందని వ్యాఖ్యానించారు. మోదీ 3డీ మాస్టర్ అని, వక్రీకరించడం, దృష్టి మళ్లించడం, అపవాదులు వేయడంలో మాస్టర్ అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా, సమాజ్‌వాదీపార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ పాల్గొన్న ఆజంగఢ్ జిల్లా సరేమీర్ బహిరంగ సభలో తోపులాట జరిగింది. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి అఖిలేశ్ ప్రసంగించారు.

చైనా కమ్యూనిస్టు పార్టీతో బీజేపీ 13 సార్లు భేటీ

న్యూఢిల్లీ, మే 21: చైనా కమ్యూనిస్టు పార్టీతో బీజేపీ జరిపిన సమావేశాలకు సంబంధించిన వివరాలను బహిర్గత పరచాలని మంగళవారం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 2008 నుంచి ఇప్పటి వరకు దాదాపు 13 సార్లు బీజేపీ నేతలు చైనా కమ్యూనిస్టు పార్టీ నేతలతో సమావేశమయ్యారని, చాలా వరకు భేటీలు చైనాలోనే జరిగాయని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పవన్ ఖేరా ఆరోపించారు. ఈ సమావేశాల వెనుక ఉద్దేశాన్ని తెలపాలని డిమాండ్ చేశారు.

షెంజెన్ వీసా ఫీజును పెంచిన ఐరోపా కమిషన్

లండన్, మే 21: పర్యాటకులు అధికంగా వచ్చే వేసవి ముంగిట షెంజెన్ వీసా రుసుమును పెంచుతూ యూరోపియన్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్దలకు ప్రస్తుతం 80 యూరోలు(రూ.7,232)గా ఉన్న వీసా ఫీజును 12% పెంచి 90 యూరోలు (రూ.8,136) చేయనుంది. ఆరేళ్ల నుంచి 12 ఏళ్లలోపు పిల్లలకు 40 యూరోల (రూ.3,616) నుంచి 45 యూరోలు (రూ.4,068) వసూలు చేయనుంది. ఈ నిర్ణయం జూన్ 11 నుంచి అమల్లోకి రానుంది. 29ఐరోపా దేశాలతో కూడిన షెంజెన్ సమాఖ్యలో.. ఏదేని ఒక దేశం వీసా పొందితే మిగతావాటిలో 90రోజుల దాకా పర్యటించవచ్చు.

ఖలిస్థాన్ ఉగ్రవాదిపై ఎన్ఐఏ చార్జిషీటు

న్యూఢిల్లీ, మే 21: కెనడాలో ఉంటున్న ఖలిస్థాన్ అనుకూల ఉగ్రవాది అర్షదీప్ సింగ్ అలియాస్ అర్ష్ డాలాపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేసినట్టు మంగళవారం ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. భారత్‌లో ఉంటూ ఆయనకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న మరో ముగ్గురిపైనా చార్జిషీట్లు సమర్పించినట్టు పేర్కొన్నాయి. భారత్‌లో ఆయనకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న హర్జీత్ సింగ్, రవీంద్ర సింగ్, రాజీవ్ కుమార్.. పంజాబ్, ఢిల్లీల్లో ఉగ్రవాద చర్యలకు కుట్ర పన్నినట్టు ఎన్ఐఏ తెలిపింది.

మరోసారి.. మరచిపోయి..

» అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మతిమరపు పాట్లు

» కరోనా వచ్చినప్పుడు ఉపాధ్యక్షుడిగా ఉన్నట్టు వ్యాఖ్య

న్యూయార్క్, మే 21: వయసు పైబడడడం వల్లనో ఏమో.. అత్యంత కీలకమైన విషయాలనూ అలవాటుగా మర్చిపోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) మరోసారి తన 'మతిమరపు'తో వార్తల్లోకెక్కారు! కొవిడ్ సమయంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా.. తాను ఉపాధ్యక్షుడిగా ఉన్నామంటూ ఏదేదో మాట్లాడేసి అభాసుపాలయ్యారు. "కరోనా మహమ్మారి విజృంభించిన ఆ రోజులు ఎంతో చెడ్డవి. అప్పట్లో నేను ఉపాధ్యక్షుడిగా ఉన్నాను. అధ్యక్షుడు ఒబామా నన్ను డెట్రాయిట్‌కు వెళ్లి సహాయం చేయమన్నారు" అని ఆయన వ్యాఖ్యానించడం వైరల్ అయ్యింది. కరోనా ప్రపంచాన్ని చుట్టుముట్టే సమయానికి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్, ఉపాధ్యక్షుడిగా మైక్ పెన్స్ ఉన్న సంగతి తెలిసిందే. అమెరికా వైస్‌ప్రెసిడెంట్‌గా బైడెన్ 2009 జనవరి నుంచి 2017 జనవరి దాకా ఉన్నారు. మతిమరపు కారణంగా ఆయన కరోనా గురించి ప్రస్తావించినప్పటికీ.. ఆయన అసలు ఉద్దేశం 2011 నాటికి సంక్షోభంలో ఉన్న ఆటోమొబైల్ పరిశ్రమ గురించి అయి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బైడెన్ ఇలాగే పొరపాటున.. పాలస్తీనా ఉగ్రవాద గ్రూపు 'హమాస్'ను ప్రతిపక్షంగా పేర్కొని నవ్వులపాలయ్యారు. అంతకుముందు మరో సందర్భంలో.. తాను అమెరికా అధ్యక్షుడు కాగానే ఫ్రెంచ్ మాజీ అధ్యక్షుడు మిటరాండ్‌ను కలిసినట్టు చెప్పారు. కానీ, ఆయన 1996లోనే మరణించడం గమనార్హం. ఇంకో సందర్భంలో.. ఇరాక్‌తో యుద్ధంలో పుతిన్ ఓడిపోతున్నట్టు వ్యాఖ్యానించారు. ఇవే కాదు.. తన పెద్ద కుమారుడు చనిపోయిన తేదీ కూడా ఆయనకు గుర్తు లేదని రాబర్ట్ హర్ అనే ప్రాసిక్యూటర్ పేర్కొన్నారు.

అదో మోసగాళ్ల ముఠా!

వాళ్లు రూ.20 లక్షల కోట్ల అవినీతిలో భాగస్వాములు!

» ఇండియా కూటమిపై మోదీ ఫైర్



వారాణసీలో నారీశక్తి వందన్ కార్యక్రమంలో మోదీకి నమస్కరిస్తున్న యోగి ఆదిత్యనాథ్

మహరాజ్‌గంజ్/మోతిహారి, మే 21: విపక్ష ఇండియా కూటమిపై ప్రధాని మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. దానిని స్కామ్‌స్టర్ల(మోసగాళ్ల) కూటమిగా అభివర్ణించారు. ఆ పార్టీల నేతలంతా వంద శాతం కులవాదులు, మతవాదులు, కుటుంబవాదులని ధ్వజమెత్తారు. బిహార్లోని మహరాజ్‌గంజ్, పూర్వీచంపారన్ లోక్‌సభ నియోజకవర్గాల్లో మంగళవారం జరిగిన ఎన్నికల సభల్లో ఆయన మాట్లాడారు. ఈ కూటమి అవినీతి, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయిందని.. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇదసలు రాజకీయ కూటమిగానే కనబడడం లేదని.. ఇందులోని స్కామ్‌స్టర్లు దేశంలో రూ.20 లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలకు బాధ్యులని విరుచుకుపడ్డారు. 'టుకడే టుకడే గ్యాంగ్' చేసిన పాపాలతో దేశం ముందుకు వెళ్లదన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో తొలి దశలోనే కూటమి పనైపోయిందని.. తర్వాత నాలుగు విడతల్లో కూడా చావు దెబ్బ తిన్నదని.. మిగిలిన రెండు విడతల్లోనూ ఇదే కొనసాగుతుందని స్పష్టం చేశారు. జూన్ 4న ఓట్లు లెక్కించే రోజు ఎదురయ్యే ఫలితాలతో కూటమి ఆశలు, ఉద్దేశాలకు గట్టి షాక్ తగులుతుందని జోస్యం చెప్పారు. ఆగర్భ శ్రీమంతులైన రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వి యాదవ్ తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలని నాకు సలహా ఇస్తామని జంగిల్ రాజ్ వారసుడు (తేజస్వి) అంటున్నారు.. మోదీ ఏడవడం తాను చూడాలనుకుంటున్నానని కాంగ్రెస్ యువరాజు (రాహుల్) చెబుతున్నారు. నా సమాధి తవ్వుతానని ఆయన బహిరంగంగానే నినాదాలు ఇస్తున్నారు. వీరిద్దరితో సారూప్యం గల వ్యక్తి (అఖిలేశ్) యూపీలో ఉన్నారు. నేను జీవిత చరమాంకానికి వచ్చానని.. అందుకే వారాణసీలో పోటీచేస్తున్నానని అన్నారు. జూన్ 4 సమీపించేకొద్దీ ఇండీ కూటమి నేతలు నన్ను మరింత దూషిస్తున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. మోదీని ప్రజలు మూడోసారి ఎన్నుకోబోతున్నారన్న వాస్తవాన్ని వారు అంగీకరించలేకపోతున్నారు' అని తెలిపారు. తనకెవరూ వారసులు లేరని.. దేశ ప్రజలందరినీ తన వారసులుగా భావిస్తున్నానని చెప్పారు. 'మీరు, మీ పిల్లల బంగారు భవిష్యత్ కోసం నేను బాగా కష్టపడాలి. మీరు ఎదుర్కొన్న సమస్యలను మీ తర్వాతి తరం ఎదుర్కోకూడదని నేను భావిస్తున్నా' అని తెలిపారు. చంపారన్ గాంధీజీ కర్మభూమి అని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బాపూజీ ఆశయాలను తుంగలో తొక్కిందని.. ఒక కుటుంబ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ వస్తోందని విమర్శించారు. మహరాజ్‌గంజ్ సభలో పలువురు యువకులు తనను చూసేందుకు స్తంభాలు ఎక్కడాన్ని మోదీ గమనించి వారిని హెచ్చరించారు. 'మీరంతా కిందకు దిగాలి. దేశానికి మీలాంటి యువత అవసరం. మీరు కింద పడి గాయపడితే నేనెంతో మనస్తాపానికి గురవుతాను. మీరు దిగేదాకా ప్రసంగించను. నా మందలింపుతో మీకు కష్టం కలిగించి ఉంటే క్షమించండి' అని వ్యాఖ్యానించారు.

పూరీ జగన్నాథుడు
మోదీకి భక్తుడు

నోరు జారిన బీజేపీ నేత సంబిత్ పాత్రా



భువనేశ్వర్, మే 21: "పూరీ జగన్నాథుడు ప్రధాని మోదీకి భక్తుడు" అంటూ నోరు జారిన బీజేపీ నేత, పూరీ నుంచి ఆ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన సంబిత్ పాత్రా చిక్కుల్లో పడ్డారు. ఈ వ్యాఖ్యపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. సోమవారం పూరీలో ప్రధాని మోదీ రోడ్‌షో సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సంబిత్ పాత్రా.. మీడియాతో మాట్లాడుతూ పై వ్యాఖ్య చేశారు. దీనిపై ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్ తీవ్రంగా స్పందించారు. "ఈ విశ్వానికే జగన్నాథుడు ప్రభువు. అలాంటి మహా ప్రభువును ఓ మానవుడికి భక్తుడు అనడం దేవుణ్ని అవమానించినట్లు" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పూరీ అభ్యర్థి జయనారాయణ్ పట్నాయక్ ఈ అంశంపై పూరీ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబిత్ వ్యాఖ్యకు గాను ప్రధాని నరేంద్ర మోదీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా డిమాండ్ చేశారు. బీజేపీ నేతలు తమనుతాము దేవుడికంటే గొప్పగా భావిస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. దీంతో సంబిత్ పాత్రా క్షమాపణలు చెప్పారు. నోరు జారినట్లు వివరణ ఇచ్చుకున్నారు. ఈ తప్పునకు ప్రాయశ్చిత్తంగా మూడ్రోజుల పాటు ఉపవాసం ఉంటానని పేర్కొన్నారు.

నేను ఆరెస్సెస్ సభ్యుడ్నే

» పిలిస్తే మళ్లీ అక్కడికే వెళ్తా

» పదవీ విరమణ రోజున కలకత్తా హైకోర్టు జడ్జి



కోల్‌కతా, మే 21: తాను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) జీవితకాల సభ్యుడినని, తాను మళ్లీ అక్కడికి వెళ్లి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ చిత్తరంజన్ దాస్ చెప్పారు. సోమవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆరెస్సెస్‌తో తనకు చిన్నప్పటి నుంచే అనుబంధం ఉందని, ఈ విషయం చెప్పడానికి భయపడడం లేదని అన్నారు. వీడ్కోలు సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ "నేను ఓ సంస్థకు రుణ పడి ఉన్నా. చిన్నప్పుడే అందులో చేరా. యవ్వన దశలోనూ అందులోనే కొనసాగా. ధైర్యంగా, నిజాయితీగా మెలగడాన్ని నేర్చుకున్నా. కొందరికి నచ్చకపోవొచ్చేమోగానీ నేను అప్పుడు...ఇప్పుడు ఆరెస్సెస్ సభ్యుడినే" అంటూ తన నేపథ్యాన్ని వివరించారు. "ఏ సాయం కావాలని పిలిచినా, తాను చేయగలిగే ఏ పని అప్పగించినా మళ్లీ ఆ సంస్థలో చేరుతా. అయితే ఆ సంస్థ పేరు చెప్పుకొని వృత్తిలో ఉన్నత స్థానాలు పొందలేదు. జడ్జిగా పనిచేసిన సమయంలో ఆ సంస్థకు దూరంగానే ఉంటూ వచ్చా"నని చెప్పారు. 'ఒడిశాకు చెందిన జస్టిస్ చిత్తరంజన్ దాస్ 2009లో ఒడిశా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2022లో కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. కాగా, మార్చి నెలలో పదవీ విరమణ చేసిన కలకత్తా హైకోర్టు జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ వెంటనే బీజేపీలో చేరారు. ప్రస్తుతం తామ్‌లుక్ నియోజకవర్గం నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు.

ఆర్టికల్ 370 రద్దు తీర్పుపై సమీక్షకు సుప్రీం నో

న్యూఢిల్లీ, మే 21: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కలిగించిన ఆర్టికల్ 370ను రద్దును సమర్థిస్తూ ఇచ్చిన తీర్పుపై సమీక్షించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆర్టికల్ 370 రద్దు సబబేనని గత ఏడాది డిసెంబరులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు ఇచ్చింది. దీనిని సమీక్షించాలని కోరుతూ పలు దరఖాస్తులు వచ్చాయి. వీటిని ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లోనే అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల పరిశీలించింది. తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదంటూ వాటిని తిరస్కరించింది. తమ పిటిషన్లపై ఓపెన్ కోర్టులో విచారణ జరపాలని, వాదనలకు అవకాశం కల్పించాలన్న వినతులను కూడా నిరాకరించింది. అవామీ నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ అండ్ కశ్మీర్ పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ, సీపీఎం నాయకుడు మహ్మద్ యూసుఫ్ తారిగామి ఈ రివ్యూ పిటిషన్లు దాఖలు చేశారు.

హిందూ-ముస్లింల మధ్య మోదీ చిచ్చు

» ఆయన ప్రజా జీవితం నుంచి తప్పుకోవాలి: ఖర్గే



జగ్‌ధారి(హరియాణ)/న్యూఢిల్లీ, మే 21: హిందూ-ముస్లింల మధ్య చిచ్చుపెట్టేలా నిత్యం వ్యాఖ్యలు చేస్తూ, సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్న ప్రధాని మోదీ ప్రజా జీవితం నుంచి వైదొలగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న మోదీ ఉద్దేశాలు స్వచ్ఛంగా లేవని మంగళవారం పీటీఐ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజల ఆస్తులు లాగేసుకుంటుందని, ముస్లింలకు 15 శాతం బడ్జెట్ అంటూ ప్రధాని మాట్లాడుతున్నారని, ఇలాంటి వ్యాఖ్యలతో ఆయనే సమాజంలో విభజన సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 'ఓవైపు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూనే మరోవైపు హిందూ-ముస్లింల గురించి మాట్లాడితే తాను ప్రజా జీవితంలో ఉండటానికి అర్హుడిని కాదని మోదీ చెప్తుంటారు' అని ఖర్గే ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నది బీజేపీయేనని ఆరోపించారు. మోదీ వన్ మ్యాన్ షో చేయాలని అనుకుంటున్నారని, ఒక్క నాయకుడే ఈ దేశం మొత్తాన్ని నడపగలడనేది ఆయన ఆలోచనగా పేర్కొన్నారు. పేదలకు సాయం చేయడం, ఏ సామాజిక వర్గానికైనా అన్యాయం జరగకుండా ఆపడం బుజ్జగింపు రాజకీయం కాబోదని ఖర్గే స్పష్టం చేశారు. మోదీ అబద్ధాలకోరని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ మేనిఫెస్టోపై అబద్ధాలు చెబుతున్నారని ఖర్గే ఆరోపించారు. గత పదేళ్లలో బీజేపీ దేశానికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తదుపరి ప్రధాని ఎవరనేది ఎన్నికల తర్వాత మిత్రపక్షాలతో చర్చించి నిర్ణయిస్తామని ఖర్గే చెప్పారు.

మధ్యప్రదేశ్‌లో 'నర్సింగ్ స్కాం'

ఇద్దరు సీబీఐ ఇన్‌స్పెక్టర్ల అరెస్టు

ఇంకో 11 మంది కూడా..

భోపాల్, మే 21: కంచే చేను మేస్తే.. అలాగే ఉంది సీబీఐ అధికారుల తీరు. నర్సింగ్ కాలేజీల్లో అవకతవకలను గుర్తించి నివేదిక ఇమ్మని ఆ రాష్ట్ర హైకోర్టు సీబీఐని ఆదేశిస్తే.. అక్రమాలను గుర్తించటం మాట అటుంచి, స్వయంగా ఆ సంస్థ అధికారులే అవినీతికి పాల్పడ్డారు. కాలేజీల్లో సౌకర్యాలు లేకపోయినా అంతా బాగానే ఉందంటూ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఒక్కో కాలేజీ నుంచి రూ.2-10 లక్షల వరకూ వసూలు చేశారు. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం ఈ 'నర్సింగ్ స్కాం' సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రంలోని పలు నర్సింగ్ కళాశాలలు కనీస సదుపాయాలు లేకపోయినా నడుస్తున్నాయని దాఖలైన ఓ పిటిషన్‌పై 2022 డిసెంబరులో ఆ రాష్ట్ర హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు తనిఖీలు జరిపిన సమయంలో.. సదుపాయాలు లేని కళాశాలలకు కూడా డబ్బులు తీసుకొని వాటికి అనుకూలంగా సర్టిఫికెట్లు ఇచ్చినట్లు సీబీఐకి ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సీబీఐ విజిలెన్స్ విభాగం అధికారులు.. ఆదివారం ఓ నర్సింగ్ కాలేజీ యాజమాన్యం నుంచి రూ.10 లక్షల లంచం తీసుకుంటున్న సీబీఐ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌రాజ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఢిల్లీ నుంచి నుంచి వచ్చిన సీబీఐ బృందాలు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల సోదాలు జరిపి.. రూ.2.33 కోట్ల సొమ్మును, 4 బంగారం కడ్డీలను, 36 డిజిటల్ ఉపకరణాలను, 150కి పైగా పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సీబీఐకి అనుబంధంగా విధులు నిర్వహిస్తున్న మధ్యప్రదేశ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుశీల్‌కుమార్ మజోకాను, సీబీఐకి సమాచారం అందించటానికి నియమితులైన ముగ్గురు వ్యక్తులు సహా 13 మందిని అరెస్టు చేశారు. వీరిలో ఒక నర్సింగ్ కాలేజీ చైర్మన్, మరో నర్సింగ్ కాలేజీ డైరెక్టర్, రెండు కాలేజీల ప్రిన్సిపాళ్లు కూడా ఉన్నారు. వీరందరినీ స్థానిక కోర్టు మే 29వ తేదీ వరకు సీబీఐ కస్టడీకి అప్పగించింది. వీరితోపాటు మొత్తం 23 మందిపై కేసు నమోదైంది. నిందితుల జాబితాలో పలు కాలేజీల యజమానులు, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు కూడా ఉన్నారు.

హెచ్ఐవీ టీకా.. ట్రయల్ సక్సెస్!



ప్రయోగాత్మక వ్యాక్సిన్‌తో మనుషుల్లో యాంటీబాడీలు.. 'డ్యూక్ హ్యూమన్ వ్యాక్సిన్' శాస్త్రజ్ఞుల ఘనత

హెచ్ఐవీ.. హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్! 1980ల నుంచి మానవాళికి సవాలుగా మారిన ఈ మహమ్మారి పని పట్టే టీకాను తయారు చేశామని డ్యూక్ హ్యూమన్ వ్యాక్సిన్ ఇన్‌స్టిట్యూట్ (అమెరికా) శాస్త్రజ్ఞులు ప్రకటించారు. తాము అభివృద్ధి చేసిన హెచ్ఐవీ టీకా.. ట్రయల్‌లో పాల్గొన్నవారిలో విజయవంతంగా సమర్థమైన యాంటీబాడీలు ఉత్పత్తి అయ్యేలా చేసిందని వెల్లడించారు. మూడేళ్ల క్రితం ప్రపంచాన్ని వణికించిన కరోనాకు కొన్ని నెలల వ్యవధిలోనే టీకాను తయారుచేయగలిగిన శాస్త్రజ్ఞులకు.. హెచ్ఐవీకి టీకా అభివృద్ధి చేయడానికి ఇంత కాలం ఎందుకు పట్టింది? అంటే.. దానికి కారణం ఆ వైరస్‌కున్న ఒక ప్రత్యేకత. సాధారణంగా ఏదైనా వైరస్ మన శరీరంలోకి ప్రవేశించాక రోగనిరోధక శక్తి అప్రమత్తమై దాన్ని నిర్వీర్యం చేసే యాంటీబాడీలను రూపొందిస్తుంది. కానీ, హ్యూమన్ ఇమ్యూనో వైరస్.. పోలీసుల కన్నా వేగంగా పరిగెత్తే దొంగలాగా.. మన రోగనిరోధక వ్యవస్థ దానికి యాంటీబాడీలను తయారుచేసేలోపే ఉత్పరివర్తనం చెందుతూ (మ్యుటేషన్) తన రూపును మార్చేసుకుంటుంది. అయితే.. హెచ్ఐవీ బారిన పడినవారిలో కేవలం 10-15 శాతం మందిలో దాన్ని నిర్వీర్యం చేయగలిగే 'బ్రాడ్‌లీ న్యూట్రలైజింగ్ యాంటీబాడీస్ (బ్నాబ్స్)' ఉత్పత్తి అవుతాయి. హెచ్ఐవీ ఎన్ని రూపాలు మార్చుకున్నా వాటి పని పట్టే యాంటీబాడీలు ఇవి. హెచ్ఐవీ సోకనివారిలో కూడా టీకా ద్వారా యాంటీబాడీలను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పరిశోధకులు 1985 నుంచి కృషి చేస్తున్నారు. ఈ టీకా తయారీలో భాగంగా వారు హెచ్ఐవీ పైభాగం(ఔటర్ కోట్/ఎన్వలప్)లోని 'మెంబ్రేన్ ప్రాక్సిమల్ ఎక్స్‌టర్నల్ రీజియన్'ను లక్ష్యంగా చేసుకున్నారు. హెచ్ఐవీ ఎన్నిసార్లు ఉత్పరివర్తనం చెందినా.. ఆ వైరస్‌లో అస్సలు తేడా రాదు. ఆ భాగాన్ని టార్గెట్ చేసి తాము రూపొందించిన ఈ వ్యాక్సిన్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు స్ట్రెయిన్ల హ్యూమన్ ఇమ్యూనో వైరస్‌లను నిర్వీర్యం చేయగలదని వారు చెబుతున్నారు. హెచ్ఐవీలో రెండు రకాల ప్రధాన జాతులు.. మళ్లీ వాటిలో లెక్కకు మిక్కిలిగా ఉపజాతులు ఉన్నాయి. వాటిలో హెచ్ఐవీ-1 ప్రపంచమంతా విస్తరించగా.. హెచ్ఐవీ-2 రకం కేవలం పశ్చిమ ఆఫ్రికాలో మాత్రమే ఉంది. టీకా హెచ్ఐవీ-1లోని ఉపజాతులపై పనిచేస్తుందని రూపకర్తలు వెల్లడించారు.

ట్రయల్ ఇలా..

ఫేజ్ 1 క్లినికల్ ట్రయల్‌లో భాగంగా 2019లో 24 మందిని ఎంపిక చేసుకుని వారిలో నలుగురికి ప్లాసిబో (ఉత్తుత్తి మాత్రలు), మిగతావారికి టీకా నాలుగు డోసులు వేయాలని నిర్ణయించారు. కానీ, టీకా వేసుకున్నవారిలో మూడు డోసుల తర్వాత ఒకరికి అందులో ఉన్న 'పాలీఇథిలీన్ గ్లైకాల్ కత తీవ్రమైన ఎలర్జీ రావడంతో ట్రయల్స్‌ను నిలిపివేశారు. 24 మందిలో ఐదుగురికి 4 డోసులూ వేయగా.. 15 మందికి 2 డోసులే వేశారు. 2 డోసుల టీకా వేయించుకున్నవారిలో న్యూట్రలైజింగ్ యాంటీబాడీస్ ఉత్పత్తి అయినట్టు పరిశోధకులు గుర్తించారు.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో భారీ కుదుపులు

ఒకరి మృతి, 30 మందికి గాయాలు



బ్యాంకాక్, మే 21 : లండన్ నుంచి సింగపూర్ వెళ్తున్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానానికి తీవ్రమైన కుదుపులు(టర్బులెన్స్) రావడంతో ఒక ప్రయాణికుడు మృతి చెందగా... 30 మంది గాయాలపాలయ్యారు. లండన్ హీత్రూ విమానాశ్రయం నుంచి సింగపూర్ వెళ్తున్న ఎస్ క్యూ321 విమానం అండమాన్ సముద్రంపై 37వేల అడుగుల ఎత్తులో ఉండగా... కేవలం మూడు నిమిషాల్లోనే 31వేల అడుగులకు దిగిపోయింది. దీంతో, విమానాన్ని అత్యవసరంగా బ్యాంకాక్‌లోని సువర్ణభూమి అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ బోయింగ్ 777-300ఈఆర్ విమానంలో 211 మంది ప్రయాణికులు, 18 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ముగ్గురు భారతీయులు. మృతి చెందిన 73 ఏళ్ల బ్రిటీష ప్రయాణికుడి కుటుంబానికి సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంతాపం తెలియజేసింది. వాతావరణ రాడార్ నుంచి దీనికి సంబంధించి ఎటువంటి సూచనలు లేకపోవడంతో పైలెట్ ముందుగా ప్రయాణికులను హెచ్చరించలేకపోయినట్లు నిపుణులు చెబుతున్నారు. విమానంలో కుదుపుల ఘటనలు సాధారణమే అయినప్పటికీ ప్రయాణికులు మరణించిన ఘటనలు అత్యంత అరుదు. 1997 డిసెంబరులో యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టోక్యో నుంచి హోనొలులుకు వెళుతుండగా కుదుపులు చోటు చేసుకుని ఒక ప్రయాణికుడు మరణించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ ఇటువంటి అనుకోని కుదుపుల నుంచి విమాన ప్రయాణికులు క్షేమంగా ఉండేందుకు అన్ని వేళలా సీటుబెల్ట్ ధరించి ఉండాలని సూచిస్తోంది. వాతావరణ మార్పులు ఈ కుదుపులకు దారితీస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

బెయిల్‌కు ముందు పోలీస్ స్టేషన్‌లో
బర్గర్లు, పిజ్జాలు.. రాచమర్యాదలు!

పుణెలో మద్యం మత్తులో ఇద్దర్ని బలిగొన్న బాలుడికి వీఐపీ ట్రీట్‌మెంట్

ముంబై/పుణె, మే 21: పుణెలో ఓ బాలుడు (17) మద్యం మత్తులో లగ్జరీ కారును అతి వేగంగా నడిపి... బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను బలిగొన్న ఘటన, రోడ్డు ప్రమాదాలపై 300 పదాల్లో వ్యాసం రాయమంటూ ఆ బాలుడికి 15 గంటల్లోనే స్థానిక కోర్టు బెయిల్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుసుకోగా.. పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తీసుకెళ్లి పిజ్జాలు, బర్గర్లు తినిపించారని, రాచమర్యాదలు చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిందితుడు బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి కొడుకు కావడంతో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొంచారన్న ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పుణె పోలీసు కమిషనర్ అమితేష్ కుమార్ వివరణ ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌లో నిందితుడికి స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్టు తేలితే సంబంధిత సిబ్బందిపై వేటు తప్పదని పేర్కొన్నారు. ఈ కేసులో కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, హోం మంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఐపీసీ 304, 304(ఏ) సెక్షన్ల కింద నమోదు చేశామన్నారు. నిందితుడిని మేజర్‌గా పరిగణించేందుకు అనుమతి కోరగా కింది కోర్టు తిరస్కరించిందని, దీనిపై జిల్లా సెషన్స్ కోర్టును ఆశ్రయించామన్నారు. నిందితుడి రక్త పరీక్ష నివేదిక రావలసి ఉందన్నారు. అయితే ప్రమాదానికి ముందు నిందితుడు వెళ్లిన బార్‌కు మంగళవారం పోలీసులు సీల్ వేశారు. నిందితుడి తండ్రి, ఆ బార్ యజమాని, మేనేజర్లు, సిబ్బందిని (మొత్తం ఏడుగుర్ని) అరెస్టు చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 24 ఏళ్ల అనీశ్ అవధీయా, అశ్వినీ కోష్టా మధ్యప్రదేశ్‌కు చెందిన వారు. కాగా, నిందితుడైన బాలుడి తండ్రి అరెస్టు నుంచి తప్పించుకునేందుకు పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. అతను ఎప్పుడూ వాడే కార్లను వివిధ మార్గాలవైపు పంపాడు. తాను మాత్రం స్నేహితుడి కారు తీసుకొని పారిపోయే ప్రయత్నం చేశాడు. కాని జీపీఎస్ ఆధారంగా పోలీసులు ఆ కారును గుర్తించారు.


ఓ తల్లిని బలిగొన్న ట్రోలింగ్!

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): తన నిర్లక్ష్యం వల్లే ఓ చిన్నారి కింద పడ్డాడంటూ నెటిజన్లు ఆడిపోసుకోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నై శివారు ప్రాంతం తిరుముల్లైవాయిల్ రెసిడెన్షియల్ క్వార్టర్స్‌లోని ఓ ఫ్లాట్‌లో ఐటీ ఉద్యోగులు వెంకటేశ్, రంభ దంపతులు నివసిస్తున్నారు. వారికి ఏడు మాసాల పసిబిడ్డ ఉన్నాడు. నెల క్రితం ఆ చిన్నారి ప్రమాదవశాత్తు ఇంటి బాల్కనీ నుంచి జారి కింది ఫ్లాట్ సన్‌షేడ్‌పై పడ్డాడు. స్థానిక యువకులు ఆ బిడ్డను కాపాడారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. తొలుత పసికందును కాపాడిన యువకులపై ప్రశంసలు కురిపించిన నెటిజన్లు.. ఆ తర్వాత తల్లి రంభపై విమర్శల దాడి చేశారు. ఇంటి చుట్టుపక్కల వారు కూడా సూటిపోటి మాటలనడంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. వెంకటేశ్.. భార్యాపిల్లలతో కోయంబత్తూరు జిల్లా కారమడైలోని అత్తగారింటికి వెళ్లాడు. భార్యకు కౌన్సిలింగ్ ఇప్పించాడు. అయినా బయటపడలేకపోయిన రంభ.. ఇటీవల ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

గ్లోబల్ సిటీ సూచీలో.. హైదరాబాద్‌కు 564వ స్థానం

లండన్, మే 21: ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీ ఇండెక్స్-2024లో భారతీయ నగరాలు పేలవమైన ర్యాంకులను సాధించాయి. 163 దేశాలకు చెందిన వెయ్యి నగరాలకు ఎకనామిక్స్, హ్యూమన్ క్యాపిటల్, జీవన నాణ్యత, పర్యావరణం, గవర్నెన్స్ కేటగిరీల్లో ఇచ్చిన ర్యాంకులు మంగళవారం విడుదలయ్యాయి. గవర్నెన్స్ కేటగిరీలో జాబితాలోని భారతీయ నగరాలన్నింటికీ 380వ ర్యాంకు వచ్చింది. హైదరాబాద్ నగరం 564వ ర్యాంకును సాధించింది. కేటగిరీల వారీగా చూస్తే.. హైదరాబాద్ నగరం ఎకనామిక్స్‌లో 253, హ్యూమన్ క్యాపిటల్‌లో 524, జీవన నాణ్యతలో 882, పర్యావరణంలో 674, గవర్నెన్స్‌లో 380వ స్థానాల్లో నిలిచింది. ఎకనామిక్స్‌లో దేశ ఆర్థిక రాజధాని ముంబై(గ్లోబల్ ర్యాంకు-427)ని ఢిల్లీ అధిగమించింది. ఎకనామిక్స్‌లో ఢిల్లీకి 51, ముంబైకి 126.. హ్యూమన్ క్యాపిటల్‌లో వరుసగా 51, 126 ర్యాంకులను సాధించాయి. పర్యావరణంలో ఢిల్లీ పేలవమైన ర్యాంకు(973)ను పొందింది. ఈ జాబితాలో చిట్టచివరి స్థానాన్ని(1000వ ర్యాంకు) ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ సాధించింది.

లోకం తీరు



మెడికల్ కాలేజీల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- నేటి నుంచే సమ్మెకు నిర్ణయం
- సీఈవో మీనాకు సవివర లేఖ
- రోగుల కోసం ప్రత్యేక రాయితీలు
- ఉచిత సర్జరీలు చేయాలని నిర్ణయం
- ఫీజు, బెడ్ చార్జీలు లేకుండా సేవలు
- ప్రైవేటు కాలేజీల అసోసియేషన్ తీర్మానం
- సమ్మె విషయంలో ఆస్పత్రుల తలోదారి?

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఏపీ ప్రైవేటు మెడికల్ కాలేజీల అసోసియేషన్ స్పష్టం చేసింది. మంగళవారం విజయవాడలో సమావేశమైన అసోసియేషన్ ఈ మేరకు తీర్మానించింది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు తోడుగా ప్రైవేటు ఆస్పత్రులు కూడా సమ్మెలోకి దిగాయి. కరోనా చికిత్సల బిల్లులు నిలిపివేశారని, ఇప్పుడు ఆరోగ్యశ్రీ బిల్లుల రెండు నుంచి మూడు సంవత్సరాలుగా పేరుకుపోయాయని కాలేజీలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర ఆర్థిక భారాలతో ఆస్పత్రులను నిర్వహించలేని పరిస్థితిని ఏర్పడిందని సమావేశంలో పలువురు సభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించలేమని ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే, ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినా రోగులు ఇబ్బందులు పడకూడదని అసోసియేషన్ భావించింది. పేద రోగులను దృష్టిలో పెట్టుకుని వారికి అసౌకర్యం కలగకుండా.. తమ ఆస్పత్రుల్లో చేరిన రోగుల దగ్గర నుంచి డాక్టర్ ఫీజు తీసుకోకూడదని నిర్ణయించారు. డాక్టర్ ఫీజుతో పాటు వార్డుల్లో బెడ్ చార్జీలు, సర్జరీలు ఉచితంగా చేయాలని అసోసియేషన్ తీర్మానించింది. కేవలం శస్త్ర చికిత్సకు అయ్యే మందులు, వైద్య పరీక్షలకు అయ్యే ఖర్చులు మాత్రమే రోగుల నుంచి తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే, ఎమర్జెన్సీ కేసుల్లో కూడా డాక్టర్ ఫీజులు, కన్సల్టేషన్ చార్జీలు, వార్డు చార్జీలు, ఇన్వెస్టిగేషన్ చార్జీలు వసూలు చేయరాదని నిర్ణయించారు. మందులు, ఇతర సౌకర్యాలకు మాత్రమే రోగులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆస్పత్రుల్లో ఉన్న ఆరోగ్యశ్రీ రోగులకు మాత్రం వైద్య సేవలు యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించారు.

ఎన్నికల అధికారికి లేఖ

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనాకు అసోసియేషన్ లేఖ రాసింది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇచ్చామని సభ్యులు లేఖలో పేర్కొన్నారు. గత కొన్నేళ్ల నుంచి కాలేజీలకు బకాయిలున్నాయని, కరోనా సమయంలో చాలా మంది రోగులకు సేవలు చేశామని, ఇప్పటికీ ఆ బిల్లులు విడుదల చేయలేదని తెలిపారు. కొన్నేళ్ల క్రితం నిర్ణయించిన ధరలతోనే ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేస్తున్నామని, వీటిని రివైజ్ చేయమని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే మెడికల్ కాలేజీలకు విద్యార్థులు చెల్లించే ఫీజులు చాలా తక్కువగా ఉన్నాయని, మరోవైపు ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు లేఖలో వివరించారు. ఫ్యాకల్టీకి, వైద్యులకు, సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

సమ్మె.. సందేహమే!

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్.. సమ్మెకు దిగుతున్నట్లు ట్రస్ట్ సీఈవోకి, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లేఖ ఇచ్చింది. బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. అయితే, ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేయగలరా? ఆస్పత్రులన్నీ అసోసియేషన్ నిర్ణయాన్ని గౌరవించి సేవలు నిలుపుతాయా అంటే ప్రశ్నార్థకంగానే ఉంది. మూడు నెలల క్రితం ఇలానే సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, ఏ ఆస్పత్రీ అసోసియేషన్ నిర్ణయాన్ని పట్టించుకోలేదు. ఏ ఆస్పత్రికి ఆ ఆస్పత్రి ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాయి. అసోసియేషన్ పిలుపు ఇవ్వడం తప్ప ఏ రోజూ ఆస్పత్రులు పాటించిన దాఖలాలు లేవు. మరి ఈసారి ఏం చేస్తారనే విషయం ఆసక్తిగా మారింది.

మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు కన్నుమూత

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి



కొవ్వూరు, మే 21: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమీందార్ పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు)(71) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఎన్టీఆర్ పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణబాబు కొవ్వూరు నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో ఓటమిపాలైనా 2004లో మరోసారి విజయం సాధించారు. 2012లో వైసీపీలో చేరిన ఆయన ప్రస్తుతం ఆ పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు. కృష్ణబాబు మృతి పట్ల టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యేగా కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృష్ణబాబు విశేష సేవలు అందించారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణబాబు ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రహస్యంగా విశాఖకు..

- మొన్న విజయానంద్..నిన్న సీఎస్ జవహర్‌రెడ్డి

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులు ఇటీవల రహస్యంగా విశాఖపట్నం పర్యటనకు వస్తున్నారు. ఈ విషయాన్ని పత్రికలకు, ఇతరులకు తెలియనీయవద్దని జిల్లా అధికారులను ప్రత్యేకంగా కోరుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కే విజయానంద్ విశాఖకు వచ్చారు. ఆ రెండు రోజులపాటు ఆయన ఎక్కడకు వెళితే అక్కడికి ఆ ప్రాంత విద్యుత్ శాఖ అధికారులను ముందుగానే పంపించి, సహాయ సహకారాలు అందేలా విశాఖ సర్కిల్ ఉన్నతాధికారి చూసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కూడా రెండు రోజులు ఉత్తరాంధ్ర పర్యటన చేశారు. విజయనగరం జిల్లాకు వెళ్లి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులను పరిశీలించారు. విశాఖ జిల్లాలో ఆయన ఏవో భూములు పరిశీలించినట్టు చెబుతున్నారు. ఆ వ్యవహారాలతో పాటు వైసీపీ మళ్లీ గెలిస్తే జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయడానికి ముందస్తు ఏర్పాట్లపై మంత్రి బొత్స, వైవీ సుబ్బారెడ్డితో చర్చించారని విశ్వసనీయ సమాచారం.

బాబుకు కోర్టు అనుమతి అక్కర్లేదు: ఆనందబాబు

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు విదేశాలకు వెళ్తే వైసీపీ నేతలకు ఏమిటి నొప్పని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్ మాదిరి ఇక్కడ దోచుకొని విదేశాల్లో దాచుకొని హవాలా వ్యవహారాలు నడిపే అలవాట్లు ఆయనకు లేవు. జగన్ ఈ దేశం నుంచి కాలు బయట పెట్టాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలి. లేకపోతే కదలలేరు. ఆయన మాదిరి చంద్రబాబుకు కోర్టు అనుమతులు అక్కర్లేదు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు తప్ప ఆయనపై ఈడీ కేసులు లేవు' అని ఆనందబాబు అన్నారు.

జగన్‌ను నమ్ముకున్నవాళ్లు బుగ్గిపాలే: బొండా ఉమ

జగన్‌ను నమ్ముకుంటే ఎవరైనా, ఎప్పుడైనా బుగ్గిపాలవ్వడమే తప్ప బాగుపడిన చరిత్ర లేదని మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ కోసం చట్టాన్ని అతిక్రమిస్తే జైలు పాలయ్యేది అధికారులే. సిట్ రిపోర్ట్‌ను వెంటనే డీజీపీ బయటపెట్టాలి. టీడీపీ నేతలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి. సస్పెండ్ అయిన అధికారుల, అరాచకం సృష్టించిన నేతల కాల్ డేటాను బయటకు తీసి అరెస్టు చేయాలి' అని బొండా డిమాండ్ చేశారు.

హింసాత్మక ఘటనలపై పోలీసుల చర్యలేవి?: కనకమేడల

'మాచర్లలో టీడీపీ కార్యకర్త గొంతుకోసి నడిరోడ్డుపై చంపారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందే వంద హింసాత్మక ఘటనలు జరిపినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని మాజీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. మంగళవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'సిట్ లోతుగా దర్యాప్తు చేసి అసలు కుట్రదారులను బయటపెట్టాలి. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర ఏజెన్సీలతో రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై విచారించాలి. ప్రాథమిక బాధ్యులను వెంటనే కౌంటింగ్ కేంద్రాల వద్ద విధుల నుంచి తొలగించాలి' అని కోరారు.

ఆరోగ్యశ్రీలో కూడా జగన్నాటకమే: దేవినేని ఉమా

ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చి జగన్ నాటకమాడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రజల ఆరోగ్యాన్ని జగన్ గాలికి ఒదిలేశారు. ఆసుపత్రులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.1,500 కోట్లు చెల్లించకుండా అస్మదీయులకు రూ.15వేల కోట్లు తరలించారు. ప్రైవేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీని నిలిపేయడం జగన్ పాలన వైఫల్యానికి సాక్ష్యం. పర్సంటేజీల కోసం సీఎంవోలో ఎవరెవరికి ఏం చేశారో అన్నీ బట్టబయలవుతాయి' అని దేవినేని హెచ్చరించారు.

కాంగ్రెస్ వస్తే ఏపీకి ప్రత్యేక హోదా

- సీడబ్ల్యూసీ సభ్యులు రుద్రరాజు, కొప్పుల రాజు, రఘువీరారెడ్డి

న్యూఢిల్లీ, మే 21(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని లోక్‌సభ స్థానాలకు జరిగే ఎన్నికలలో ఇక్కడ స్థిరపడిన తెలుగువాళ్లందరూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికే మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, కొప్పులరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏపీ భవన్ దగ్గర ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని స్పష్టంచేశారు.

సిట్ బోగస్..న్యాయ విచారణతోనే వాస్తవాలు: నారాయణ

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లపైన నియమించిన సిట్ బోగస్. వాస్తవాలు బయటికి రావాలంటే న్యాయ విచారణ జరిపించాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'సిట్ ఏర్పాటుతో ఎటువంటి ఉపయోగం లేదని మేం ముందే చెప్పాం. ఏపీలో జగన్‌కు, వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి తరలివచ్చిన ఓటర్లు జగన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఎన్నికల హింస నుంచి ప్రజలను కాపాడాల్సిన జగన్ తనకేమీ సంబంధం లేదన్నట్లు విదేశాలకు పారిపోవడం బాధ్యతారాహిత్యమే' అని నారాయణ అన్నారు.

ఈసీ అనుమతితో ఉపాధి పనులు చేపట్టండి: సీఎస్

అమరావతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం అనుమతితో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి సచివాలయం నుంచి తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనుల నిర్వహణకు ప్రస్తుతం మంచి అనువైన సీజన్ కావడంతో పెద్ద ఎత్తున పనుల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి 4న పెద్దకర్మ

- మే 13 నే మరణించింది
- కూటమికి 120 - 125 సీట్లు

ఖాయం: రఘురామరాజు



విజయనగరంలో మాట్లాడుతున్న రఘురామ, పక్కన అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజు

విజయనగరం(ఆంధ్రజ్యోతి), సీతమ్మధార(విశాఖపట్నం), మే 21: 'రాష్ట్రంలో రానున్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమే. వైసీపీ ప్రభుత్వానికి నూకలు చెల్లాయి. మే 13 నే మరణించింది. జూన్ 4న పెద్దకర్మ జరుగుతుంది' అని ఉండి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం విజయనగరం వచ్చిన ఆయన పైడితల్లి అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకున్నారు. తరువాత బంగ్లాలో అశోక్ గజపతిరాజు, అదితి గజపతిరాజుతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతరం విశాఖ సీతమ్మధారలోని ఓ ఫంక్షన్ హాలులో విశాఖ ఉత్తర నియోజకవర్గ కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. 'రిటర్న్ గిఫ్ట్ అందుకునేందుకు జగన్ సిద్ధంగా ఉండాలి. నేను పుట్టి పెరిగిన నేలకు నాలుగేళ్లపాటు రాకుండా నరకం చూపించారు. మా నాన్నమ్మ మరణించినపుడు కార్యానికి కూడా రానీయకుండా చేశారు. జగన్ ఓ ఉన్మాది. నన్ను అరెస్టు చేసిన రోజున పోలీసులు తాళ్లు తీసుకు రావటంతో ఉరి వేస్తారనుకున్నా. ఆరోజే నా పనిఅయిపోయిందని భయపడ్డా. ఆ తాళ్లతో నా రెండు కాళ్లూ కట్టేశారు. నన్ను పోలీసులు కొట్టిన విషయాన్ని ఎప్పటికీ మర్చిపోను. విశాఖలోనే సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తానని జగన్ అంటున్నారు. అయితే అది పిచ్చాసుపత్రిలో అయి ఉంటుంది. వైసీపీ నిర్ణయించుకున్న ముహూర్తం భూస్థాపితం అయ్యేందుకే. ఇంతటి కక్షపూరిత ప్రభుత్వాన్ని నేనెన్నడూ చూడలేదు. వేల ఎకరాల ఆస్తులను దాన ధర్మాలు చేసిన అశోక్ గజపతిరాజు వంటి సౌమ్యుడైన నాయకుడిని సైతం అల్లరి చేసి వేధింపులకు గురిచేశారు. ఏపీ చరిత్రలోనే ఇటువంటి గొప్ప కుటుంబం ఉండదు. ప్రభుత్వాన్ని నడపటం ముళ్లమీద నడకే అయినా చంద్రబాబు సీఎం అయిన వెంటనే సంపదను సృష్టించి అభివృద్ధి పథాన నడిపిస్తారు. నేను, అదితి గజపతిరాజు అసెంబ్లీలో అడుగు పెడతాం. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 120 నుంచి 125 సీట్లు రావడం ఖయం. వైసీపీకి దేవుడు అతి తీవ్రంగా కరుణిస్తే 50 సీట్లు, లేదంటే 25 సీట్లు వస్తాయి. నాకు తెలిసి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో కాలు పెట్టడు. ఎన్నికల సమయంలో చీఫ్ సెక్రటరీని సస్పెండ్ చేస్తే ఇంకా బాగుండేదన్నారు. తనకు తాను అతిగా ప్రేమించుకోవడం నార్సిజం వ్యాధి లక్షణం. ప్రస్తుతం జగన్ ఆ వ్యాధితో బాధపడుతున్నారు' అని రఘురామరాజు అన్నారు. విశాఖ సమావేశంలో ఎమ్మెల్సీ రఘువర్మ, కూటమి నాయకులు ఎండీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో తెలంగాణ సీఎం

- నేడు శ్రీవారిని దర్శించుకోనున్న రేవంత్‌రెడ్డి



తిరుమలలో మనవడితో అతిథిగృహంలోకి వెళుతున్న రేవంత్‌రెడ్డి

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని రచన అతిథిగృహానికి మంగళవారం రాత్రి 7.20 గంటలకు చేరుకున్న రేవంత్‌రెడ్డికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బస చేయనున్న ఆయన మనవడి పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చుకుని బుధవారం ఉదయం 8.15 గంటలకు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ రామకృష్ణ ప్రసాద్



తిరుమలలో జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

తిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో జస్టిస్ న్యాపతి విజయ్

మంత్రాలయం, మే 21: మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు.

ఏపీఈఏపీసెట్‌కు 94.31 % మంది హాజరు

జేఎన్టీయూకే, మే 21: ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించిన ఏపీఈఏపీసెట్-2024కు 56,982 మంది(94.31శాతం) హాజరయ్యారని సెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు.

'కౌన్సిల్, కమిషన్' పదాలను వాడితే చర్యలు

- ప్రభుత్వేతర సంస్థలకు సివిల్ సప్లయిస్ హెచ్చరిక

అమరావతి, మే 21 (ఆంధ్రజ్యోతి) : 'కౌన్సిల్, కమిషన్' అనే పదాలను ప్రభుత్వేతర సంస్థలు వాడటం చట్టవిరుద్ధమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు, సంఘాల పేరులో కౌన్సిల్ లేదా కమిషన్ అనే పదాలను ఉంటే వాటికి వెంటనే తొలగించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రకటనలో హెచ్చరించారు.

అప్పుల బాధతో ఉక్కు ఉద్యోగి ఆత్మహత్య

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), మే 21: అప్పుల బాధ తట్టుకోలేక ఓ ఉక్కు ఉద్యోగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. స్టీల్‌ప్లాంటు ఎస్ఎంఎస్ విభాగంలో జనరల్ ఫోర్‌మన్‌గా పనిస్తున్న తీగల చిరంజీవులు (55) సెక్టార్-11లోని క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న స్టీల్ ప్లాంటు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అక్కడ దొరికిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అప్పుల భారం భరించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చిరంజీవులు అందులో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు. స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఇటీవల కాలంలో ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదు. ఏప్రిల్ నెలకు సంబంధించిన జీతాలు మే 21వ తేదీ వచ్చినా ఇవ్వలేదు. వీటి కోసం మూడు రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అందరూ నేరస్థులే!

మహారాష్ట్రలోని పూణేలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోరాన్ని రోడ్డుప్రమాదంగా కాక, హత్యగా పేర్కొనడం సముచితంగా ఉంటుంది. ఖరీదైన లగ్జరీ కారును మద్యం మత్తులో రెండు వందలయాభై కిలోమీటర్ల వేగంతో నడుపుతూ ఒక మైనర్ బాలుడు చేసిన ఈ అకృత్యానికి ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దుర్మరణం పాలైనారు. హత్యాకాండకు అతడు ఒక్కడే బాధ్యుడు కాదు. పిల్లవాడికి రెండుకోట్ల ఖరీదైన కారిచ్చి, నచ్చినట్టుగా నడుపుకోమన్న తండ్రితో పాటు అనేకమంది వ్యక్తులు, వ్యవస్థలు ఈ పాపంలో భాగస్వాములు. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేట్టు చేయాల్సినవారు నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా వ్యవహరించి ఈ హత్యలో సూత్రధారులైనారు.

పద్దెనిమిదేళ్ళ యువకుడు కావడానికి ఇంకా నాలుగునెలలు ఉన్నదంటూ జువనైల్ బోర్డు రియలెస్టేట్ వ్యాపారి విశాల్ అగర్వాల్ పుత్రరత్నానికి వెంటనే బెయిల్ ఇచ్చింది. ఇద్దర్ని చంపినా, పిల్లవాడు కనుక పక్షంరోజులపాటు ట్రాఫిక్ పోలీసులతో కలిసిపనిచేయడం, మూడు వందల పదాల్లో ఓ వ్యాసం రాయడం వంటివి షరతులుగా విధించడం సమాజాన్ని ఆగ్రహానికి గురిచేశాయి. జూనియర్ అగర్వాల్‌ను అంతా కలిసికాపాడుతున్నారన్న విమర్శలు అధికమై, వ్యవహారం రాజకీయరంగు కూడా పులుముకోవడంతో పోలీసులు అయిష్టంగానైనా లోతుల్లోకి పోక తప్పలేదు. నిందితుడిని మేజర్‌గా పరిగణించాలని విన్నవించామనీ, బోర్డు అంగీకరించలేదని పోలీసులు అంటున్నారు కానీ, బెయిల్ వచ్చేలోగా ఆ కుర్రవాడికి వారు చేసిన రాచమర్యాదలు చూసినప్పుడు అది నమ్మశక్యంగా అనిపించడం లేదు.

పూణే వీధుల్లో ఈ ఖరీదైన కారు రిజిస్ట్రేషన్ కాకుండా మార్చినుంచి తిరుగుతోంది. నలభైఐదులక్షల రిజిస్ట్రేషన్ ఫీజు కట్టకుండా, నెంబరు ప్లేటు తీసుకోకుండా దానిని వాడుతున్నారు. మైనర్ కనుక ఆ బాలుడికి కారు డ్రైవింగ్ లైసెన్సు కూడా వచ్చి ఉండదు. అయినా, ట్రాఫిక్ పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు చూసీచూడనట్టు ఇన్నాళ్ళూ వదిలేశారు. ఇక, ఆ పిల్లవాడికీ, దాదాపు అదే వయసులో ఉన్న అతడి మిత్రబృందానికీ నిత్యం మద్యం అందించే రెండు బార్ల యజమానులూ ఈ పాపంలో భాగస్వాములే. మహారాష్ట్రలో పాతికేళ్ళు వచ్చేవరకూ మద్యం ముట్టరాదని అక్కడి చట్టం చెబుతోంది. కుర్రాడు కొత్త కారులో పోయి, మద్యం సేవించివస్తాడని తండ్రికే తెలిసినప్పుడు, పోలీసులకు ఇంతవరకూ చిక్కకుండా ఉంటాడా? మద్యం, లైసెన్సు, రిజిస్ట్రేషన్, అమిత వేగం ఇత్యాది విషయాల్లో అతడికి ఈ పాటికే చాలా మినహాయింపులు దక్కివుంటాయి. కఠిన శిక్షలు సామాన్యులకే కానీ, ధనికులు దండనకు అతీతులు.

రెండు కుటుంబాలవారికి తీవ్ర విషాదాన్ని మిగిల్చి, భవిష్యత్తును చీకటిమయం చేసిన ఈ ఘటన సమాజాన్ని కుదిపేసింది. ప్రతీ ఏటా వందలమంది రోడ్డుప్రమాదాల్లో ఈ దేశంలో కన్నుమూస్తున్నారు. వాటిలో అత్యధికం నివారించదగ్గవే. మానవ తప్పిదంతో పాటు, నిర్మాణంలో లోపాలు, నిర్వహణలో లోటుపాట్లు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కానీ, పూణే ఘటన యాక్సిడెంట్ కాదని, ధనబలం, నిర్లక్ష్యం, సాటి మనుషుల ప్రాణాలపట్ల లెక్కలేనితనం ఈ ఘటనకు దోహదం చేశాయని అందరికీ తెలుసు. కేవలం మైనర్ అన్నవాదనతో ఆ కుర్రవాడిని ఒడ్డునపడేయడానికి వ్యవస్థలన్నీ అంతగా ఎందుకు కష్టపడ్డాయో కూడా తెలుసు. ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఫడ్నవీస్ చాలా హామీలు ఇస్తున్నారు. నిందితుడిని మేజర్‌గా పరిగణించాల్సిందిగా సెషన్స్ కోర్టును కోరబోతున్నారట. బార్లు రెండూ మూతబడ్డాయి, వాటి యజమానులు, మేనేజర్లను అరెస్టుచేశారు. సినిమా ఫక్కీలో వెంటాడి మరీ నిందితుడి తండ్రిని సైతం అరెస్టుచేశారు. పోలీసులు నిందితుడినుంచి ఎప్పుడు సాంపిల్ తీసుకున్నారో తెలియదు కానీ, రక్తపరీక్షలో మద్యం ఛాయలు ఉండటం ఈ కేసులో ముఖ్యమైన అంశం. జువనైల్ జస్టిస్ బోర్డుముందు తాను మద్యానికి బానిసనంటూ నిందితుడు ఒప్పుకున్నాడని, తన భౌతికస్థితి, తాను ప్రయాణిస్తున్నవేగం ఎదుటివారి మరణానికి దారితీస్తాయన్న స్పృహ అతడికి ఉన్నదన్న వాదనతో ఈ కేసును రుజువుచేస్తామని పోలీసులు అంటున్నారు. అలాగే, కుమారుడి కార్యకలాపాలు, చర్యలమీద తండ్రికి పూర్తి అవగాహన ఉందనీ, అతడి అనుమతి లేదా ప్రోద్బలంతోనే పిల్లవాడు ఈ వరుస తప్పిదాలకు పాల్పడ్డాడని రుజువు చేయాల్సివుంటుంది. పిల్లవాడికి ఓ ఖరీదైన కారు ఇచ్చి, తాగినడుపుకోవడానికి అనుమతించిన తండ్రిని కఠినంగా శిక్షించగలిగితే ఓ బలమైన హెచ్చరిక అవుతుంది. ఇద్దరు అమాయకుల ప్రాణాలను బలితీసుకున్న ఈ ఘటనకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కారకులైనవారందరికీ శిక్షలు పడటం అవసరం.

బీజేపీ మనోరథం ఫలించేనా?





■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'నేను పన్నెండేళ్ల క్రితం రాహుల్ మాట్లాడిన ఒక వీడియోను చూశాను. ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తామని ఆయన ఈ వీడియోలో చెప్పారు. దేశ వనరుల్లో ముస్లింలకు తొలి హక్కు ఉంటుందని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, రాహుల్ ఒకే రకంగా మాట్లాడారు. అతి పురాతనమైన కాంగ్రెస్ పార్టీ ముస్లిం లీగ్ ఆలోచనా విధానంతో ఇప్పటికీ ఏకీభవించే మతతత్వ పార్టీ అని రుజువైంది" అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం నాడు పశ్చిమ బెంగాల్‌లో ఒక సభలో ఆరోపించారు. ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్ పూర్తయిన తర్వాతి నుంచీ ప్రధానమంత్రి కాంగ్రెస్‌ను హిందువులకు వ్యతిరేక పార్టీగా చిత్రించేందుకు సర్వయత్నాలు చేస్తున్నారు. ప్రజల ఆస్తులను కాంగ్రెస్ లాక్కొని దేశంలో ఎక్కువ మంది పిల్లలున్న వారికి, చొరబాటుదారులకు అప్పగిస్తుందన్నారు. ఏప్రిల్ 26న రెండో దశ పోలింగ్ తర్వాత మోదీ స్వరం మరింత తీవ్రంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, ఓబీసీ రిజర్వేషన్లను లాక్కొని ముస్లింలకు ఇస్తారని ప్రకటించారు. అయోధ్యలో రామమందిరానికి బాబ్రీ తాళం వేస్తారని కూడా ఆరోపించారు. రామమందిరాన్ని కాంగ్రెస్ బుల్డోజర్లతో కూల్చేస్తుందని అనేంత వరకూ ఆయన వెళ్లారు. ఒకవైపు తన బాల్యం ముస్లిం సమాజానికి చెందిన వారితోనే గడిచిందని, రంజాన్ మాసంలో గాజాపై బాంబు దాడులు ఆపాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును అభ్యర్థించానని చెబుతూనే మతపరమైన విభజనకు ఆస్కారం ఉన్న చోట్ల కాంగ్రెస్‌ను ముస్లింల అనుకూల పార్టీగా చిత్రించడంలో నరేంద్రమోదీ వెనుకాడలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసే వ్యాఖ్యల పట్ల ఆయనను వ్యక్తిగతంగా నిందించడంలో అర్థం లేదు. ఆయన మొత్తం భారతీయ జనతా పార్టీ, సంఘ్ పరివార్ సిద్ధాంతానికి అనుగుణంగానే మాట్లాడుతున్నారు. భారతీయ రాజకీయ యవనికపై హిందూ జాతీయవాదం 1980లలోనే ప్రబలంగా ఆవిష్కృతమైంది. రామజన్మ భూమి ఉద్యమం తర్వాత అది మరింత ఊపందుకుంది. 1990లో లాల్‌కృష్ణ అద్వాణీ రథయాత్ర జరిపినప్పుడు అనేక చోట్ల 'రామ్ ద్రోహి, దేశ ద్రోహి ఒకరే' అన్న నినాదాలతో పోస్టర్లు కనపడేవి. 1991లో పివి నరసింహారావు హయాంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా అవతరించిన బీజేపీ 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత వెంటనే ఫలితాలు సాధించలేకపోయినప్పటికీ ఏడేళ్ల తర్వాత 1998లో కేంద్రంలో అధికారంలోకి రాగలిగింది. దీనితో బీజేపీ విస్తరణను అడ్డుకోవడానికి కాంగ్రెస్‌తో పాటు అనేక శక్తులు చేతులు కలపవలసి వచ్చింది. అయినప్పటికీ పదేళ్ల యూపీఏ పాలన తర్వాత మళ్లీ ఒక పెను తుపానులా బీజేపీ అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చి పదేళ్లు పాలించింది. ఇప్పుడు బీజేపీ అధికారాన్ని శాశ్వతం చేసేందుకు నరేంద్రమోదీ మరోసారి ఇప్పుడు తీవ్ర యత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే నరేంద్రమోదీ వ్యాఖ్యలని మనం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. 'సాంస్కృతిక జాతీయవాదం భారతదేశాన్ని సమైక్యపరచడమే కాక, దేశాన్ని ఆధునిక, ప్రగతిశీల, సుసంపన్న దేశంగా మారుస్తుంది. లౌకికవాదం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ముఖ్యమైనవే కాని అవి ప్రజానీకాన్ని ప్రేరేపితం చేసేందుకు సరిపోవు.' అని మోదీ గురువు అద్వాణీ ఎప్పుడో అన్నారు.

వేలాది తెగలు, జాతులు, కులాలు, ఉపకులాలు, స్థానిక, ప్రాంతీయ భాషలు, మాండలికాలు, ఆచారాలు, పద్ధతులు ఉన్న వైవిధ్యభరితమైన సువిశాల భారతదేశంలో ఒక జాతీయ రాజ్యం (నేషన్ స్టేట్) దృక్పథం సరిపోదని చాలా మంది వాదించారు. యూరప్‌లో లాగా భారతదేశం ఒక జాతీయ రాజ్యంగా మారబోదని, భారత్‌లో ఒక ప్రపంచమే కనపడుతుందని విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ 1917లోనే అభివర్ణించారు. 'భారతదేశం వివిధ జాతుల, తెగల చారిత్రక ప్రదర్శన శాల' అని ప్రముఖ మెక్సికన్ కవి, భారతదేశంలో దౌత్యవేత్తగా ఉన్న అక్టావియో పాజ్ అన్నారు. పార్లమెంట్‌లో అత్యధిక మెజారిటీ ఉన్నప్పటికీ నెహ్రూ హిందీ భాషను జాతీయ భాషగా ప్రకటించలేకపోవడం భాషాపరంగా మన దేశ వైవిధ్యాన్ని స్పష్టం చేసిందని, ఇది మన దేశం జాతీయ రాజ్యంగా మారడంలో ఒక అడ్డంకి అని చెప్పినవారు కూడా ఉన్నారు. గాంధీజీ రాముడిని, రామరాజ్యాన్ని ఆదర్శ వ్యవస్థకు సూచికలుగా భావించారు కాని మత రాజ్యాన్ని ఆయన కూడా వాంఛించలేదన్న విషయం స్పష్టమే. అద్వాణీ నుంచి మోదీ వరకూ తమను మతతత్వ వాదులంటే అంగీకరించబోరు. తమది జాతీయవాదమని, ప్రజల మత విశ్వాసాలు, నమ్మకాలు, ఆచారాలు జాతీయ ఐక్యతకు ప్రతిబింబమని అద్వాణీ తన ఆత్మకథలో రాసుకున్నారు. బాబ్రీ మసీదు స్థానంలో రామమందిర నిర్మాణం కోసం ప్రజలు 500 సంవత్సరాలుగా పోరాడుతున్నారని ఆయన చెప్పారు.

మండల్ కమిషన్ నివేదికను విపిసింగ్ బయటకు తీసిన తర్వాత దానికి వ్యతిరేకంగా అద్వాణీ రథయాత్ర జరపడం కులపరమైన రాజకీయ చైతన్యాన్ని ఎదుర్కోవడానికి మతాన్ని ఒక ఆయుధంగా బీజేపీ ఉపయోగించుకోవడమే దాని సైద్ధాంతిక దృక్పథం అని అర్థం చేసుకోవడానికి వీలు కలిగింది. నిజానికి దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన సమగ్ర మానవతా వాదంలోనే ఈ దృక్పథం మూలాలున్నాయి. అద్వాణీ రథయాత్ర జరిగి దాదాపు మూడు దశాబ్దాలు గడిచినప్పటికీ ఈ దృక్పథం మారలేదని ఇవాళ దేశంలో మోదీ సారథ్యంలోని బీజేపీకీ, కాంగ్రెస్ సారథ్యంలో ఏకమైన వివిధ సామాజిక శక్తులకూ మధ్య జరుగుతున్న రాజకీయ పోరు, వాద ప్రతివాదాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. 1991 తర్వాత దేశంలో అనేక సామాజిక రాజకీయ, ఆర్థిక మార్పులు జరిగాయి. వివిధ సామాజిక శక్తులు ఉత్తరప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చాయి. దేశంలో వెనుకబడిన వర్గాలు, బడుగు, బలహీన వర్గాలు సమాజంలో వివిధ రంగాల్లో తమ భాగస్వామ్యం కోసం చైతన్యవంతమైన ప్రయత్నాలు, పోరాటాలు చేశారు. ఆర్థిక సంస్కరణల వల్ల అనేక వర్గాలకు అవకాశాలు విస్తరించాయి. ఈ సంధి దశలో అనేక ప్రభుత్వాలు మారాయి. కాని 2014లో నరేంద్రమోదీ భారీ మెజారిటీతో అధికారంలోకి రావడం అన్ని మార్పులను అధిగమించిన ఉధృత పరిణామం. ఇది పలువురు సామాజికవేత్తల అంచనాకు భిన్నంగా కులానికీ, మతానికీ మధ్య వైరుధ్యాలను కూడా అధిగమించిందనడంలో సందేహం లేదు. మోదీ రెండుసార్లు అఖండమైన మెజారిటీతో అధికారంలోకి రావడాన్ని బట్టి చూస్తే రవీంద్రనాథ్ టాగోర్ లాంటి వారి ఆలోచనలకు భిన్నంగా భారతదేశం ఒక జాతీయ రాజ్యంగా మారే అవకాశాలున్నాయా అన్న అనుమానాలకు కూడా ఆస్కారం కలిగింది.

అందువల్లే 2024 ఎన్నికలకు అంత ప్రాధాన్యత ఏర్పడింది. గత పది సంవత్సరాల్లో బీజేపీ తన సైద్ధాంతిక భూమిక ప్రజల్లో విస్తరించేందుకు అనేక చర్యలు చేపట్టింది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ చట్టం, కాశీ కారిడార్, త్రిపుల్ తలాఖ్ రద్దు, పార్లమెంట్‌లో రాజదండ ప్రతిష్ఠాపన నుంచి రామమందిర నిర్మాణం వరకూ బీజేపీ దేశంలో ఉన్న మెజారిటీ హిందువులకు తానే ప్రతినిధిగా నిరూపించుకునేందుకు చేయాల్సిన పనులన్నీ చేసింది. రాష్ట్రాల స్థాయిలో కూడా భారతీయ జనతా పార్టీ మతాన్ని, ఆలయాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చుకుంది. బీజేపీ సోషల్ మీడియాలో మతమే దాని ప్రధాన రాజకీయంగా మారిందనడంలో సందేహం లేదు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే ఆరునెలల్లో ఆక్రమిత కశ్మీర్ భారత్‌లో ఏకమవుతుందనే కొత్త ప్రచారమూ ఊపందుకుంది. మోదీ నుంచి అన్నామలై వరకూ ఇవాళ బీజేపీ సైద్ధాంతిక విశ్వరూపాన్ని మనం ఆకళింపు చేసుకోవల్సి ఉన్నది. అందువల్ల మోదీ హిందూ ముస్లింల గురించి అధికంగా మాట్లాడుతున్నారని అనడం కొత్త విషయాన్ని చెప్పినట్లు కాదు. ముస్లింల ప్రస్తావన తెచ్చి వారు పరాయివారు అనే ధ్వని వచ్చేలా మాట్లాడడం బీజేపీ వర్గాలకు కొత్త కాదు. సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్ అని చెప్పే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లింల గురించి ప్రత్యేక ప్రస్తావన ఏ మాత్రం కనిపించదు. అదే కాంగ్రెస్ అన్ని వర్గాల వారితో పాటు ముస్లింల గురించి ప్రస్తావిస్తే బీజేపీకి అది మహాపాపంలా కనిపించడంలోనూ ఆశ్చర్యం లేదు.

ఈ నేపథ్యంలో భారతదేశం ఎటువైపు వెళుతున్నది అని తెలుసుకోవడానికి ఈ ఎన్నికలు దోహదం చేస్తాయనడంలో అతిశయోక్తి లేదు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిపిన తర్వాత దేశవ్యాప్తంగా ప్రజలు సానుకూలంగా స్పందించారన్నది అవాస్తవం కాదు. దేశంలో అనేక పట్టణ ప్రాంతాల్లో ప్రజలు బీజేపీ సానుభూతిపరులుగా కనిపిస్తున్నారు. వారితో తార్కికంగా వాదించడం అంత సులభం కాదు. కాని ఈ సానుకూలత ఎల్లెడలా విస్తరించిందా అన్నది చర్చనీయాంశం. కాని రామమందిర నిర్మాణం, కశ్మీర్‌లో 370 అధికరణ ప్రజల అంత శ్చేతనలో ఇమిడిపోయినందువల్ల తమకే భారీగా ఓట్లు పడతాయని బీజేపీ నేతలు భావిస్తున్నారు. బీజేపీ ఆశించిన విధంగా ఆ పార్టీకి 350 సీట్లు దక్కితే జాతీయ రాజ్యాన్ని ఏర్పర్చేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతాయనడంలో ఆశ్చర్యం లేదు. కాని ప్రజలు రామమందిర ప్రభావం నుంచి తేరుకుని వాస్తవాలు గ్రహించడం మొదలు పెట్టారని, మొదటి రెండు దశల్లో పోలింగ్‌లోనే ఇది స్పష్టమైందని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చెబుతున్నాయి. భారతదేశ ప్రజలు మత భావనల వెల్లువలో కొట్టుకుపోయి ఆర్థిక, సామాజిక న్యాయాన్ని విస్మరించబోరని ఆ పక్షాలు వాదిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, బిహార్, హర్యానా, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఒడిషాతో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీ సీట్లు తగ్గిపోతాయని చెప్పేవారి సంఖ్య కూడా తక్కువేమీ లేదు. అందువల్ల ఈ ఎన్నికలు బీజేపీ చిరకాల ఆకాంక్షకూ, ప్రజల ఆలోచనా విధానానికీ మధ్య వ్యత్యాసాన్ని ఎంతమేరకు ప్రతిఫలిస్తాయో వేచి చూడాల్సి ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

> అయోధ్యలో రామమందిర నిర్మాణం, శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరిపిన తర్వాత దేశ వ్యాప్తంగా ప్రజలు సానుకూలంగా స్పందించారన్నది అవాస్తవం కాదు. దేశంలో అనేక పట్టణ ప్రాంతాల్లో ప్రజలు బీజేపీ సానుభూతిపరులుగా కనిపిస్తున్నారు. వారితో తార్కికంగా వాదించడం అంత సులభం కాదు. ఈ సానుకూలత ఎల్లెడలా విస్తరించిందా అన్నది చర్చనీయాంశం. రామమందిర నిర్మాణం, కశ్మీర్‌లో 370 అధికరణ ప్రజల అంతశ్చేతనలో ఇమిడిపోయినందువల్ల తమకే భారీగా ఓట్లు పడతాయని బీజేపీ నేతలు భావిస్తున్నారు.

ఎన్నికల్లో 'నెటిజన్స్' ఎవరి వైపు?

కోవిడ్ సంక్షోభం తర్వాత జనంలో సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగింది. దీంతో పార్టీలు సోషల్ మీడియా ద్వారా ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు ప్రారంభించాయి. అయితే, 2019 ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఫేస్‌బుక్, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చతికిలపడింది. ఇప్పుడు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఈ సమయంలో రాజకీయ పార్టీల అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో ఉన్న ఎంగేజ్‌మెంట్ గత కొన్ని రోజులుగా ఎలా మారుతూ వచ్చిందో పీపుల్స్ పల్స్ బృందం అధ్యయనం చేసింది.

గత నెల రోజులుగా జాతీయంగా ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ, బీజేపీ విధానాలపై చేస్తున్న విశ్లేషణాత్మక వీడియోల్ని సగటున 2 కోట్ల మంది వ్యూయర్స్ చూశారు. 1.9 కోట్ల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్న ఈ చానెల్‌లో గత మూడు వారాల్లో అప్‌లోడ్ చేసిన వీడియోలు 11 కోట్ల మందికి చేరాయి. అదే సమయంలో 2.3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ య్యూ ట్యూబ్ చానెల్‌లో గత మూడు వారాల్లో పెట్టిన అత్యధిక వీడియోలకు వచ్చిన వ్యూస్ వేలల్లోనే ఉన్నాయి. 52 లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూ ట్యూబ్ చానెల్‌లో గత మూడు నాలుగు వారాల్లో అప్‌లోడ్ చేసిన వీడియోలకు లక్షల్లో వ్యూస్ వచ్చాయి. ఈ వీడియోల్ని కేవలం చూసి వదిలేస్తున్నారా? లేక వీటి ప్రభావం ఎన్నికలపై ఉంటుందా? అనేది ఎన్నికల ఫలితాల తర్వాత తెలుస్తుంది.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నాటికి యూ ట్యూబ్‌లో జాతీయంగా బీజేపీకి సుమారు 51 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు 15.7 శాతం పెరిగి 59 లక్షలకు చేరింది. 5 నెలల కింద కాంగ్రెస్‌కి 38 లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు అది 27 శాతం పెరిగి 48 లక్షలకు చేరింది. నరేంద్రమోదీ ఇన్‌స్టాగ్రాంలో 8.9 కోట్ల మంది ఫాలోవర్స్‌తో శాచురేషన్ పాయింట్‌కి చేరుకున్నారు. 80 లక్షల ఫాలోవర్స్‌తో రాహుల్ గాంధీ ఆయనకు చాలా దూరంలో ఉన్నారు. కానీ, గడిచిన ఏడాదికాలంలో ఆయన ఫాలోవర్స్ గణనీయంగా పెరిగారు. ఇలాంటి పెరుగుదల మోడీ ఖాతాలో కనిపించలేదు. భారత్ జోడో యాత్ర తర్వాత రాహుల్ గాంధీకి ఇన్‌స్టాగ్రాంలో ఫాలోవర్స్ 18 లక్షల నుంచి 27 లక్షలకు పెరిగారు. పక్షంరోజుల కింద ఆయన ఫాలోవర్స్ సంఖ్య 70 లక్షలకు రాగా, ఐదురోజుల క్రితం అది 80 లక్షలకు చేరింది. ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీకి 79 లక్షల మంది ఫాలోవర్స్, కాంగ్రెస్ ఫాలోవర్స్ 54 లక్షలకు చేరారు. రామమందిర్ ప్రారంభోత్సవం వరకు మోదీ ఇన్‌స్టాగ్రాం ఎంగేజ్‌మెంట్ అధికంగా ఉండేది. కానీ, ఆ తర్వాత వారం నుంచి తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు ఆయనకు రాహుల్ గాంధీ కన్నా పది రెట్లు అధిక వ్యూసే వస్తున్నా, రాహుల్ గాంధీ ఖాతాకు ఉన్నంత ఎంగేజ్‌మెంట్ మోదీ ఖాతాకు లేదు. అదానీ, అంబానీ గురించి మోదీ మాట్లాడిన తర్వాత దానికి కౌంటర్‌గా రాహుల్ గాంధీ చేసిన రెండు వీడియోలకు 3 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇవన్నీ దేనికి సంకేతం?



తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారిక ఖాతాల్లో పోస్ట్ చేసిన కంటెంట్ కంటే, రాష్ట్ర బీజేపీ షేర్ చేసిన కంటెంట్‌కి ఎంగేజ్‌మెంట్ పెరిగింది. ఈ కోణంలో నెటిజన్స్ షిఫ్ట్ అవుతున్న తీరును అధ్యయనం చేస్తే ఆంధ్రాలో ఎక్కువమంది కూటమి వైపు, తెలంగాణలో అత్యధికులు బీజేపీ వైపు ఆసక్తి చూపిస్తున్నట్లు చూచాయగా తెలుస్తోంది. జాతీయ డిజిటల్ మీడియా ముఖ చిత్రాన్ని గమనిస్తే... బీజేపీపై నెటిజన్స్ కొంతవరకు అసంతృప్తి కనబరుస్తున్నట్టుగా, గతంలో కంటే ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు తరలి వెళ్లినట్టు ట్రెండ్స్ చెప్తున్నాయి.

తమకు కావాల్సిన కస్టమైజ్డ్ సమాచారం లేదా విశ్లేషణ కోసం ప్రజలు యూ ట్యూబ్ చానెళ్లను చూస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సొంతంగా ప్రధాన స్రవంతి మీడియా లేకున్నా, సోషల్ మీడియా, యూ ట్యూబ్ చానెళ్లు దాని విజయంలో కీలక పాత్ర పోషించాయి. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 65 శాతం మంది స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తున్నారు. 18–19 ఏళ్ల వయసున్న కొత్త ఓటర్లు తెలంగాణలో 9 లక్షల మంది, ఆంధ్రప్రదేశ్‌లో 10.3 లక్షల మంది ఉన్నారు. కొత్త ఓటర్లు మొత్తం సోషల్ మీడియా మీద ఆధారపడుతున్నారు. కాబట్టి, వీరిపై దాని ప్రభావం తీవ్రంగా ఉంది. 5 నెలల క్రితం, అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ యూ ట్యూబ్ చానెల్ సబ్‌స్క్రైబర్స్ లక్షా పదివేలమంది. ఇప్పుడు అది 64 శాతం పెరిగి లక్షా 81 వేలకు చేరింది. అదే సమయంలో తెలంగాణ బీజేపీకి 24 వేలు ఉండగా, 304 శాతం పెరిగి 92 వేలకు చేరింది. కాంగ్రెస్‌కి లక్ష ఉండగా, అది 150 శాతం పెరిగి నుంచి 2 లక్షల 50 వేలకు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో 5 నెలల కింద వైఎస్ఆర్‌సీపీకి 4.5 లక్షలు ఉండగా, ఇప్పుడు అది 26 శాతం పెరిగి 5.7 లక్షలకు చేరింది. టీడీపీకి సుమారు 2.4 లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు అది 85 శాతం పెరిగి 5.2 లక్షలకు చేరింది. జనసేనకు 13 లక్షల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇప్పుడు అది 15.6 లక్షలకు చేరింది. ఈ ఎంగేజ్‌మెంట్‌ని జాగ్రత్తగా గమనిస్తే నెటిజన్స్ ఎవరివైపు చూస్తున్నారనేదానికి కొన్ని సంకేతాలు కనిపిస్తాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో వైసీపీ అధికారిక ఖాతాకు ప్రస్తుతం 2.1 లక్షల మంది ఫాలోవర్స్, టీడీపీకి 3.2 లక్షల మంది, జనసేనకు 11 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఎక్కువ ఫాలోవర్స్ ఉన్న వారికి ఎక్కువ ఓట్లు వస్తాయని కాదు. ఫాలోవర్స్, స్పాన్సర్డ్ వీడియోలను పక్కనపెడితే, గడిచిన మూడు వారాల్లో వైసీపీ పెట్టిన వీడియోల కంటే, టీడీపీ, జనసేన పేజీలలో పెట్టిన కంటెంట్‌కి ఎక్కువ ఎంగేజ్‌మెంట్ కనిపిస్తోంది. జగన్ గులకరాయి దాడి వీడియోలను వైసీపీ పేజీల కంటే కూటమి పేజీల్లోనే జనం ఎక్కువగా చూశారు. తాము గెలుస్తున్నామని జగన్ ఐ ప్యాక్ ప్రతినిధులతో మాట్లాడిన వీడియో ఆయన ఇన్‌స్టాగ్రాం ఖాతాలో 5 లక్షల మందికి మాత్రమే చేరింది. వీటన్నింటిని జాగ్రత్తగా పరిశీలిస్తే నెటిజన్స్ ఎటువైపు ఆసక్తి కనబరుస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారిక ఖాతాల్లో పోస్ట్ చేసిన కంటెంట్ కంటే, రాష్ట్ర బీజేపీ షేర్ చేసిన కంటెంట్‌కి ఎంగేజ్‌మెంట్ పెరిగింది. ఈ కోణంలో నెటిజన్స్ షిఫ్ట్ అవుతున్న తీరును అధ్యయనం చేస్తే ఆంధ్రాలో ఎక్కువమంది కూటమి, తెలంగాణలో అత్యధికులు బీజేపీ వైపు ఆసక్తి చూపిస్తున్నట్టు చూచాయగా తెలుస్తోంది. జాతీయ డిజిటల్ మీడియా ముఖ చిత్రాన్ని గమనిస్తే... బీజేపీపై నెటిజన్స్ కొంతవరకు అసంతృప్తి కనబరుస్తున్నట్టుగా, గతంలో కంటే ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు తరలి వెళ్లినట్టు ట్రెండ్స్ చెప్తున్నాయి. ఈ సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ ఇస్తున్న సంకేతాలకు అనుగుణంగా ఎన్నికల తుది ఫలితాలు ఉంటాయా, లేదా అన్న ప్రశ్నకు సమాధానం జూన్ 4న తెలుస్తుంది.

• జి.మురళీకృష్ణ
పీపుల్స్‌పల్స్ రీసెర్చ్ సంస్థ

అంతరించిపోతున్న జీవవైవిధ్యం!

భూమిపై జీవాల మధ్య భేదాన్నే జీవవైవిధ్యం అంటారు. మన జీవన శైలిలో నిత్యం వాడుతున్న వస్తువులు, మొబైల్స్ వంటి వాటి వల్ల పర్యావరణం కాలుష్యమై భూగోళం వేడెక్కి, జీవవైవిధ్యం దెబ్బతింటోంది. భూగోళంపై ఎన్నో జీవరాశులు అంతరించిపోతున్నాయి. పిచ్చుకలు కాలక్రమేణా కనుమరుగైపోతున్నాయి. ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాలలో భారతదేశం ఒకటి. సుమారు 45 వేల వృక్షజాతులు, దాదాపు 77వేల జంతు జాతులు ఇక్కడ ఉండేవి. నేడు ఆ విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికి పైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. విస్తారంగా ఉన్న పచ్చికబయళ్ళ మన జీవనశైలితో తగ్గుముఖం పట్టాయి. సముద్రతీరాలను సైతం అతలాకుతలం చేసేశాం. దీనికి తోడు అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి కొందరు వేటగాళ్ళు అంతమొందిస్తున్నారు. వ్యవసాయంలో అధిక దిగుబడి కోసం రసాయనిక ఎరువులకు, కీటకనాశకాలకు ప్రాధాన్యం పెరిగింది. మన దేశంలో ఆదివాసులు, గిరిజనులు, కొండజాతి ప్రజలు ఎక్కడున్నారో అక్కడ జీవవైవిధ్యం పదిలంగా ఉంది. మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్‌లో 80 శాతానికంటే ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు అక్కడే జన్యువైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తోంది. అలాగే రసాయన కాలుష్యాన్ని అరికట్టి భూతాపాన్ని తగ్గించాలి. జంతువుల్ని, మొక్కల్ని పరిరక్షించుకోవాలి. సాధ్యమైనంత వరకు సేంద్రియ ఎరువులను వాడాలి. మంచి దిగుబడినిచ్చే సహజ విత్తనాలను గిరిజనులు ఇప్పటికీ రక్షించుకుంటూ వస్తున్నారు, విత్తన మార్పిడి చేసుకుంటున్నారు. కానీ లాభాలే ధ్యేయంగా పనిచేస్తున్న విదేశీ కంపెనీలు జీవ వైవిధ్యాన్ని సర్వనాశనం చేస్తున్నాయి.

– మిద్దె సురేష్
(నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం)

దళితాభ్యుదయంలో తొలి అడుగుజాడ



> సామాన్య కుటుంబం నుంచి ప్రభవించిన బి.యస్.మూర్తి ఎటువంటి రాజకీయ నేపథ్యం, ఆర్థిక బలం లేకుండానే రాజకీయాలలో ఉన్నత స్థానానికి చేరారు. విద్యతో సమకూర్చుకున్న ప్రతిభా పాటవాలు, నిరంతర శ్రమతో ఆయన ఆ ఉన్నతిని పొందారు. ఆ రోజుల్లో బి.యస్.మూర్తి పేరు అణగారిన వర్గాల వారిలో ఆత్మవిశ్వాసాన్ని, రక్షణ భావాన్ని కలిగించేది. ఆయన పేరు చెప్పి భూస్వాముల ఆగడాలు, పోలీసుల జులుం నుంచి రక్షణ పొందేవాళ్లమని పాతతరం దళిత పెద్దలు చెప్పుతుంటారు.

బయ్యా సూర్యనారాయణ మూర్తి తొలి తరం దళిత నేత. బి.యస్.మూర్తిగా లోకప్రసిద్ధుడు. ఇప్పటి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని నగరం గ్రామంలో 1906 అక్టోబర్ 29న జన్మించిన మూర్తి చిన్న నాటి నుంచీ విద్యాసక్తుడు. జీవితోన్నతికి విద్యే సరైన మార్గమని విశ్వసించినవాడు. జననీ జనకులు నాగయ్య, గంగమ్మ. అంటరానితనం సవాళ్లను నిర్జిస్తూ ఓడిస్తూ రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కాలేజీ నుంచి పట్టభద్రుడు అయ్యారు. ఆ తరువాత చెన్నైలోని లా కళాశాల నుంచి బి.ఎల్ పట్టా పొందాడు. కాకినాడలోని బ్రహ్మో సమాజ్ ఆయన విద్యాభ్యాసానికి ఆలంబనగా నిలిచింది. ఆంగ్ల భాషలో ఉత్కృష్ట ప్రావీణ్యం జీవితంలో శీఘ్ర పురోగతికి విశేషంగా దోహదం చేసింది. పాత్రికేయ వృత్తిలోకి ప్రవేశించి ఆంధ్ర రాష్ట్ర జర్నలిస్ట్ అసోసియషన్ ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. 1937 నుంచి 1952 వరకు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా ఎన్నికయ్యారు. 1937 నుంచి రెండేళ్ల పాటు, ఆ తరువాత 1946–47లోనూ పరిశ్రమల, కార్మిక మంత్రిగా ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సంవత్సరాల పాటు జైలులో నిర్బంధితులయ్యారు.

1947లో తిరుమల వేంకటేశ్వర ఆలయంలో దళితుల ప్రవేశానికి ఆందోళన చేసి లక్ష్య సాధకుడు అయ్యారు. దళిత విద్యార్థుల కోసం 1944లో మద్రాసులో ఎమ్.సి.రాజా మెమోరియల్ హాస్టల్‌ను నెలకొల్పారు. ఆయన తల్లి గంగమ్మ ఆ హాస్టల్‌లో వంట మనిషిగా పని చేయడం విశేషం. ఆ వసతి గృహం ఎంతో మంది దళిత విద్యార్థులకు తోడ్పడింది. అలా లబ్ధి పొందిన వారిలో ఐఏఎస్ అధికారి కత్తి చంద్రయ్య ఒకరు. చంద్రయ్య కుమార్తె కె.రత్నప్రభ, కె.ప్రదీప్‌చంద్ర కూడా ఐఏఎస్ అధికారులు. బి.యస్.మూర్తి మద్రాసు నుంచి కొంత కాలం పాటు 'నవ జీవన' అనే వారపత్రికను నిర్వహించారు. అదే కాలంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఆహ్వానంపై ఆ ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా సంస్థలో ఆయన మూడు నెలల ఆటు వివిధ అంశాలపై ఉపన్యాసాలు వెలువరించారు. Revolt of Six Crores, Depressed and Oppressed, The Glimmer in Darkness, Always at the Helms of service మొదలైనవి ఆయన ప్రసిద్ధ గ్రంథాలు. తెలుగులో 'ఆంధ్ర వీర కుమార' అన్నది ఆయన సుప్రసిద్ధ పుస్తకం.

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒకసారి కోనసీమలో పర్యటించారు. ఆ సందర్భంగా మరో ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు కళా వెంకటరావు ఆయన గౌరవార్థం అమలాపురంలోని తన స్వగృహంలో విందు ఇచ్చారు. ఆ విందుకు బి.యస్.మూర్తిని కూడా ఆహ్వానించారు. మూర్తి ఎక్కడ అని ప్రకాశం ఆరా తీసినప్పుడు ఆయనకు ఆ గృహంలోనే మరో చోట విందు ఏర్పాటు చేసినట్టు కళా వెంకటరావు చెప్పారు. ఇది విన్న ప్రకాశం వెన్వెంటనే భోజనం చేయకుండానే అక్కడి నుంచి నిష్క్రమించారు. మూర్తి కూడా ఆయనను అనుసరించారు. బి.యస్.మూర్తి పట్ల ప్రకాశంకు ఎంతో ఉన్నత గౌరవం, సమాదరం ఉండేది.

అప్పికట్ల అనే గ్రామంలో భూస్వాములు దళితులను వెళ్లగొట్టారు. దళితుల ప్రతిఘటనను హింసాత్మకంగా అణచివేశారు. మద్రాసు నుంచి నగరంకు వస్తున్న బి.యస్.మూర్తి దృష్టికి ఈ ఉదంతాన్ని కొంతమంది తీసుకువెళ్లారు. మంత్రిగా తన అధికారాలను ఉపయోగించి బహిష్కృతులయిన ఆ దళితులను తిరిగి పోలీసు రక్షణతో అప్పికట్ల గ్రామానికి తీసుకువెళ్లారు. అక్కడ మూర్తి రక్షణ నగర్ అనే టౌన్‌షిప్‌ను నిర్మించి ఆ దళితులకు అక్కడ పునరావాసం కల్పించారు. ఆ రోజుల్లో బి.యస్.మూర్తి పేరు అణగారిన వర్గాల వారిలో ఆత్మవిశ్వాసాన్ని, రక్షణ భావాన్ని కలిగించేది. బి.యస్.మూర్తి పేరు చెప్పి భూస్వాముల ఆగడాలు, పోలీసుల జులుం నుంచి రక్షణ పొందేవాళ్లమని పాతతరం దళిత పెద్దలు చెప్పుతుంటారు.

వైసీపీ నాయకుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మామ బి.యస్.మూర్తికి మంచి స్నేహితుడు. మూర్తి తన స్వస్థలానికి వెళ్తున్నప్పుడల్లా బాపట్లలో తన స్నేహితుడి ఇంటికి తప్పక వెళ్లేవారు. స్నేహితుడి ఇంటిలోను, బాపట్ల పట్టణంలోను మూర్తికి అత్యున్నత గౌరవాదరాలు లభించేవి. 'GITAM' విశ్వవిద్యాలయ మాజీ వీసీ ప్రొఫెసర్ జి. సుబ్రమణ్యం ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. ఆ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ఒకరు ఒక విద్యార్థికి మార్కులు ఇవ్వడంలో కులపరమైన వివక్ష చూపడంతో ఈ వ్యాస రచయిత ఆ అన్యాయాన్ని వీసీ దృష్టికి స్వయంగా తీసుకువెళ్లారు. ఆ సందర్భంగా జరిగిన మాటా మంతీలో వ్యాసరచయిత కుమారుడు బి.యస్.మూర్తి మనుమడు అని చెప్పారు. ప్రొఫెసర్ సుబ్రమణ్యం సంతోష భరితుడు అయ్యారు. ఉమ్మారెడ్డికి ఆయన బంధువు. ఉమ్మారెడ్డి మామ, బి.యస్.మూర్తి మధ్య స్నేహ బంధం గురించి ఆసక్తికరమైన విషయాలు ఆయన చెప్పారు. ఒకసారి బాపట్ల వాసులు ఎన్నికల ఖర్చుల నిమిత్తం మూర్తికి ఒక కారుతో పాటు రూ.10 వేలు విరాళంగా ఇచ్చారని ఆయన తెలిపారు.

బి.యస్.మూర్తి అసాధారణ నాయకుడు. వివిధ ప్రభుత్వ పదవులను, ఇతర కీలక బాధ్యతలను ఆయన ఎంతో సమర్థంగా నిర్వహించారు 1942–49 సంవత్సరాల మధ్య ఆంధ్ర రాష్ట్ర హరిజన్ సేవక్ సంఘ్ అధ్యక్షుడుగా ఆయన పని చేశారు. 1947లో ఆంధ్రరాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు అయ్యారు. రైల్వేస్‌తో ఉన్న సంబంధాల వల్ల ఆల్ ఇండియా స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా రైల్వే వెండర్స్ యూనియన్ అధ్యక్షుడుగాను ఉన్నారు. 1942లో జెనీవాలో 32వ అంతర్జాతీయ కార్మిక సదస్సుకు భారత్ ప్రతినిధిగా హాజరయ్యారు. ఐఎన్‌టీయూసీ వర్కింగ్ కమిటీ సభ్యుడుగా ఉన్నారు. బర్మాలో భారత కార్మికుల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేశారు. మద్రాసు రాష్ట్రంలో రాజాజీ మంత్రి వర్గంలో ఆయన కార్మిక, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కార్యదర్శిగా వ్యవహరించారు 1959లో భారతీయ డిప్రెస్‌డ్ క్లాసెస్ లీగ్‌కు అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. గాంధీ స్మారక్ నిధి జాతీయ కార్యవర్గ సభ్యుడుగా కూడా ఆయన ఉన్నారు. 1955–57 సంవత్సరాలలో పార్లమెంటరీ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యుడుగా ఉన్నారు. బి.యస్.మూర్తి వివిధ దేశాలలో విస్తృతంగా పర్యటించారు. 1968లో కంపాలాలో జరిగిన రెండవ కామన్వెల్త్ మెడికల్ కాన్ఫరెన్స్‌కు భారత్ ప్రతినిధిగా హాజరయ్యారు. బెర్లిన్, బీరూట్, జూరిఖ్, బెర్నె, లండన్, మాస్కో మొదలైన యూరోపియన్ నగరాలలో పర్యటించారు. తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను ఎంతో అంకితభావంతో, దేశ భక్తితో నిర్వర్తించేవారు.

స్వతంత్ర భారతదేశంలో మొదటి లోక్‌సభకు బి.యస్.మూర్తి ఏలూరు నుంచి ఎన్నికయ్యారు. 1957లో రెండో లోక్‌సభకు కాకినాడ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అమలాపురం రిజర్వ్‌డ్ లోక్‌సభా నియోజకవర్గం ఏర్పాటైన తరువాత 1962, 67, 72లలో అక్కడ నుంచి మూర్తి పోటీ చేసి గెలుపొందారు. 1959లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్, సహకార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా పని చేశారు. 1966 నుంచి 71 దాకా కేంద్ర కేబినెట్‌లో ఆరోగ్య కుటుంబ నియంత్రణ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తరువాత రైల్వే బోర్డ్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఈ బాధ్యతల నిర్వహణలో ఆయన విశేష గౌరవాదరాలను పొందారు. 1956లో స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ నేతృత్వంలో చైనాను సందర్శించిన భారత పార్లమెంటరీ సంఘంలో మూర్తి సభ్యుడుగా ఉన్నారు. 1962లో రియో డి జెనీరోలో జరిగిన ప్రపంచ సోషల్ సర్వీస్ సదస్సుకు ఆయన హాజరయ్యారు. 1970 మేలో జెనీవాలో జరిగిన ప్రపంచ ఆరోగ్య సదస్సులో పాల్గొన్న భారత ప్రతినిధివర్గానికి మూర్తి నాయకత్వం వహించారు. సంప్రదాయ భారతీయ వైద్య విధానాలకు మూర్తి అందించిన సేవలకుగాను ఆయనకు ఆయుర్వేద బంధు అనే అవార్డును బహూకరించారు.

బి.యస్.మూర్తి పలువురు యువ దళిత రాజకీయవేత్తలకు స్ఫూర్తినిచ్చారు. నగరం శాసనసభ నియోజకవర్గానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన నేతిపూడి గణపతిరావు బి.యస్.మూర్తి ప్రేరణతోనే రాజకీయాలలోకి వచ్చారు. గోదావరి జిల్లాల దళితులకు మూర్తి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో విశేష సేవలందించారు. మూర్తి అండదండలతో దళిత నాయకులు ఆత్మవిశ్వాసంతో వ్యవహరించేవారు. సామాన్య కుటుంబం నుంచి ప్రభవించిన బి.యస్.మూర్తి ఎటువంటి రాజకీయ నేపథ్యం, ఆర్థిక బలం లేకుండానే రాజకీయాలలో ఉన్నత స్థానానికి చేరారు. విద్యతో సమకూర్చుకున్న ప్రతిభా పాటవాలు, నిరంతర శ్రమతో ఆయన ఆ ఉన్నతిని పొందారు. 1979 మే 22న ఆయన తుదిశ్వాస విడిచారు. దళిత వర్గాలకు, విశాల సమాజానికి విశేష సేవలు అందించిన బి.యస్.మూర్తిని నేటి తరం వారు ముఖ్యంగా దళిత నాయకులు మరచిపోవడం చాలా దురదృష్టకరమైన విషయం. కాలవాహినిలో ఆయన ఒక విస్మృత నాయకుడుగా మిగిలిపోయారు. ఆయన సేవలను రేఖా మాత్రంగానైనా గుర్తుచేసుకునేందుకే ఈ నివాళి వ్యాసం.

■ డాక్టర్ ఆలూరి సుందర్ కుమార్ దాస్
ఐపీఎస్ (రిటైర్డ్)
(నేడు బి.యస్.మూర్తి 45వ వర్ధంతి)



ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనలో కొత్త పరిశ్రమల సంగతి దేవుడెరుగు ఉన్న పరిశ్రమలు మూతపడకుండా ఉంటే అదే పదివేలు అన్న చందాన తయారైంది పరిస్థితి. అలాంటి ప్రతికూలతల నడుమ కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం వీరవల్లిలో సుమారు రూ.200 కోట్లతో ప్రాజెక్టు కామధేను పేరుతో అత్యాధునిక డెయిరీ ప్రాసెసింగ్ ప్లాంటును ఏర్పాటు చేయడమే కాకుండా సుమారు 500 మందికి ఉపాధి కల్పించారు. ఈ ఘనత ఐదేళ్ల క్రితం యూనియన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన చలసాని ఆంజనేయులుకు దక్కుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.





వంశీపై ఈబీ-5 దుమారం!

అమెరికాలో సుమారు రూ.9 కోట్లు పెట్టుబడితో గ్రీన్‌కార్డు

అమెరికా గ్రీన్‌కార్డు సాధించడం అంటే సామాన్యులకు అంత ఆషామాషీ కాదు. కానీ డబ్బులున్న వారికి ఓ దగ్గర దారుంది. అదే ఈబీ 5 ఇమ్మిగ్రేషన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రాం. దీన్నే సింపుల్‌గా ఈబీ 5 వీసా అంటారు. అమెరికాలో ఓ వాణిజ్య సంస్థని ఏర్పాటు చేసి అందులో సుమారు 10 లక్షల అమెరికన్ డాలర్లు (సుమారు రూ.9 కోట్లు) పెట్టుబడిగా పెట్టి అర్హత కలిగిన 10 మంది అమెరికన్లకు ఫుల్ టైం ఉద్యోగాలు కల్పిస్తే అలాంటి వారికి ఈబీ 5 వీసా మంజూరు చేస్తారు. ఏడాదిలోపు గ్రీన్‌కార్డు ఇస్తారు. ఇప్పుడు ఈ ఈబీ 5 వీసాపై ఎందుకింత చర్చ అంటే.. గన్నవరం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ మే 17న అమెరికాలోని డల్లాస్ వెళ్లారు. తన పిల్లల చదువు కోసం అమెరికా వెళ్లారని ఆయన అనుచరులు.. లేదు లేదు వంశీ శాశ్వతంగా అమెరికా వెళ్లిపోయారని, ఆయనకు అక్కడ ఈబీ 5 వీసా కూడా మంజూరైందని టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు.

దీన్నే ఈబీ 5 ఇమ్మిగ్రెంట్స్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోగ్రాంగా పిలుపు

- గ్రీన్ కార్డు కోసమే వంశీ అమెరికాలో పెట్టుబడులు పెట్టారని ప్రచారం
- అదంతా గన్నవరం నియోజకవర్గంలో దోచిందేనంటున్న టీడీపీ నాయకులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వంశీ ఈసారి విద్వేష రాజకీయాలకు తెరదీశారు. ఓటమి భయంతో ప్రత్యర్థులను దాడులతో భయభ్రాంతులకు గురి చేసి తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూశారు. ఐదేళ్లుగా నియోజకవర్గంలో గ్రావెల్, పోలవరం మట్టి దోపిడీతో వంశీ, ఆయన అనుచరులు వందల కోట్లు ఆర్జించారు. ఈ నేపథ్యంలో వంశీ ఈ ఎన్నికల్లో ఓటమి పాలైతే ఆయనపై ప్రత్యర్థులు అదే స్థాయిలో ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరిపై వంశీ చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తెలుగువారందరిలోనూ వంశీపై తీవ్ర వ్యతిరేకతను పెంచాయి. ఈ పరిణామాలన్నీ బేరీజు వేసుకున్న వంశీ గత ఏడాదిగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమైనట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు. అందులో భాగంగా ఈ ఎన్నికల్లో ఓటమి పాలైతే నియోజకవర్గానికి శాశ్వతంగా గుడ్‌బై చెప్పాలన్న ఆలోచనలో ఆయన ఉన్నట్టు సమాచారం.

వ్యూహాత్మకంగానే దుట్టా పేరు ప్రకటన

పోలింగ్‌కు ముందు.. వచ్చే ఎన్నికల్లో దుట్టా రామచంద్రరావు సతీమణి దుట్టా సీతారామలక్ష్మి పోటీ చేస్తుందని తాను ఆమెకు మద్దతు ఇస్తానని వంశీ ప్రకటించారు. ఎన్నికల్లో ఓటమి పాలైతే తనకు నియోజకవర్గంలో మనుగడ ఉండదన్న అభిప్రాయానికి వంశీ వచ్చారని ఆయన మాటలే చెబుతున్నాయి. అందుకే ఏడాదిగా ఆయన ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే అమెరికాలోని రెండు కంపెనీల్లో ఆయన సుమారు రూ.20 కోట్లపైచిలుకు పెట్టుబడులు పెట్టారని చెబుతున్నారు. తద్వారా ఈబీ 5 వీసాకు దరఖాస్తు చేసుకోవడం.. గ్రీన్‌కార్డు రావడం అన్నీ పూర్తయ్యాయని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

ఇక్కడ దోచి.. అమెరికాలో పెట్టుబడి పెట్టి..

అమెరికాలో పెట్టుబడిగా పెట్టిన సొమ్ము మొత్తం గన్నవరం నియోజకవర్గంలో దోచుకున్నదేననే చర్చ నడుస్తోంది. యార్లగడ్డ అమెరికాలో సంపాదించి నియోజకవర్గంలో ఖర్చు పెడుతున్నారని, వంశీ ఇక్కడ దోచుకుని అమెరికాలో పెట్టుబడులు పెడుతున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. గన్నవరం నుంచి 2109లో టీడీపీ టికెట్‌పై గెలిచి వైసీపీ పంచన చేరిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ స్వగ్రామం గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు. 2014, 2019లో రెండు సార్లు టీడీపీ టికెట్‌పై గన్నవరం ఎమ్మెల్యే వంశీ గెలుపొంది గన్నవరంపై పట్టు బిగించారు. అదే సమయంలో నియోజకవర్గంలో ఆయన అనుచరులు సాగించిన అవినీతికి అంతే లేదు. దీంతో ఈసారి ఓటమి భయం వంశీని వెంటాడుతోంది. దాని ఫలితమే రాజకీయ కక్ష సాధింపులు నుంచి తప్పించుకోవడానికి వంశీ అమెరికా బాట పట్టారని ప్రచారం జరుగుతోంది. అయితే ఆయన అనుచరులు మాత్రం వంశీ మే 17న తన కుమారుడి ఉన్నత చదువుల కోసం అమెరికాలోని డల్లాస్ వెళ్లారని, త్వరలోనే తిరిగి వస్తారని చెబుతున్నారు.

ప్రతికూలతల్లోనూ ముందుకే!

పాడి రైతు సంక్షేమానికే విజయ పెద్దపీట



- రూ.200 కోట్లతో అత్యాధునిక ప్లాంటు
- కృష్ణా మిల్క్‌యూనియన్ చైర్మన్‌గా ఐదేళ్లు పూర్తి చేసుకున్న చలసాని ఆంజనేయులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు 2019 మే 22న బాధ్యతలు చేపట్టారు. ఐదేళ్ల కాలంలో ఆంజనేయులు యూనియన్‌కు చేసిన సేవలకు చిరుసత్కారంగా బుధవారం వీరవల్లి ప్లాంటులో ఉద్యోగులు, పాడి రైతులు పెద్ద ఎత్తున కృతజ్ఞతా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఐదేళ్ల విజయ ప్రస్థానం పాడి రైతులకు ఎంతో స్ఫూర్తిని కలిగిస్తుంది. కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్ (కృష్ణా మిల్క్ యూనియన్) యూనిసెఫ్ ఆర్థికసాయంతో 1964 సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ మిల్క్ ఫ్యాక్టరీగా ఆవిర్భవించింది. దివంగత డాక్టర్ నందమూరి తారకరామారావు చొరవతో పూర్తి స్వయంప్రతిపత్తితో ఏపీ పరస్పర సహాయ సహకార సంఘం చట్టం (ఏపీమాక్స్ చట్టం) కింద రూపాంతరం చెంది ఆదర్శ సహకార సంస్థగా విజయపథంలో సాగుతోంది. కాకాని వెంకటరత్నం, ముక్త్యాల రాజా, వల్లభనేని రంగయ్య చౌదరి, పర్వతనేని వెంకటరత్నం, యేర్నేని వెంకటేశ్వరరావు వంటి దార్శనికులతో స్థాపించబడిన కృష్ణా మిల్క్ యూనియన్ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది.

ప్రతికూల పరిస్థితుల్లోనూ ఘనత

దేశంలో ప్రతికూల పరిస్థితులు (2019 - 20సంవత్సరంలో) ఏర్పడి తీవ్రమైన పాల కొరత నెలకొన్న సమయంలోను, 2020-21లో కొవిడ్-19 మహమ్మారి వల్ల దేశంలో 8 శాతం పాల కొరత ఉన్నప్పటికీ యూనియన్ చైర్మన్ ఆంజనేయులు నేతృత్వంలో పాల సేకరణలో అనితర సాధ్యమైన గణాంకాలను నమోదు చేసింది. యూనియన్ పాల సేకరణలో 2019-20లో 17శాతం, 2020-21లో 14 శాతం, 2021-22లో 12శాతం, 2022-23లో 15 శాతం, 2023-24లో 8 శాతం వృద్ధి సాధించింది. చలసాని ఆంజనేయులు తాను స్వయంగా రూపొందించుకున్న 'పల్లెకుపోదాం.. పాడిని చూద్దాం' కార్యక్రమం ద్వారా తెల్లవారుజామునే గ్రామాల్లోని పాడి రైతుల దగ్గరికి వెళ్లి పాడి రైతుల సమస్యలను తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కరించడమే కాక మెరుగైన విధానాల ద్వారా పాడి పెరుగుదలకు కావల్సిన సాంకేతిక వనరులను పాడి రైతులకు వివరించి ఈ మహా యజ్ఞాన్ని ముందుండి నడిపిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని 'పల్లెకుపోదాం.. పాడి రైతు లాభాలను పెంచుదాం' వరకు విస్తరించి పాడి రైతుల ఆదాయాన్ని పెంచే విధానాలను పాడి రైతు కుటుంబాల చెంతకు చేర్చటానికి అవిశ్రాంత కృషి చేస్తున్నారు.

వార్షిక టర్నోవర్‌లో గణనీయవృద్ధి

యూనియన్ వార్షిక టర్నోవర్ 2018-19 నుంచి 2019-20 వరకు రికార్డు స్థాయిలో 12 శాతం పెరిగింది. ఐదు సంవత్సరాల్లో రూ.719 కోట్లు ఉన్న సమితి వార్షిక టర్నోవర్‌ను రూ.1196 కోట్లకు తీసుకువచ్చారు. కొవిడ్-19 మహమ్మారి వల్ల దేశవ్యాప్తంగా పాల ఉత్పత్తుల అమ్మకాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ప్రస్తుతం మార్కెటింగ్ ఉన్న ప్రాంతాల్లో నాయకత్వ స్థానాన్ని కాపాడుకోవడంతోపాటు మార్కెటింగ్‌ను పక్క జిల్లాలైన గుంటూరు, ప్రకాశం, ఖమ్మం, ఉభయగోదావరి జిల్లాలకు విస్తరించడంతో ఈ వృద్ధి నమోదు చేయగలిగారు. వచ్చే ఐదేళ్లలోరూ.2500 కోట్ల వార్షిక టర్నోవర్ సాధన దిశగా కృష్ణా మిల్క్ యూనియన్ ప్రయాణం చేస్తోంది.

ప్రాజెక్టు కామధేను

రాష్ట్రంలోనే అతి పెద్ద కో-ఆపరేటివ్‌గా ఉన్న కృష్ణా మిల్క్ యూనియన్ రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల్లోనూ విస్తరణలో దూసుకుపోయింది. అత్యాధునికమైన డెయిరీ ప్రాసెసింగ్ ప్లాంట్‌ని కృష్ణా జిల్లా వీరవల్లిలో 6 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించి 2023 డిసెంబరు 7న ప్రారంభించారు. వీటితోపాటు పాడి రైతు సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ అడుగులు వేస్తోంది. ఆంజనేయులు చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత కృష్ణా క్షీరబంధు అనే పాడి రైతు సంక్షేమ కార్యక్రమాన్ని రూపొందించి, దీని ద్వారా ఏ కారణం చేతనైనా పాడి రైతు మరణిస్తే, అతని కుటుంబానికి తక్షణమే రూ.50వేలు సమితి నిధుల నుంచి ఆర్థికసాయం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 1600 కంటే ఎక్కువ కుటుంబాలకు ఈ తోడ్పాటు అందించారు. దీంతోపాటు రైతుల పిల్లలు ఉన్నత విద్య అభ్యసించడానికి, రైతుల ఆరోగ్య భద్రతకు బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నారు.

టార్గెట్ రూరల్

సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల ఫోకస్

- విస్తృతంగా కార్డన్‌సెర్చ్
- బయటపడుతున్న నేరగాళ్లు.. రికార్డులు లేని వాహన చోదకులు



అవనిగడ్డ నియోజకవర్గం లంకమాన్యంలో కార్డన్‌సెర్చ్‌పై సిబ్బందికి సూచనలు చేస్తున్న పోలీస్ అధికారులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల గ్రామీణ ప్రాంతాల్లో చెలరేగిన హింసతో విజయవాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉద్రిక్తతలు పుట్టే ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. వ్యక్తులు పైకి ఎలాగున్నా ఇళ్లలో ఏమేమి ఉన్నాయో తేల్చాలని భావించారు. ఇందుకోసం కార్డన్‌సెర్చ్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. తెల్లవారుజామున ఈ ఆపరేషన్‌కు పని చెబుతున్నారు. ఎన్నికల రోజున గ్రామీణ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు రేగాయి. ఒక పార్టీ అభ్యర్థిని మరో పార్టీ అభ్యర్థులు అడ్డుకున్నారు. వ్యతిరేకరంగా నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా అవతలి పార్టీ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఎన్నికల రోజున పుట్టిన ఈ వేడి లెక్కింపు పూర్తయినా కొనసాగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. తిరుపతి, చంద్రగిరి, మాచర్ల ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలతో నిఘా వర్గాలు ఒక సమాచారాన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల సీపీలకు ఇచ్చాయి. లెక్కింపు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నది ఆ సందేశ సారాంశం. గ్రామీణ ప్రాంతాల్లో గెలుపు విషయంలో ప్రధాన పక్షాల కార్యకర్తలు హోరాహోరీగా వాదనలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రేగిన వివాదాలు ఎంత వరకు అయినా దారితీయవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ చేస్తే అసలు బాగోతం బయటకు వస్తుందని నిర్ణయించారు. మాచర్ల ప్రాంతంలో ఇళ్లలో సోదాలు నిర్వహించిన తర్వాతే పెట్రోలు బాంబులు, కర్రలు, రాళ్లు బయటపడ్డాయి.

- **టార్గెట్ మిస్సవ్వకుండా...**

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు నిఘా వర్గాలు ఉన్నతాధికారులకు చేరవేస్తున్నాయి. పోలీసులు అనుమానించిన వ్యక్తుల అసలు స్వరూపం తెలుసుకోవడానికి నిర్దేశించుకున్న లక్ష్యం గురి తప్పకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. నందిగామ డివిజన్‌లో డీవీఆర్ కాలనీ, మైలవరం మండలంలో దేవుని చెరువు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో పోలీసులు మొత్తం 867 ఇళ్లను తనిఖీ చేశారు. డీసీపీ కంచి శ్రీనివాసరావు, నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, సీసీఎస్ ఏసీపీ స్రవంతిరాయ్, తిరువూరు ఏసీపీ సుంకర మురళీ మోహన ఆధ్వర్యంలో ఈ సోదాలు జరిగాయి. 7440 మందిని తనిఖీ చేశారు. 72 మంది అనుమానితులను ఐరీష్ ద్వారా తనిఖీ చేయగా వారిలో ఆరుగురిపై పాత కేసులు ఉన్నట్టు తేలింది. మొత్తం 120 మోటారు సైకిళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించగా 47 వాహనాలకు ఎలాంటి రికార్డులు లేవని గుర్తించారు. వాటిని పోలీసులు సీజ్ చేశారు.

మతిస్థిమితం లేని దళిత యువతిపై అఘాయిత్యం

మూడు నెలలుగా ముగ్గురు కామాంధుల ఘాతుకం.. పోలీసు కేసు నమోదు

- 6లో..

వృద్ధ దంపతుల న్యాయ పోరాటం

- ఇచ్చిన అప్పు తిరిగి అడిగినందుకు అద్దె ఇంటి నుంచి గెంటేసిన యజమాని కోడలు

- పోలీసుస్టేషన్‌కు వెళితే బాధితులపైనే దుర్భాషలు
- 18 రోజులుగా బయట ఉంటున్న వృద్ధ దంపతులు



గెట్ల మరియన్న, సుజనా దంపతులు



తాళం వేసిన ఇంటిగేటు ముందు కూర్చున్న బాధితురాలు సుజనా

విద్యాధరపురం, మే 21 : వారు అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్న వృద్ధ దంపతులు. ఇంటి యజమానికి అప్పు ఇవ్వడమే వారికి శాపమైంది. అప్పు తిరిగి అడిగినందుకు ఇంటి యజమాని కోడలు ఇంటి నుంచి గెంటేసినంత పనిచేసింది. ఇంటి తలుపులకు, గేటుకు తాళం వేసి ఆ వృద్ధులను రోడ్డుపాలు చేసింది. న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళితే అక్కడా అన్యాయమే ఎదురైంది. ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులపైనే పోలీసు దుర్భాషలాడారు. ఈ అవమానాలను భరిస్తూ 18 రోజులుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న వృద్ధ జంట గాథ ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తుంది. బాధితులు చెప్పిన కథనం ప్రకారం.. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్ యూనియన్ బ్యాంక్ ఎదురుగా గెట్ల సుజనా (65), గెట్ల రవి (మరియన్న) (70) దంపతులు 2015 నుంచి జెట్టి నాగేశ్వరరావు ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. నాగేశ్వరరావు తన అవసరాల నిమిత్తం 2015లోనే మరియన్న వద్ద రూ.2 లక్షలు అప్పుగా వడ్డీకి తీసుకున్నాడు. నాగేశ్వరరావు రెండేళ్లపాటు మరియన్నకు వడ్డీ సక్రమంగా చెల్లించాడు. ఆ తరువాత నాగేశ్వరరావు చనిపోవడంతో అతని కోడలు రత్నకుమారి వడ్డీకి తీసుకున్న డబ్బులు తాను చెల్లిస్తానని హామీ ఇచ్చింది. అయితే డబ్బులు ఇవ్వకుండా ఆమె ఇల్లు ఖాళీ చేయమంటూ మరియన్న దంపతులను బెదిరించడంతో వారు కోర్టుకు వెళ్లారు. మరియన్న దంపతులపై రత్నకుమారి దిశా పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు పెట్టారు. పోలీసులు విచారించి వారి తప్పులేదని నిర్ధారించుకున్నారు. ఈ కేసు కోర్టులో ఉంది. ఇంటి అద్దె ప్రతినెలా లాయర్ ద్వారా కోర్టులో కడుతున్నారు. ఈ క్రమంలో రత్నకుమారి ఈనెల 8వ తేదీన మరియన్న ఉంటున్న ఇంటి పోర్షన్ కరెంట్ కనెక్షన్‌ను తొలగించింది. దీనిపై మరియన్న భార్య సుజనా భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్లింది. ఎన్నికలు హడావుడి ఉందని, తరువాత మాట్లాడుదామని పోలీసులు చెప్పారు. 15వ తేదీ వెళ్లగా 16న రమ్మని పోలీసులు చెప్పడంతో మరియన్న స్టేషన్‌కు వెళ్లాడు. బాధితుడు చెప్పే విషయాలేవీ తెలుసుకోకుండా సీఐ ఆగ్రహించారు. 'రత్నకుమారిపై ఫాల్స్ కేసు పెడతావా? బట్టలూడదీసి పక్కనే కూర్చోపెట్టండి' అని అక్కడున్న పోలీస్ సిబ్బందికి చెప్పడంతో మరియన్న అవాక్కయ్యాడు. ఇంటికి తాళం వేయడంతో పింఛన్ బుక్, దుస్తులు కూడా లోపల ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు.

మతిస్థిమితం లేని దళిత యువతిపై అఘాయిత్యం

- మూడు నెలలుగా ముగ్గురు కామాంధుల ఘాతుకం.. పోలీసు కేసు నమోదు

విజయవాడ/కంకిపాడు, మే 21(ఆంధ్రజ్యోతి) : అంగవైకల్యం, మతిస్థిమితం లేకుండా ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ దళిత యువతిపై ముగ్గురు కామాంధులు అఘాయిత్యం చేశారు. యువతికి మాయమాటలు చెప్పి దారుణానికి ఒడిగట్టారు. మూడు నెలలుగా దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటన కృష్ణా జిల్లా కంకిపాడు మండలం దావులూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన 26 ఏళ్ల యువతి పుట్టికతోనే దివ్యాంగురాలు. ఆమెకు మాటలు రావు. ఎదుటవారి మాటలు వినిపించవు. తల్లిదండ్రులు ఇద్దరూ కూలీ పనులు చేస్తుంటారు. కుమార్తెను ఇంటి వద్ద వదిలి పనులకు వెళుతుంటారు. ఆ యువతి ఇంటికి సమీపంలో ఉన్న ముగ్గురు యువకులు ఆమెపై కన్నేశారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లి ఆమెతో పరిచయం పెంచుకున్నారు. మూడు నెలలుగా వారు యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఒక్కోసారి ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి అఘాయిత్యం చేసేవారు. పని నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు ఎదురుగా కుమార్తె కనిపించడంతో ఆమె క్షేమంగానే ఉందనుకునేవారు. సోమవారం రాత్రి కడుపునొప్పి ఎక్కువగా వస్తోందని యువతి బాధపడటంతో తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు పరీక్షించి ఆమె మూడు నెలల గర్భవతి అని చెప్పారు. ఏం జరిగిందని ప్రశ్నించినా ఆ యువతి నోరు తెరచి చెప్పలేని పరిస్థితి. యువతి తల్లి వెంటనే కంకిపాడు పోలీసులను ఆశ్రయించింది. తన కుమార్తెకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చుట్టుపక్కల ఉంటున్న ముగ్గురు యువకులు తరచుగా ఆ యువతి ఇంటికి వచ్చి ఎక్కువసేపు ఉండేవారని గుర్తించారు. వైద్యుల నివేదిక వచ్చిన వెంటనే యువకులను అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి.



బల్లిపరులో అక్రమ లేఅవుట్‌ను ధ్వంసం చేస్తున్న ముడా అధికారులు

అక్రమ లేఅవుట్ ధ్వంసం

పెడన రూరల్ : మండలంలోని బల్లిపరు గ్రామంలో అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేసి స్థలాలు అమ్ముతుండటంతో ముడా అధికారులు ధ్వంశం చేశారు. కూనపరెడ్డి వెంకట సుబ్బారావు 26 ఎకరాలలో రోడ్లు వేసి స్థలాలను విక్రయించటంతో ముడా అధికారులు సుబ్బారావుకు నోటీసులు ఇచ్చారు. దానిపై అనమతులు పొందేందుకు కొంత సమయం కావాలని కోరారు. గడువు మిగిసినా సుబ్బారావు స్పందించక పోవటంతో మంగళవారం ముడా వైస్ ఛైర్మన్ వెంకట రమణ ఆదేశాలతో కార్యలయం అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి(ఎపిఓ) మల్లిఖార్జునరావు. పోలీసు సిబ్బందితో రోడ్లను ధ్వంసం చేశారు. సరిహద్దు రాళ్ళను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ముడాసిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ పరిశీలకుల నియామకం

మచిలీపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం పరిశీలకులను నియమిస్తూ కేంద్ర ఎన్నికలసంఘం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పామర్రు నియోజకర్గానికి ఆనంద్‌హరి జమాటియా, గన్నవరం నియోజకవర్గానికి ఎన్ఎస్ చిదానంద, గుడివాడ నియోజకవర్గానికి బన్సీలాల్ రాణాను నియమించారు. పెడన నియోకవర్గానికి అనిల్ చంద్ర డియోరి, మచిలీపట్నం నియోజకవర్గానికి ఏఆర్ జాన్‌కింగ్స్‌లే, అవనిగడ్డ నియోజకవర్గానికి అఖిలేష్ కుమార్‌సింగ్, పెనమలూరు నియోజకవర్గానికి అభిజిత్‌బోస్‌ను నియమించారు.

కృష్ణా జిల్లాలో కార్డన్ సెర్చ్

- 18 వాహనాలు సీజ్

మచిలీపట్నం/గుడివాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, గుడివాడ నియోజకవర్గాలలో మంగళవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్‌ను నిర్వహించారు. అవనిగడ్డ నియోజకవర్గం లంకమాన్యం గ్రామంలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి తనిఖీలు చేపట్టారు. కొత్త వ్యక్తుల సంచారంపై ఆరాతీశారు. ఎలాంటి ధృవపత్రాలు లేని 13వాహనాలను సీజ్‌చేశారు. గుడివాడ పట్టణంలోని గుడ్‌మెన్‌పేట, వాంబేకాలనీలో ఐదు వాహనాలను సీజ్ చేశారు. ఎన్నికల తరువాత జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచినట్టు పోలీస్ అధికారులు తెలిపారు.



రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై

అధికారుల నజర్!

- ఎన్టీఆర్ జిల్లాలో సివిల్ సప్లయిస్ దాడులు
- విజయవాడకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ఎండీయూ వాహనాలకు ప్రత్యేక నెంబర్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అక్రమ బియ్యం డంప్‌లపై ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, మత్తుపదార్థాలను పట్టుకోవటానికి ప్రత్యేక చెక్‌పోస్టులను నియవించటంతో.. రేషన్ బియ్యం నిల్వలు బయటకు తీయటానికి భయపడిన వ్యాపారులు డంప్‌లను కదిలించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా సరిహద్దులు దాటించి విదేశాలకు తరలించేందుకు అంతా రంగం సిద్ధం చేసిన తరుణంలో 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం డంప్‌లపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు తక్షణం రంగంలోకి దిగారు. ఎన్టీఆర్‌జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌ఓ) మోహన్‌బాబు నగరంలోని డంప్‌లపై దృష్టి సారించారు. సహాయ పౌరసరఫరాల శాఖ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో మూడు సర్కిల్స్ పరిధిలో దాడులకు ఆదేశించారు. మంగళవారమే సహాయ పౌరసరఫరాల శాఖ అధికారులు (ఏఎస్‌ఓలు) రంగంలోకి దిగారు. నగరంలో అక్రమ బియ్యం వ్యాపారులు దాచిన ప్రాంతాలపై సమాచారం ఉన్నా.. ఎక్కడ దాచారన్నది మాత్రం అత్యంత రహస్యంగా ఉండటంతో క్షేత్రస్థాయిలో వాటిని శోధిస్తున్నారు. మండల డీటీలకు వీటికి సంబంధించి సమాచారం ఉన్నా.. అక్రమ బియ్యం నిల్వల గురించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం లేదు. పైగా ఫలానా ప్రాంతానికి తనిఖీలకు వస్తున్నారని డీటీలు ముందుగానే సమాచారాన్ని చేరవేస్తున్నారు. దీంతో డీటీలపైన ఆధారపడకుండా.. ఏఎస్‌వోలకు బాధ్యతలు అప్పగించారు. ఏఎస్‌వోలు డీటీలకు తెలియకుండా జాగ్రత్త పడుతూ క్షేత్ర స్థాయిలో డంప్‌లపై నిఘా పెట్టారు. జిల్లా వ్యాప్తంగా కూడా ప్రత్యేక బృందాలను నియవించాలన్న డిమాండ్ వ్యక్తమౌతోంది.

ఎండీయూ వాహనాలకు ప్రత్యేక స్టిక్కర్లు

మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాలు ఎక్కడ తిరుగుతున్నాయన్నది తెలియని పరిస్థితి. ఎండీయూ వాహనాలలోనూ అక్రమ బియ్యం తరలుతోందన్నదన్న అనుమానం కూడా ఉంది. గతంలో అనేకమార్లు ఎండీయూ వాహనాలలో అక్రమ బియ్యం తరలింపు ఘటనలు జరిగాయి. దీంతో ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. నగరంలో ఏ ప్రాంతానికి చెందిన ఎండీయూ వాహనాలను ఆ ప్రాంతం పేర్లతో స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. స్టిక్కరింగ్‌తో పాటు ఏ సచివాలయాల పరిధిలో ఆ వాహనాలు తిరుగుతాయన్నది కూడా పొందు పరిచి వాటికి నెంబరింగ్ ఇవ్వనున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు



కృష్ణలంక, మే 21 : ఇంటర్ సప్లిమెంటరీ, పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీఆర్‌వో ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు, అదేవిధంగా ఈనెల 24 తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 54పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం 28,668 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం 6,545 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జూనియర్ ఇంటర్ పరీక్షలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సీనియర్ ఇంటర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 6,702 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. వీరికి 35 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 35 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నలుగురు రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించడంతో పాటు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్ట ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు కూడా పరీక్షలు జరిగే సమయంలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణను సీసీ కెమేరాలు, వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పరిశీలించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకొనేందుకు వీలుగా విద్యార్థులకు ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తపాలా కార్యాలయం ద్వారా జవాబు పత్రాలను స్పీడు పోస్టులో పంపేందుకు సిద్ధంగా వుండాలన్నారు. ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని డీఆర్‌వో అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఈవో యు.వి.సుబ్బారావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కెవీఎన్ కుమార్, డీఈసీ సభ్యులు శ్రీరామమూర్తి, వెంకట్రావు, ఆర్యపత్ వున్నారు.

కాలువల్లో పూడికతీత పనులకు అనుమతులివ్వండి : కృష్ణా కలెక్టర్

మచిలీపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జూన్ రెండోవారం నుంచి రైతులు పంటలు సాగు చేసేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో కాలువల్లో పూడికతీత, తూడు, గుర్రపుడెక్క తదితరాలను తొలగించేందుకు అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డిని కోరారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కలెక్టర్‌లతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్‌నెలలో కాలువలకు నీటిని విడుదలచేస్తే నీటి ప్రవాహానికి అడ్డులేకుండా ప్రధానకాలువలు, డ్రెయిన్‌లలో కనీస పూడికతీతపనులు చేయాల్సి ఉందన్నారు. ఈపనులకు ఆమోదం తెలపాలని కోరారు. జిల్లాలో తాగునీటి, విద్యుత్ సరఫరా, ఉపాధిహామీ పనులుజరుగుతున్న విధానం, ఇతరత్రా అభివృద్ధిపనుల పురోగతిపై కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను కృష్ణాయూనివర్సిటీలో భద్రపరిచామని, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ జీవి సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప మునిసిపల్ కమీషనర్లు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా నిరోధానికి ప్రత్యేక చెక్‌పోస్టులు : ఎస్పీ

మచిలీపట్నం టౌన్, మే 21 : హైకోర్టు ఉత్తర్వుల మేరకు గోవుల అక్రమ రవాణా, గోవధ నివారణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. మంగళవారం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామన్నారు. గోవులను కబేళాలకు తరలించకుండా నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా గోవుల అక్రమ రవాణా చేస్తే చట్ట రీత్యాలు చర్యలు తీసుకుంటామన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తున్నా, గోవధ చేస్తున్నా వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

హింసాత్మక చర్యలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు : ఆర్వో

గుడివాడ : ఎన్నికల అనంతరం హింసాత్మక చర్యలను నిరోధించాలని, వాటిని ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి హెచ్చరించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల తరపున ఏజెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో సెక్షన్ 144 సి.ఆర్.పి.సి, సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని, బహిరంగ ప్రదేశాల్లో నలుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది గుమిగూడరాదని, మారణాయుధాలను కలిగి ఉండరాదని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించరాదని, బాణా సంచా కాల్చరాదని, ఇతరులకు ఇబ్బంది కలిగే పనులను చేయరాదని హెచ్చరించారు. ఒకరిని ఒకరు రెచ్చగొట్టే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయకూడదని, సోషల్ మీడియా వేదికల్లో ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అసభ్యకర పోస్టులను పెట్టరాదని సూచనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్.వో పద్మావతి హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ ఒన్‌టౌన్, టూటౌన్, తాలుకా సీఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ఫిర్యాదుపై నేడు విచారణ

జగ్గయ్యపేట, మే 21 : జగ్గయ్యపేట అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థి వేల్పుల విజయ్ ఫిర్యాదుపై విచారణకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దిల్లీరావు జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారిని నియమించారు. ఆయన బుధవారం జగ్గయ్యపేటలో విచారణ చేపట్టనున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం అందింది. ఆ మేరకు తహసీల్దార్ కార్యాలయం ద్వారా ఎన్నికల సహాయ అధికారులకు నోటీసులు అందజేశారు. పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా జడ్పీ హైస్కూల్‌లో వైసీపీ అభ్యర్థి ఉదయభాను కుమారుడు, అల్లుడు బెదిరించారని, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై స్వతంత్ర అభ్యర్థి విజయకుమార్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి, పోలీసులకు ఫిర్యాదు చేయగా స్పందించకపోవటంతో.. విజయ్ రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసి, హైకోర్టులో పిటిషన్ వేశారు. అలాగే సీహెచ్ శ్రీనివాసరావు అనేవ్యక్తి చిల్లకల్లుతో పాటు పలుచోట్ల నిబంధనలు ఉల్లంఘించి బోర్లు వేయించారని ఫిర్యాదు చేశారు. పోలింగ్ కేంద్రంగా ఉన్న విశాఖ ఉక్కు కళావేదికను ప్రైవేట్ ఫంక్షన్లకు ఇవ్వటంపై కమిషనర్‌పై చేసిన ఫిర్యాదును జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి బుధవారం విచారించనున్నారు. కాగా స్వతంత్ర అభ్యర్థి వేల్పుల విజయ్ తాను వేసవి సెలవులు కావటంతో కుటుంబంతో వేరే రాష్ట్రంలో ఉన్నానని, బుధవారం విచారణకు రాలేనని మరొక రోజు హాజరవుతానని ఎన్నికల అధికారికి తెలిపారు. అయన అందుబాటులో లేకపోవటంతో వాట్సప్ ద్వారా జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ నోటీసులు పంపగా, విజయ్ కూడా వాట్సప్ ద్వారా సమాధానం ఇచ్చారు.

పెనమలూరులో అభ్యర్థుల

గెలుపు గాంభీర్యం!

- తమదే విజయం అంటూ ధీమా వ్యక్తం చేస్తున్న కూటమి నేతలు
- ఐదేళ్ల సంక్షేమ పథకాలు కలిసొస్తాయంటున్నవైసీపీ నేతలు
- గెలుపోటములపై పందెం రాయుళ్ల కినుక!



పెనమలూరు : కృష్ణాజిల్లాలో అత్యంత కీలకమైన పెనమలూరు నియోజకవర్గంలో గెలుపుపై అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ నేతలు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్ల సంక్షేమ పథకాలు అందుకున్న వివిధ వర్గాల ప్రజలు తమకే ఓటేశారని, జోగి రమేశ్ గెలుపు ఖాయమని అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో అభివృద్ధిని పక్కన పెట్టి ఇసుక, మట్టి, అక్రమ మైనింగ్, అవినీతి కారణంగా ప్రజలు విసుగు చెంది చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని, కూటమికే ప్రజలు పట్టం కట్టబోతున్నారని టీడీపీ నేతలు విశ్వసిస్తున్నారు. నియోజకవర్గంలో బలమైన సామాజికవర్గ ఓటర్లు, ఉన్నత విద్యాభ్యాసంతో ఉద్యోగాలు సంపాదించి ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన యువ ఓటర్లు టీడీపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, నియోజకవర్గంలో ఓటింగ్ 82శాతానికి పైగా నమోదవడం దీనికి బలం చేకూరుస్తోందన్నారు. మహిళల ఓట్లు అధిక మొత్తంలో నమోదవడం ఇరు పార్టీల అభ్యర్థులు తమ గెలుపుకోసమేనని ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్‌కు ప్రజల్లో ఉన్న ఆదరాభిమానాలు ఓట్లరూపంలో చూపించారని, అధికార పార్టీ అభ్యర్థి జోగి రమేశ్‌కు మైలవరం, పెడనలో ఉన్న వ్యతిరేకతను అక్కడి ప్రజలు ఫోన్లలో ఇక్కడి ఓటర్లకు తెలియజెప్పడం, జోగితో తంటాలే అన్న ప్రచారం జరగడం మరో కారణంగా భావిస్తున్నారు. జూన్4న వెలువడనున్న ఫలితాల్లో ఇరు పార్టీల నేతల భవితవ్యం తేలనుంది. అప్పటి వరకు విజయంపై ఎవరికి వారు మేకపోతు గాంభీర్యాలు పోతున్నా ఎక్కడో అనుమానాలు, ఆందోళనలు వెంటాడుతునే ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

పోరంకి సెగ్మెంట్ ఓట్లే కీలకం..

నియోజకవర్గంలో కీలకమైన పోరంకి సెగ్మెంట్ ఓటర్లే అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేయనున్నారని ఇరు పార్టీల నేతలు అంచనా వేస్తున్నారు. సెగ్మెంట్‌లో సుమా ముప్పైవేల పైచిలుకు ఓట్లు ఉండగా టీడీపీ వర్గీయులు కేవలం పోరంకిలోనే తమకు పదివేలకు పైగా మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తుండగా, టీడీపీకి కేవలం ఏడెనిమిది వేలకు మించి మొగ్గు రాదని వైసీపీ నేతలు తమ సమీక్షల్లో పేర్కొంటున్నారు. కానూరులో టీడీపీకి మెజారిటీ రాదని వైసీపీ వర్గీయులు అంటుండగా.. కానూరులో తమకు కనీసం నాలుగువేల మెజారిటీ వస్తుందని టీడీపీ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బెట్టింగ్‌కు పందెంరాయుళ్లు దూరం

వైసీపీ నాయకులు, శ్రేణులు తమ పార్టీ అభ్యర్థి గెలుపుపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని, పందేలు వెనుకడుగు వేస్తున్నట్టు.. పెనమలూరులో టీడీపీకి వచ్చే మెజారిటీపై పందేలు కాయడానికి ఉత్సాహం చూపిస్తున్నట్టు సమాచారం.

పనికోరిన ప్రతి కూలీకి ఉపాధి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు



కృష్ణలంక, మే 21 : ఉపాధి హామీ పథకంలో పని కోరిన ప్రతి కూలీకి ఉపాధి కల్పిస్తున్నామని, జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకొంటున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహరరెడ్డికి వివరించారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ తాగునీటి సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికోరిన ప్రతి కూలీకి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. వేసవి దృష్ట్యా జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపి వేసవి ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా శివారు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేసవి దృష్ట్యా నీటి సంరక్షణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. విద్యుత్ కోత లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకొన్నామని సాంకేతిక సమస్య ఎదురైతే తక్షణమే పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేసేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ డిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహరరెడ్డికి వివరించారు.



ఉమ్మడి కృష్ణా జిల్లా మహిళా జట్టుతో ముఖ్య అతిథులు ఇమ్మాన్యుయేల్, కళాశాల కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్, మే 21 : విజయవాడ మేరీ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనున్న ఏడో యూత్ అంతర్ జిల్లాల(రాష్ట్ర స్థాయి)బాల, బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ముఖ్యఅతిథిగా విజయవాడ క్రైస్ట్ టెంపుల్ డైరెక్టర్ బి.పాల్ ఇమ్మాన్యుయేల్ హాజరై ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, గెలుపోటములు సహజమని, అయితే విజయమే లక్ష్యంగా తమ పోరాట పటిమను క్రీడాకారులు టోర్నీలో చాటాలన్నారు. టోర్నీని ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి కృష్ణా జిల్లా అసోసియేషన్, మేరీ స్టెల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

పది పరీక్ష ఫలితాలపై డీఈవో సమీక్ష

ఉయ్యూరు, మే 21 : ప్రత్యేక ప్రణాళిక ద్వారా జిల్లాస్థాయిలో 90శాతం ఉత్తీర్ణత సాధించామని కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా అన్నారు. పదో తరగతి ఫలితాలపై గుడివాడ డివిజన్ మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ఉయ్యూరు వీఆర్‌కేఎం స్కూల్ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. పాఠశాలల్లో 'నాడు నేడు' పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.రాములునాయక్ అన్నారు. గుడివాడ డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి పద్మారాణి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ ఖాన్‌సాహెబ్, రాంబాబు తదితరులు పలు అంశాలపై సూచనలు చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పురప్రముఖులు, అర్చకులు

27 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్, మే 21 : జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న హనుమజ్జయంతి ఉత్సవాలకు సంబంధించి ప్రచార పోస్టర్, ఆహ్వాన పత్రికను మంగళవారం ఆవిష్కంచారు. తొలుత ఈవో కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి మాజీచైర్మన్ నెరుసు నాగభూషణం పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న నందమూరి రామకృష్ణ తదితరులు

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి

- నందమూరి రామకృష్ణ

వన్‌టౌన్, మే 21 : జగన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసాడని స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కుమారుడు నందమూరి రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల విలేకరులతో ఆయన మాట్లాడుతూ, విభజన అనంతరం ఎంతో కష్టపడి పునాదుల నుంచి నిర్మించుకుంటున్న రాష్ట్రాన్ని జగన్‌రెడ్డి సర్వనాశనం చేసాడని ఆరోపించారు. చంద్రబాబు పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి సంక్షేమ బాటలో పరుగులు పెడుతుందన్నారు. జూన్ 4 తరువాత దుర్గమ్మను మరల దర్శించుకుంటానని తెలిపారు. టీడీపీ బీసీ సాధికారిత సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, వీరమాచినేని శివప్రసాద్, వల్లూరి కిరణ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

కారులో తరలిస్తున్న నగదు స్వాధీనం

జగ్గయ్యపేట రూరల్, మే 21 : గరికపాడు అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కారులో తరలిస్తున్న రూ. ఏడు లక్షలను మంగళవారం అధికారులు సీజ్ చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన గల్లా శ్రీనివాసరావు టీఎస్ 04 ఈడీ 7069 కారులో నగదుతో వస్తుండగా తనిఖీలలో అధికారులు పట్టుకున్నారు. నగదుకు సబంధించి ఎటువంటి పత్రాలు అధికారులకు చూపకపోవటంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- తండ్రి మృతి, కుమారుడికి స్వల్పగాయాలు



మృతుడు మత్తి మురళి

గుణదల, మే 21 : వేసవి శిక్షణలో భాగంగా కుమారుడిని ఉదయాన్నే క్రికెట్ ఆడించి తిరిగి బైక్‌పై తీసుకొస్తుండగా లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. ప్రమాదంలో తండ్రి అక్కడికక్కడే మృతిచెందగా కుమారుడు ప్రాణాలతో బయటపడ్డాడు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా నాగాయలంక మండలం రేమాలవారి పాలెం గ్రామానికి చెందిన మత్తి మురళి(41) కొద్ది కాలంగా రామవరప్పాడు రైవస్ కాల్వకట్టపై నివాసం ఉంటు తాపీ మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి కొడుకు, కుమార్తె ఉన్నారు. ప్రతిరోజు ఉదయం కుమారుడిని బెంజిసర్కిల్ వద్ద క్రికెట్ కోచింగ్‌కు తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం శిక్షణ అనంతరం కుమారుడితో కలిసి బైక్‌పై వస్తుండగా రామవరప్పాడు రింగ్ వద్ద మైదుకూరుకు చెందిన లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీ చక్రాల కింద పడి మత్తి మురళి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నుంచి కుమారుడు పక్కకు పడిపోవడటంతో ప్రాణాపాయం తప్పింది. మాచవరం సీఐ గుణరామ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

వన్‌టౌన్, మే 21: శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తూ ఎన్నికల సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ప్రజలకు భరోసా కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు భవానీపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. ప్రసాద్ తెలిపారు. మంగళవారం భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో కుమ్మరిపాలెం సెంటర్ నుంచి సితార జంక్షన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. 38, 39, 44 డివిజన్లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించడంతో ప్రత్యేక దృష్టి పెట్టారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరూ కూడా ఎటువంటి ఆందోళనలు చేసేందుకు అవకాశం లేదని, అన్ని రాజకీయ పార్టీల వారు సమన్వయంతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

ప్రాంగణ ఎంపికల్లో ఎంవీఆర్ విద్యార్థుల సత్తా

గవర్నర్‌పేట, మే 21: ఎంఎన్‌సీ కంపెనీ డీఈసీ ఇండస్ట్రీస్ నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో ఎంవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విద్యార్థులు సత్తా చాటి ఉద్యోగ అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్ ఎంపికలో ఐదుగురు మెకానికల్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశం లభించిందని, సదరు కంపెనీ ఏడాదికి రూ. 2.5 లక్షలకు ప్యాకేజీ ఇవ్వనుందని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు ఎస్. మహేష్, ఎస్. హరిచంద్రప్రసాద్, ఎం.అభిషేక్, తేజకృష్ణలను కళాశాల చైర్మన్ ముత్తవరపు శ్రీనివాసబాబు, విభాగాధిపతి డాక్టర్ కె. ప్రదీప్‌కుమార్, ఏవో. ఎం. రామకృష్ణ, టీపీవో వి. విజయ్‌కుమార్‌లు అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, మే 21: రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వర నగర్ (1,2,3రోడ్స్), సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, స్పెన్సర్ సర్వీస్ రోడ్డు, సెంటిని హాస్పిటల్ ఏరియా, ఓల్డ్ వినాయక సినిమా హాల్ ఏరియా, ఒయాసిస్ హాస్పిటల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



నిత్యావసర సరుకుల పంపిణీ

వన్‌టౌన్, మే 21: కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నగరానికి శివారు ప్రాంతంలో ఉన్న కార్నర్‌స్టోన్ వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవోల ఆధ్వర్యంలో విద్యార్థులు వృద్ధాశ్రమానికి వెళ్లి నిత్యావసర వస్తువులను అందచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాలకు అండగా ఉండే విధంగా విద్యార్థులు తమ భవితను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డి.పవన్‌కుమార్, ఎన్ సాంబశివరావు, జెడ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సిట్ నివేదిక బహిర్గతం చేయాలి

● సీపీఎం డిమాండ్

గవర్నర్‌పేట, మే 21: ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై దర్యాప్తు జరిపిన సిట్ బృందం సమర్పించిన నివేదికను బహిర్గతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసుల వైఫల్యాలను, విధి నిర్వహణలో లోపాలు ఉన్నట్లు సిట్ బృందం నిర్ధారించిన నేపథ్యంలో నివేదికలోని అన్ని వివరాలను వెల్లడించడం మరింత అవసరమని అన్నారు. సిట్ నివేదికను ఎన్నికల సంఘం బహిర్గత పరిస్తే ఎన్నికల కమిషన్ పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నికల సమయంలో, తరువాత అధికార యంత్రాంగం, ఎన్నికల కమిషన్ భరోసా కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు.

మురుగుపారుదలకు అడ్డుకట్ట

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సత్యనారాయణపురం, మే 21: సత్యనారాయణపురం నాగేశ్వరరావు పంతులు రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగి రోడ్డు మీదకు వస్తుందని గత మూడు రోజులుగా రోడ్డు పైన నీరు పొంగుతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోలేదని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి సిబ్బంది కదిలారు. సత్యనారాయణపురం ఎన్నార్పీ రోడ్డు, ముదిగొండ వారి వీధితో పాటు పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పొంగకుండా మంగళవారం చర్యలు తీసుకున్నారు.



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు

దేశాభివృద్ధిలో రాజీవ్‌గాంధీ పాత్ర వెలకట్టలేనిది

● ఆంధ్రరత్న భవన్‌లో ఘనంగా వర్ధంతి

గవర్నర్‌పేట, మే 21: దేశాభివృద్ధిలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నిర్వహించి పాత్ర వెలకట్టలేనిదని మాజీ కేంద్రమంత్రి ఎం. పల్లంరాజు అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పీసీసీ, సిటీ కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు రోడ్డులోని ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో నివాళి కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పల్లంరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి సైన్స్, టెక్నాలజీని అందించిన నేత రాజీవ్‌గాంధీ అన్నారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, పీసీసీ ఉపాధ్యక్షుడు వి. గుర్నాథం, ఏఐసీసీ సభ్యుడు కొలనుకొండ శివాజీ, పీసీసీ నేతలు పి.వై. కిరణ్, ఏసుదాసు, ఖుర్షీదా, అన్సారీ, బైపూడి నాగేశ్వరరావు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న నిపుణుల బృందం, ఈవో తదితరులు, దుర్గగుడిలో రాహుకేతు పూజ, ధర్మపథం వేదికపై కళాకారుల బృందం నృత్యప్రదర్శన

ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనుల పరిశీలన

వన్‌టౌన్, మే 21: ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను, కొండప్రాంతాన్ని మంగళవారం సాంకేతిక నిపుణుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. వివిధ అభివృద్ధి పనులు, వాటి ప్రగతిని గురించి ఆలయ ఈవో కేఎస్ రామారావు, ఇంజనీరింగ్ అధికారులతో సంప్రతించారు. వివిధ అంశాలపై సూచనలు చేశారు. ఆర్ కొండలరావు ఆధ్వర్యంలో విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ రమేష్‌కుమార్, పి.త్రిమూర్తిరాజు, ఎస్.శ్రీనివాస్‌లు ఆయా పనులను సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి సాంకేతిక అంశాలపై పలు సూచనలు చేశారు. ఆలయ ఈఈ లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది, అధికారుల బృందం ఉన్నారు.

రేపు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షణ

ప్రతి పౌర్ణమికి నిర్వహిస్తున్న గిరిప్రదక్షణ కార్యక్రమం గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా జరగనున్నదని ఆలయ ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డు వద్ద నుంచి ప్రదక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షణ కుమ్మరిపాలెం, నాలుగుస్తంభాల సెంటర్, సితార సెంటర్, కబేళా రోడ్డు, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్‌ల మీదుగా ఊరేగింపు కొండమీదకు చేరుకుంటుందని చెప్పారు.

రాహుకాల పూజ

మంగళవారం సందర్భంగా ఆలయంలో రాహుకాల సమయంలో ఆర్జిత సేవ కింద రాహుకాల పూజను నిర్వహించారు. పలువురు మహిళలు, దంపతులు రాహుకాల పూజలో పాల్గొన్నారు.

● దుర్గగుడి ధర్మపథం వేదికపై మంగళవారం విశాఖపట్నానికి చెందిన కళారాధన మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ గురువు తాళ్లపాక సందీప్ కుమార్ ఆధ్వర్యంలోని బృందం పలు కీర్తనలకు నాట్య ప్రదర్శన చేసింది.

పార్కింగ్ వసతుల పరిశీలన

దుర్గగుడి పరిసర ప్రాంతాల్లో దుర్గగుడికి వచ్చే భక్తులకు చెందిన వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో మంగళవారం ఈవో రామరావు వన్‌ట్రాఫిక్ పోలీసులతో క్షేత్ర స్థాయిలో చర్చించారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా అనువైన ప్రదేశాల్లో పార్కింగ్‌కు వీలు కల్పించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం శుభపరిణామం

ప్రముఖ వైద్యులు జి. సమరం

గవర్నర్‌పేట, మే 21: సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం బాగా పెరగడం శుభపరిణామమని, ప్రజాస్వామ్యం పట్ల, మన దేశ ఎన్నికల విధానం పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసాన్ని ఇది సూచిస్తోందని సామాజిక వేత్త, ప్రముఖ వైద్యులు జి. సమరం అన్నారు. ప్రజల్లో ఓటు ప్రాధాన్యత వివరిస్తూ జిల్లా వ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, కళాజాతాలు, సైకత శిల్పాలు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించిన పలువురు ప్రముఖులను సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బందరు లాకుల సెంటర్‌లోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో అభినందన, సత్కార కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు జి. సమరం, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి ఉప్పలపాటి శ్రీనివాసరావు, ప్రజా గాయకుడు ఆర్. పిచ్చయ్య, సైకత శిల్పి బాలాజీలను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమరం ఎన్నికల విధానంలో వివిధ దేశాల్లో అవలంబిస్తున్న విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మానసిక వైద్యులు వి. సదానందం, వల్లూరు రామారావు, అసోసియేషన్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎంవీ బాబు, కోశాధికారి దావులూరి సాంబశివరావు, సంఘ సభ్యులు నాదెళ్ళ సుమతీదేవి, సామాజిక కార్యకర్త అరుణకుమార్, వైద్యులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సమరంను సత్కరిస్తున్న సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ సభ్యులు

ఫిడే చెస్ రేటింగ్‌లో అహ్మద్‌ఖాన్ ముందంజ



అహ్మద్‌ఖాన్, నబీహా, అక్షరలను అభినందిస్తున్న షేక్ ఖాసీమ్

విజయవాడస్పోర్ట్స్, మే 21: గ్లోబల్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చెస్ క్రీడాకారుడు దుల్కర్ అహ్మద్ ఖాన్ ఫిడే రేటింగ్‌లో ముందంజ వేశాడు. గత నెలలో కానూరు లోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన తొలి ఇంటర్నేషనల్ టోర్నీలో 1424 రేటింగ్‌తో సత్తా చాటాడు. షామ్‌రాక్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న అహ్మద్‌ఖాన్ ప్రతిభ చాటిన సందర్భంగా మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీ కార్యాలయంలో అకాడమీ అధ్యక్షుడు కె.రాజేంద్ర, కార్యదర్శి షేక్ ఖాసీమ్‌లు అభినందించారు.

జిల్లా స్థాయిలోనూ పలువురి ప్రతిభ

ఈ నెల 18న జరిగిన జిల్లా ఉమెన్, ఓపెన్ చెస్ టోర్నీలో నలుగురు విద్యార్థుల సత్తా చాటి హిందూపూర్‌లో ఈ నెల 25, 26వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా చెస్ చాంపియన్‌షిప్‌కు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని గ్లోబల్ చెస్ అకాడమీ కార్యదర్శి షేక్ ఖాసీమ్ తెలిపారు. నలంద విద్యానికేతన్ విద్యార్థి మాచర్ల అక్షర(9వ తరగతి), వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ (9వ తరగతి) విద్యార్థి షేక్ నబీహ టోర్నీలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.

ఓటమి భయంతోనే జోగి విమర్శలు

● టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి

విద్యాధరపురం, మే 21: ఓడిపోతాననే భయంలో నుంచి వస్తున్న అసహనంతో జోకర్ జోగి రమేష్ ఏం వాగుతున్నాడో అతనికే తెలియడంలేదని టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెడన ప్రజలు తంతే జోగి రమేష్ పెనమలూరులో పడ్డాడని, పెనమలూరులో ప్రజల తన్నుడుకి జోగి రమేష్ బతుకేంటోనన్నారు. వైసీపీ అధ్యక్షుడు, ఆ పార్టీ నాయకులు ఊర్లు దాటాలంటే కోర్టు పర్మిషన్‌లు కావాలని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు యూనివర్సల్ లీడర్ అని తెలుసుకోవాలని హెచ్చరించారు. అవినీతికి పాల్పడుతున్న జోగి రమేష్ నీతి, నిజాయితీల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో జరిగిన ప్రతి గొడవకు వైసీపీ నాయకులే కారణమని ప్రజలు చెబుతున్నారన్నారు.

బాల్యవివాహాల అంతమే లక్ష్యం

● వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి



పటమట, మే 21 : బాల్య వివాహాలను అంతం చేయడమే లక్ష్యంగా కొత్త రోడ్ మ్యాప్‌తో ముందుకు వెళుతున్నామని వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి తెలిపారు. బాల్య వివాహాల నిరోధంపై న్యూఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌కు వాసవ్య మహిళామండలి సభ్యులు హాజరయ్యారు. బాల్య వివాహరహిత భారతదేశం ప్రచారంలో భాడంగా 22 రాష్ట్రాలకు చెందిన ఎన్జీవోలు 2024-25 కోసం రోడ్‌మ్యాప్ గురించి చర్చించారని ఆమె తెలిపారు. 2030 నాటికి దేశంలో బాల్యవివాహాలను నిరోధించాలని, దేశ వ్యాప్తంగా ఉన్న చైల్డ్‌మ్యారేజీ ఫ్రీ ఇండియా(సీఎంఎఫ్ఐ) ప్రచారానికి చెందిన సుమారు 200 మంది ఎన్జీవో భాగస్వాములు హాజరయ్యారు. సీఎంఎఫ్ఐ మిత్ర పక్షమైన ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పనిచేస్తున్న వాసవ్య మహిళా మండలి కూడా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారని ఆమె తెలిపారు. బాల్య వివాహాల నిరోధం కోసం పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, స్థానిక పెద్దలతో కలిసి పని చేస్తూనే ఉంటామని తెలిపారు.

దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనేక బాలల రక్షణ సంస్థలు పరస్పరం అనుభవాలను, సవాళ్లను పంచుకున్నామని, కొత్తగా రూపొందించిన రోడ్‌మ్యాప్‌లో బాల్య వివాహాలు నిరోధానికి మరింత ఉత్సాహంగా ముందుకు వెళతామని కీర్తి తెలిపారు.

వించిపేట ఏనుగుల వారి వీధిలో

యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు

వన్‌టౌన్, మే 21: వించిపేట ఏనుగుల వారి వీధిలో యథేచ్ఛగా కొంతమంది యువకులు అసాంఘిక కార్యకలాపాలు పాల్పడుతున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 54వ డివిజన్ చర్చి దగ్గర కొంతమంది యువకులు చేరి ఖాళీగా ఉన్న ఆటోల్లో కూర్చుని మద్యం సేవించడం, సిగరెట్లు తాగడం, గంజాయి తాగడం చేస్తున్నారన్నారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. వీరి అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు చెబుదామంటే ఎన్నికల డ్యూటీ అంటూ కొత్తపేట పోలీసులు సరిగా స్పందించలేదన్నారు. పోలీసులు తక్షణమే స్పందించి స్థానికులకు భరోసా ఇవ్వాలన్నారు. లేదంటే తమ పార్టీ తరఫున స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులను అందిపుచ్చుకోవాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి విద్యాసాగర్

మొగల్రాజపురం, మే 21: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని తమ సత్తాను చాటుకోవాలని గుంటూరు జిల్లా నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి విద్యాసాగర్ సూచించారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో మనుగడ సాధించడం ఎలా అనే అంశంపై మూడు రోజుల సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో కొత్త కొత్త అప్లికేషన్‌లు, కొత్త పరిజ్ఞానం వస్తోందని, ప్రతి విద్యార్థి అప్‌డేట్‌గా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వేమా సోలార్ ముంబయి వ్యవస్థాపకుడు ఎంఎస్‌రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కంప్యూటర్ డేటా విశ్లేషణ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. ఫిక్సటీ ఈడిక్స(హైదరాబాద్) కార్యనిర్వాహణాధికారి మూర్తి నంజన్, ప్రసాద్‌లు మాట్లాడుతూ సమాచార విశ్లేషణ,రక్షణ రంగంలో ఉపాధి పొందే మార్గాలను సూచించారు. స్టూడెంట్ ట్రైబ్ హైదరాబాద్ వ్యవస్థాపకులు శ్రీచరణ్ లక్కరాజు, సాధ్యశో టెక్నాలజీస్ లిమిటెడ్ (హైదరాబాద్) ప్రకాష్ కాజా, ఐబీ గ్రూప్ మేనేజర్ (బెంగళూరు) సంతోషి రాజమనే మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ రంగంలో మార్పులను ఎప్పటికపుడు తెలుసుకుని కొత్త సాంకేతికను నేర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మేకా రమేష్ అధ్యక్షత వహించారు. డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ తదితరులు మాట్లాడారు. అనుసంధాన కర్తగా కంప్యూటర్‌సైన్సు విభాగం హెడ్ డాక్టర్ టీఎస్ రవికిరణ్ వ్యవహరించగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

మురుగు, పంట కాల్వల అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

● ఇరిగేషన్ ఇంజనీరింగ్ చీఫ్‌కు కౌలు రైతు సంఘం నాయకుల వినతి

వన్‌టౌన్, మే 21: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా మురుగు, పంట కాల్వల అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదని, వాటిపై దృష్టి పెట్టాలని ఇరిగేషన్ ఇంజనీరింగ్ చీఫ్‌కు మంగళవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, సహాయ కార్యదర్శి రంగారావులు వినతిపత్రం అందజేశారు. కిందటేడాది జూలై నెలలో అధిక వర్షాల కారణంగా కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, గుంటూరు, బాపట్ల, కాకినాడ తదితర జిల్లాల్లోని కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క నిండిపోవడం వలన పూర్తిగా పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతేడాది కాల్వ చివరి భూములకు నీరు అందక దాదాపు పదిలక్షల ఎకరాలలో పంట సాగు కాలేదని తెలిపారు. సముద్రపు ఒడ్డులో నిర్మించిన స్లూయిజులు చాలా ప్రాంతాల్లో పనిచేయకపోవడం వలన ఆ ప్రాంతాల్లోని పంట పొలాలు సాగుకావడం లేదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద పాడైపోయిన గేట్లను వెంటనే సరిచేసి తిరిగి అమర్చాల్సిందిగా కోరారు. విజయవాడ శివారు ప్రాంతాలుగా ఉన్న కానూరు, పోరంకి ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, అపార్ట్‌మెంట్‌లు, నూతన భవనాలు అభివృద్ధి వలన మురుగునీటి కాలువలను పూడ్చి వేశారన్నారు. కాల్వలు తూటుకాడ, జమ్మి, గుర్రపుడెక్క వంటి వ్యర్థాలతో పూడిపోయాయన్నారు. దీంతో పంటపొలాలు పూర్తిగా మురుగునీటితో నిండిపోవడం వలన పంటచేతికి రాక రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. కొంతమంది రైతులు తమ భూములను బీడుగా పెట్టారన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే మురుగు, పంటకాల్వల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించి నిధులను కేటాయించి రైతులను ఆదుకోవాలని కోరారు.











కొత్త తేదీన
హరోం హర




సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరోం హర'. మరోసారి ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెలాఖరున ఈ చిత్రం విడుదలవ్వాలి. అయితే మంగళవారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూన్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో వెనుక అగ్ని జ్వాలలు చెలరేగుతుండగా, భుజంపై తుపాకీతో నడిచొస్తున్న సుధీర్‌బాబు లుక్ శక్తిమంతంగా ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలక పాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. సంగీతం: చైతన్ భరద్వాజ్. సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్.

పారితోషికం రూ.250 కోట్లా?




బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగి, పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిన ప్రియాంక నటనకు గుడ్‌బై చెప్పకుండా హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌లు చేస్తూ బిజీగానే ఉన్నారు. అమెజాన్ ప్రైమ్ కోసం ఆమె గత ఏడాది 'సెటడెల్' సిరీస్‌లో నటించారు. దీనికి ఇండియన్ వెర్షన్‌లో ప్రియాంక పాత్రను సమంత చేశారు. 'సిటాడెల్'లో నటించినందుకు ప్రియాంక తీసుకున్న పారితోషికం ఎంతో తెలుసా? దాదాపు రూ. 250 కోట్లు. బాపురే.. అనుకోకండి. ఇది నిజమే. ఇటీవల వచ్చిన సంజయ్ లీలా భన్సాలి 'హీరామండీ' కోసం నెట్‌ఫ్లిక్స్ చెల్లించిన మొత్తం కంటే ప్రియాంక తీసుకున్న పారితోషికమే ఎక్కువట. అంటే ఇప్పుడు ఓటీటీలో హయ్యెస్ట్ పెయిడ్ ఆర్టిస్ట్ ప్రియాంక నే అన్నమాట. ఆమె పనే బాగుంది కదూ!



ఖురేషి అబ్రమ్.. అదిరే లుక్!

మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'కు సీక్వెల్ వస్తోంది. 'ఎల్ 2 ఎంపురాన్' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఖురేషి అబ్రమ్ పాత్రను పోషిస్తున్నారు. స్టీఫెన్ నడుంపల్లి ఖురేషి అబ్రమ్‌గా ఎలా మారాడనే విషయాన్ని సీక్వెల్‌లో చూపించబోతున్నారు. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఆ పాత్ర లుక్ విడుదల చేశారు. స్టయిలిష్‌గా నడుచుకుంటూ వస్తున్న మోహన్‌లాల్ లుక్ అదిరిపోయిందని అంటున్నారు. నటుడు, ఈ చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్ 'హ్యాపీ బర్త్ డే లాలెట్టా' అంటూ సోషల్ మీడియా వేదికగా మోహన్‌లాల్‌కు అభినందనలు తెలిపారు. మరో విషయం ఏమిటంటే లైకా ప్రొడక్షన్స్ సంస్థ 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రంతో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతోంది. లడఖ్, చెన్నై, కొట్టాయం, అమెరికా, లండన్ ప్రాంతాల్లో 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం షూటింగ్ జరిగింది. ప్రస్తుతం తిరువనంతపురంలో చిత్రీకరణ జరుగుతోంది. ఆ తర్వాత గుజరాత్, దుబాయ్‌లో కూడా షూటింగ్ చేయాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది భారీ లెవల్‌లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు సుభాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్ చెప్పారు.



కేన్స్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. దాంతో ప్రమోషన్ వర్క్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లిన కన్నప్ప టీమ్ అక్కడ సందడి చేసింది. నిర్మాత మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. అక్కడ 'కన్నప్ప' టీజర్‌ను అందరికీ ప్రదర్శించారు. ఈ టీజర్ చూసి అక్కడి ప్రేక్షకులు ముగ్ధులయ్యారని విష్ణు తెలిపారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూటర్స్ కేన్స్ ఫెస్టివల్‌కు వచ్చిన ఇండియన్స్ టీజర్ బాగుందని అభినందించారు. ఆ రెస్పాన్స్ చూసిన తర్వాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.' అని ఆయన తెలిపారు. జూన్ 13న ఇండియా వైడ్‌గా 'కన్నప్ప' టీజర్ విడుదల చేస్తారు. దానికంటే ముందు ఈ నెల 30న తెలుగులో కన్నప్ప టీజర్‌ను రిలీజ్ చేస్తామని విష్ణు వెల్లడించారు. 'మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంతమంది సెలెక్టెడ్ ఆడియన్స్‌కు ఈ టీజర్ చూపిస్తాం' అని అన్నారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు.

వెల్‌కమ్‌కు గుడ్‌బై



బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ 'వెల్‌కమ్ టు ది జంగిల్' సినిమాకు ఉన్నట్టుండి గుడ్‌బై చెప్పేశారు. డిసెంబర్‌లో ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టిన ఆయన ఇప్పటివరకు కేవలం ఒక్క రోజు మాత్రమే షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సినిమాలోని సంజయ్ పాత్రకు యాక్షన్ పార్ట్ ఎక్కువగా ఉండడంతో ప్రస్తుత తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయన ఈ సినిమా నుంచి తప్పుకొన్నట్లు తెలుస్తోంది. కాగా, 'వెల్‌కమ్' సిరీస్‌లో మూడవ భాగంగా వస్తున్న చిత్రం 'వెల్‌కమ్ టు ది జంగిల్'. ఈ యాక్షన్ అడ్వెంచర్ కామెడీ డ్రామాను అహ్మద్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. అక్షయ్‌కుమార్, సునీల్ శెట్టి. దిశా పటానీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, లారా దత్తా తదితరులతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. జ్యోతి దేశ్‌పాండే, ఫిరోజ్ ఏ నడియాడ్‌వాలా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 20న ఈ చిత్రం ప్రేక్షకులను పలకరించనుంది.

అక్టోబర్‌లో సెట్స్‌పైకి



సీక్వెల్స్..ఇప్పుడు బాలీవుడ్‌లో నడుస్తోన్న ట్రెండ్. త్వరలో మరో సీక్వెల్ చిత్రం బాలీవుడ్‌లో పట్టాలెక్కనుంది. 1997లో వచ్చిన బాలీవుడ్ వార్ డ్రామా 'బోర్డర్'. ఆ తరం ప్రేక్షకులను అమితంగా అలరించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. సన్నీడియోల్ కథానాయకుడిగా నటించారు. దేశభక్తి, సరిహద్దుల్లో సైనికుల త్యాగాలు, వారి కుటుంబాలు పడే తపన లాంటి అంశాలను హృద్యంగా చిత్రీకరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'బోర్డర్ 2' తెరకెక్కుతోంది. ఇందులో సన్నీతో పాటు ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పూర్తయింది, అక్టోబర్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జేపీ దత్తా, నిధి దత్తా, భూషణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 2026లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఎమ్మెస్ సుబ్బలక్ష్మి బయోపిక్ హీరోయిన్ ఎవరు?









భారతరత్న గ్రహీత, ప్రఖ్యాత గాయని, దివంగత ఎమ్మెస్ సుబ్బలక్ష్మీ జీవితాన్ని వెండితెరపైకి ఆవిష్కరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ బయోపిక్‌ను తెరకెక్కించేది ఎవరు, నిర్మించేది ఎవరు అన్న విషయం ఇంకా అధికారికంగా తెలియనప్పటికీ ఇందులో టైటిల్ రోల్ పోషించేది ఎవరనే చర్చ మాత్రం విస్తృతంగా జరుగుతోంది. నయనతార, త్రిష, రష్మిక పేర్లు ప్రముఖంగా వినపడుతున్నాయి. ఈ సినిమా కోసం ఇప్పటికే బెంగుళూరుకు చెందిన ఓ నిర్మాణ సంస్థ, పేరొందిన డైరెక్టర్‌తో కలసి స్క్రిప్ట్ పనుల్లో తలమునకలై ఉన్నట్లు తెలిసింది. స్క్రిప్ట్ పనులన్నీ పూర్తయ్యాక ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అలాగే, అతి త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టి వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.



డర్టీఫెలోకు ఛాయిస్ లేదు



శాంతి చంద్ర, దీపిక సింగ్, స్మిమిత్, నికిష రంగ్‌వాలా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి. శాంతిబాబు నిర్మించారు. ఈ నెల 24న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'డర్టీఫెలో' అనే టైటిల్ ఎందుకు పెట్టారు అని శాంతిచంద్రను అడిగాను. 'ఈ కథకు ఆ టైటిల్ తప్ప మరో ఛాయిస్ లేదని ఆయన చెప్పారు. మంచి కథతో వస్తున్న చిత్రమిది' అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'ఎప్పటికైనా హీరో కావాలనుకున్నాను. అది 'మంత్ర' చిత్రంతో నెరవేరింది. ఆ తర్వాత బిజినెస్ పనులతో గ్యాప్ వచ్చింది. మళ్లీ 'డర్టీఫెలో' కథ నచ్చడంతో నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాను. ఎమోషన్, యాక్షన్, రొమాన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అన్నారు. అడారి మూర్తి సాయి మాట్లాడుతూ 'సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న సినిమాలను బతికించండి. చిత్రబృందం అంతా ఒకే కుటుంబంలా కలసి పనిచేశాం. కథా బలమున్న చిత్రమిది' అన్నారు.

మహీ గంగా హారతి



వంక పెట్టడానికి వీల్లేని అభినయంతో హీరోయిన్‌గా అభిమానులను అలరిస్తున్నారు జాన్వీకపూర్. ఒక సినిమాలో నటించడంతోనే తన బాధ్యత తీరిపోయినట్లు జాన్వీ ఎప్పుడూ భావించరు అనేది బాలీవుడ్ నిర్మాతల మాట. ఇటీవలే ఆమె నటించిన 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారం కోసం దేశంలోని ప్రధాన నగరాలను చుట్టొస్తున్నారు జాన్వీ. హీరో రాజ్‌కుమార్ రావుతో కలసి తమ సినిమాకు ప్రచారం కల్పిస్తున్నారు. వీరిద్దరూ కలసి మంగళవారం కాశీ పర్యటన చేశారు. అందులో భాగంగా జాన్వీ సంప్రదాయ దుస్తుల్లో గంగా హారతి కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు.

జూన్‌లో 'ఓ.సి' వినోదం



హరీశ్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా తెరకెక్కిన చిత్రం 'ఓ.సి'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌కు హరీశ్‌బొంపెల్లి దర్శకుడు. టీవీఎస్ నిర్మాత. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. జూన్ 7న 'ఓసి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ 'ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన కొందరు యువకుల జీవితాలు ఎలాంటి మలుపు తిరిగాయనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఆసక్తి కరంగా ఉంటుంది. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు 'ఓ.సి' అనే టైటిల్ పెట్టడానికి ఉన్న కారణం సినిమా చూస్తే తెలుస్తుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి వంశీ ఎస్., అక్షర్ బ్యాండ్ సంగీతం అందించారు.



ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 22 మే 2024

ఫ్యాషన్

ఫ్యూజన్ ఫ్యాషన్





సంప్రదాయ చీరకట్టు కచ్చితంగా అందంగానే ఉంటుంది. అయితే ఆధునికత ఉట్టిపడేలా కనిపించాలంటే ఫ్యూజన్ స్టైల్ శారీ ఎంచుకోవాలి. ఈవినింగ్ పార్టీస్, ఈవెంట్స్‌లో వినూత్నంగా కనిపించడం కోసం నేటి యువతులు ఎంచుకున్న ఫ్యూజన్ శారీస్ మీద ఓ లుక్కేద్దామా?

రెండు స్టైల్స్ కలగలిపి....

ఒకే చీరలో రెండుకు మించిన స్టైల్స్ దాగి ఉంటే, అదే, ఫ్యూజన్ శారీ! చుడీదార్, ఘాగ్రా, జీన్స్... ఇలా వేర్వేరు దుస్తులను తలపించేలా, లేదా రెండు మూడు రకాల దుస్తులను కలగలిపినట్టు కనిపించేలా ఫ్యూజన్ శారీస్‌ను డిజైన్ చేసుకోవచ్చు. అందుకోసం కొంత సృజనాత్మకత, ఫ్యాషన్ పట్ల అవగాహన ఉంటే సరిపోతుంది.

హుందాగా కనిపిస్తూ...

స్వయంగా డిజైన్ చేయించుకోవడం నచ్చని వాళ్లు, రెడీమేడ్‌గా దొరికే ఫ్యూ జన్ శారీస్‌ను కూడా ఎంచుకోవచ్చు. అయితే అవి శరీరానికి నప్పేలా ఉండేలా చూసుకోవాలి. ఎబ్బెట్టుగా కనిపించకుండా, స్టైల్‌గా కనిపించే ఫ్యూజన్ శారీస్ నలుగురినీ ఆకట్టుకుంటాయి. ఈ చీర కట్టులో హుందాగా కనిపించాలంటే, ఆ స్టైల్‌ను అంతే గ్రేస్‌ఫుల్‌గా హ్యాండిల్ చేయగలగాలి. ప్రత్యేకంగా కనిపించాలనే కోరిక, కొత్తదనాన్ని స్వాగతించే స్వభావం కూడా అవసరమే!





యాక్సెసరీస్

హైహీల్స్, ఫ్యాషన్ జ్యువెలరీ ఫ్యూజన్ శారీస్‌తో కలిపి తప్పక ధరించాలి. హెయిర్‌స్టైల్స్ నప్పేలా ఉండాలి. భిన్నంగా కనిపించడం కోసం కాంట్రాస్ట్ కలర్స్ ఎంచుకోవచ్చు. అయితే ఫ్యూజన్ శారీకి సెక్విన్లు, ఎంబ్రాయిడరీలు లాంటి హంగులు పనికి రావు. వీలైనంతవరకూ ప్లెయిన్ కలర్స్, కాంట్రాస్ట్ దుస్తుల మీదే దృష్టి పెట్టాలి.



‘వీల్’ పవర్

అల్ఫియా జేమ్స్...
ఒకప్పుడు బాస్కెట్‌బాల్‌లో దేశానికి ఆశాకిరణమైన ఆమె ఒక దుర్ఘటన వల్ల వీల్‌చైర్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. కానీ ఆ వైకల్యాన్ని ఆమె ఆత్మవిశ్వాసంతో ఎదిరించారు. పారా-బ్యాడ్మింటన్‌లో పతకాల పంట పండిస్తూ... దేశంలోనే నెంబర్ వన్ ర్యాంక్‌లో నిలిచారు. “దృఢ సంకల్పాన్ని మించిన బలం లేదు. ఓటమి అనే ఆలోచన ఎన్నడూ మనసులోకి రానివ్వకూడదు” అంటున్న అల్ఫియా స్ఫూర్తిమంతమైన ప్రయాణం గురించి...



కిందటివారం... దుబాయ్‌లోని ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమం. సెలబ్రిటీగా ఆ వేడుకలో పాల్గొనడానికి వీల్‌చైర్‌లో వచ్చారు. అల్ఫియా జేమ్స్.. తనను స్వాగతించడానికి అక్కడ ఏర్పాటు చేసిన డిజిటల్ హోర్డింగ్స్‌నూ, నిర్వాహకులు, ఆహూతులు తనను అడుగడుగునా అభినందించిన తీరును చూసి ఆమె తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. ఆ కార్యక్రమంలోనే ఆమెకు ‘గోల్డెన్ వీసా’కూడా ప్రదానం చేశారు. సత్కారం అనంతరం ఆమె ప్రసంగిస్తున్నప్పుడు... కరతాళ ధ్వనులతో ఆడిటోరియం మారుమోగింది. దురదృష్టం వెంటాడినా... విధిని ఎదిరించి నిలిచిన అల్ఫియా స్థైర్యం, “గట్టిగా నిశ్చయించుకుంటే ఏదీ అసాధ్యం కాదు” అనే ఆమె నినాదం... ప్రేక్షకుల్లో గొప్పస్ఫూర్తిని నింపింది. “ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతోనే ఆలోచించాలి. దేన్నైనా మనసారా కోరుకుంటే.. దాని కోసం కష్టపడాలి. అప్పుడు మీరు తప్పకుండా అనుకున్నది సాధించగలరు” అంటున్న అల్ఫియా... వైకల్యం ఎదురైనా తన లక్ష్యానికి అనుగుణంగా జీవితాన్ని మలచుకున్నారు.

కొన్నాళ్ళు ఒత్తిడిలో ఉన్నా...

కేరళలోని మువాత్తుపుళ ఆమె స్వస్థలం. ఆమెకు ఏడేళ్ళ వయసున్నప్పుడే తండ్రి జేమ్స్ మరణించారు. “మా అమ్మ బిజ్జీ నర్స్. నన్నూ, నా తమ్ముడు అల్విన్‌నూ బాగా చదివించడానికి ఎన్నో కష్టాలు పడింది. హైస్కూల్‌లో ఉన్నప్పుడు క్రీడలంటే ఇష్టం ఏర్పడింది. బాస్కెట్‌బాల్‌లో రాణించాను. ఎన్నో పోటీల్లో గెలిచాను. జాతీయ జట్టులో స్థానం సంపాదించాను” అని చెప్పారు అల్ఫియా. దేశానికి ఆశాకిరణంగా ఆమెను క్రీడాభిమానులతోపాటు మీడియా అభివర్ణించింది. ఒక నేషనల్ టోర్నీకి ఆమె సిద్ధమవుతున్న దశలో దుర్ఘటన జరిగింది. “అప్పుడు ప్లస్ టూ చదువుతున్నాను.



బాస్కెట్ బాల్ జాతీయ జట్టులో సభ్యురాలిని. ఒక రోజు వర్షం పడుతూ ఉండగా... హాస్టల్‌లోని నా గది నుంచి బయటికి వచ్చాను. ప్రమాదవశాత్తూ కాలు జారడంతో... రెండో అంతస్తు నుంచి కిందపడిపోయాను. తెలివి వచ్చేసరికి ఆసుపత్రిలో ఉన్నాను. నా వెన్నెముక తీవ్రంగా దెబ్బతిందనీ, ఇక నడవలేననీ, నిలబడడం కూడా కష్టమనీ వైద్యులు చెప్పారు. ఎన్నో నెలలపాటు చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. మానసికంగా అలసిపోయాను. నా జీవితం తల్లకిందులైనట్టు అనిపించింది. క్రీడాకారిణిగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలన్నది నా కల. అది నెరవేరే పరిస్థితి లేదనే వాస్తవం నన్ను కుంగదీసింది.. కొన్నాళ్ళు డిప్రెషన్‌లోనే ఉన్నాను. కానీ త్వరలోనే దాని నుంచి బయటపడ్డాను. చదువు కొనసాగించాలని నిర్ణయించుకున్నాను. ప్రైవేట్‌గా ఇంటర్ పూర్తి చేశాను. డిగ్రీలో మళ్ళీ హాస్టల్‌కు వెళ్ళడానికి మా అమ్మను కష్టం మీద ఒప్పించాను. అలా నా రెండో అధ్యాయాన్ని మొదలు పెట్టాను” అని గుర్తు చేసుకున్నారు అల్ఫియా.

అప్పుడు ప్లస్ టూ చదువుతున్నాను. బాస్కెట్ బాల్ జాతీయ జట్టులో సభ్యురాలిని. ఒక రోజు వర్షం పడుతూ ఉండగా... హాస్టల్‌లోని నా గది నుంచి బయటికి వచ్చాను. ప్రమాదవశాత్తూ కాలు జారడంతో... రెండో అంతస్తు నుంచి కిందపడిపోయాను. తెలివి వచ్చేసరికి ఆసుపత్రిలో ఉన్నాను. నా వెన్నెముక తీవ్రంగా దెబ్బతిందనీ, ఇక నడవలేననీ, నిలబడడం కూడా కష్టమనీ వైద్యులు చెప్పారు.

క్రీడాస్ఫూర్తితో అధిగమిస్తున్నా...

కాలేజీలో చదువుతూనే.. ఆమె తన ఖాళీ సమయాల్లో జిమ్‌కు వెళ్ళి, పవర్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేశారు. వివిధ పోటీల్లో పాల్గొని, గెలవడం ఆమె ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నేషనల్ పారా-లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని... రజత పతకం గెలుచుకున్నారు. ఆ తరువాత బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకోవాలనుకున్నారు. కానీ కేరళలో వీల్ చైర్ బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రాలేవీ లేవు. ఆమె పరిస్థితి తెలుసుకున్న ట్రైనర్ బాలా తనే ఏర్పాట్లు చేశారు. అల్ఫియా గురించి తెలుసుకొని, ఆమెను స్పాన్సర్ చెయ్యడానికి ‘ఎలైట్ గ్రూప్’ ముందుకు వచ్చింది. ఉద్యోగం కూడా ఆఫర్ చేసింది. దాంతో ఆమె ఇక వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం లేకపోయింది. మొదటి చాంపియన్‌షిప్‌లోనే రెండు స్వర్ణ పతకాలను గెలిచారు. అప్పటినుంచీ ఆమె విజయ పరంపర కొనసాగుతోంది. ఇప్పుడు అల్ఫియా ప్రొఫెషనల్ పారా-బ్యాడ్మింటన్ ప్లేయర్. అనేక జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన ఆమె... భారతదేశం తరఫున దుబాయ్, బెహరీన్ తదితర దేశాల్లో జరిగిన ఆరు అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొని... ఏడు పతకాలను దేశానికి సంపాదించిపెట్టారు. ప్రస్తుతం పారా-బ్యాడ్మింటన్‌లో ఆమె వరల్డ్ ర్యాంక్ పన్నెండు, ఆసియా ర్యాంక్ అయిదు. భారతదేశంలో ఆమెది నెంబర్ వన్ ర్యాంక్. “ఈ ఏడాది సమ్మర్ పారా-చాంపియన్‌షిప్‌తో పాటు ప్రధానమైన కొన్ని అంతర్జాతీయ టోర్నమెంట్లు ఆడాల్సి ఉంది. 2026లో జరిగే ఆసియా క్రీడలకు ఇప్పటినుంచే సిద్ధమవుతున్నాను. నా జీవితంలోని చాలా దశల్లో అవరోధాలు ఎదురయ్యాయి. ఎల్లప్పుడూ నాలో ఉన్న క్రీడాస్ఫూర్తే వాటిని అధిగమించేలా చేస్తోంది. మా అమ్మ, తమ్ముడు నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. తోటి క్రీడాకారులు, అభిమానులు అండగా నిలుస్తున్నారు. వారందరి ప్రేమాభిమానాలే... మరిన్ని పతకాలు సాధించి, మన దేశానికి ప్రతిష్ఠ తేవాలనే నా లక్ష్యానికి ప్రేరణ” అంటున్నారు అల్ఫియా.



ఉప్పు మితంగా...

ఉప్పు లేనిదే వంటకాలకు రుచి రాదు. అలాగని ఉప్పులోనే రుచిని వెతుక్కుంటే అనారోగ్యాలను కొని తెచ్చుకున్నవాళ్లం అవుతాం. రక్తపోటును పెంచడంతో పాటు, శరీరంలో నీరు నిల్వ ఉండిపోయేలా చేసే ఉప్పును వీలైనంత పరిమితంగా తీసుకోవాలి. రోజుకు ఐదు గ్రాములకు మించకుండా చూసుకోవాలి. అదనపు ఉప్పుతో రక్తనాళాలకు, ఎముకలకూ, జీర్ణకోశానికీ నష్టం జరుగుతుంది. ఉప్పు.. రక్తపోటును పెంచడంతో పాటు, జీర్ణాశయంలోని మ్యూకోసాను దెబ్బ తీసి, గ్యాస్ట్రిక్ అల్సర్లు తలెత్తడానికీ, ఎముకల బలహీనతకూ దోహదపడుతుంది.



చర్మ సౌందర్యానికి ఇవి తినాలి!

చర్మం నిగనిగలాడాలంటే తగినన్ని నీళ్లు తాగాలని పౌష్టికాహార నిపుణులు చెబుతూ ఉంటారు. నీళ్లతో పాటు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తినటం కూడా అవసరమే! ముఖ్యంగా పొడి చర్మం ఉండేవాళ్లు తినాల్సిన పదార్థాలేమిటో తెలుసుకుందాం.

చిలకడ దుంప: దీనిలో విటమిన్ ఏ, విటమిన్ సి, బీటా కెరోటిన్‌లు ఉంటాయి. విటమిన్ ఏ,సీలు చర్మానికి ఉన్న సాగే గుణాన్ని కాపాడుతాయి. బీటా కెరోటిన్ చర్మం నున్నగా ఉండేలా చేస్తుంది. అంతే కాకుండా చిలగడ దుంపలోని పిండి పదార్థం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు కూడా లభిస్తాయి.

పెరుగు: పెరుగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల చర్మం ఆరోగ్యవంతంగా కనిపిస్తుంది.

కీరా దోసకాయ: కీరా దోసకాయలో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా చేస్తాయి.

క్వినోవా: క్వినోవాలో బి విటమిన్లు బాగా ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మంపై ఏర్పడే మచ్చలను పోగడతాయి.



కాళ్ల మంటలా...

మన శరీరంలో నాడీ వ్యవస్థకు సంబంధించి అంశాలలో పాదాలు చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చినప్పుడు- వాటిని ముందుగా పట్టి చెప్పేవి మన పాదాలే! మధుమేహం ఉన్నవారిలో పాదాలలో తిమ్మిర్లు ఏర్పడుతూ ఉంటాయి. కొందరికి మంటలు కూడా ఉంటాయి. అంతే కాకుండా పాదాలకు ఏదైనా చిన్న దెబ్బ తగిలినా- అది మానటానికి చాలా సమయం పడుతుంది. అందువల్ల ఎవరికైనా పాదాలకు దెబ్బతగిలి.. అది మానటానికి ఎక్కువ సమయం పడుతోందంటే వారికి మధుమేహం ఉన్నట్లు లెక్క! అలాంటి సమయంలో తప్పకుండా మధుమేహ పరీక్షలు చేయించుకోవాలి. లేదా మధుమేహాన్ని నియంత్రణలోకి తెచ్చుకోవాలి. అంతే కాకుండా కొందరిలో కాళ్లకు రక్తప్రసారం సరిగ్గా కాదు. దీని వల్ల అనేక సమస్యలు ఏర్పడతాయి. అలాంటి వారిలో కాళ్లు నల్లబడతాయి. ఎప్పుడైనా కాళ్లలో నల్లటి మచ్చలు వచ్చాయంటే మధుమేహం ఉన్నట్లు లెక్క!

విభిన్నం

అమ్మ చేతి ముద్ద ఎంత కమ్మగా ఉంటుందో... ఈ అమ్మ నోటి నుంచి వచ్చే పంచ్‌లు అంతలా నవ్వుల విందు చేస్తాయి. భారత్‌లోనే కాదు... దేశవిదేశాల్లోని ఆహుతులనూ తన హాస్యంతో అలరిస్తున్న స్టాండప్ కమెడియన్... జర్నా గార్గ్. అమెరికాలో స్థిరపడిన ముగ్గురు పిల్లల తల్లి జర్నా... మొన్నామధ్య ఒక షో కోసం భారత్‌కు వచ్చారు. ఓ సాధారణ ఇల్లాలి నుంచి లక్షల మంది అభిమానించే స్టాండప్ కమెడియన్‌గా ఎదిగిన తన ప్రస్థానాన్ని ఈ సందర్భంగా ఆహూతులతో పంచుకున్నారు.

ఓ అమ్మ నవ్వుల విందు

“నా కామెడీ కెరీర్ గురించి మావారి అభిప్రాయం ఏంటని చాలామంది అడుగుతుంటారు. ‘నా హాస్య చతురతను ఆయన ఎంతో ఇష్టపడతారు. నా పేరు మరింతగా ప్రాచుర్యం పొంది, నా షో ఎప్పుడు టీవీలో వస్తుందా అని ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే.. చివరకు నా మీద ‘మ్యూట్ బటన్ నొక్కచ్చు’ అని వారికి చెబుతుంటాను” అంటారు జర్నా గార్గ్. ఈ జోక్ పేల్చకుండా ఆమె షో ముగియదు. ‘కానీ ఎన్నిసార్లు చెప్పినా ప్రేక్షకులు హాయిగా నవ్వేస్తారు. భార్యాభర్తలైతే... సరదాగా ఒకరికొకరు హైఫైవ్ ఇచ్చుకొంటారు’.

అమెరికాలో స్థిరపడిన జర్నా గార్గ్ ఆ మధ్య భారత్‌కు వచ్చారు. పలు నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ‘ప్రాక్టికల్ పీపుల్ విన్’ పేరిట ‘షక్రా ఎంటర్‌టైన్‌మెంట్స్’ ఈ షోలు ఏర్పాటు చేసింది.

పిల్లల సలహా...

జర్నా గార్గ్ తన ఈ ‘నవ్వుల’ ప్రయాణాన్ని ఎన్నడూ ఊహించలేదు. భారత్‌లో పుట్టిన ఆమె తరువాత అమెరికాలోని న్యూయార్క్ మహానగరంలో స్థిరపడ్డారు. మూడు దశాబ్దాలుగా అక్కడి నుంచే పర్యటనలు చేస్తున్నారు. ఇన్నేళ్లుగా తన విజయ యాత్ర కొనసాగడాన్ని అదృష్టంగా ఆమె భావిస్తారు. అసలు తాను స్టాండప్ కమెడియన్‌గా మారడమే ఇప్పటికీ తనకు నమ్మలేని నిజమంటారు. ‘ఇది నా గొప్ప కాదు. నాకు దేవుడు ఇచ్చిన వరం. కలలో కూడా స్టాండప్ కమెడియన్‌గా నా కెరీర్ ఊహించుకోలేదు’ అని చెబుతున్న జర్నాకు ఈ సలహా ఇచ్చింది ఎవరో తెలుసా..? ఆమె పిల్లలు!

‘నేను మాట్లాడేది సరదాగా ఉంటుంది. దాన్ని వీడియో తీయమని మా పిల్లలు సూచించారు. పిల్లలు చెబితే మనం పెద్దగా పట్టించుకోం కదా. పైగా అది చాలా చెత్త ఆలోచన అని మనసులో అనుకున్నా. వారు చెప్పింది విని వదిలేశా. కానీ వాళ్లు వదల్లేదు. పట్టుబట్టారు. దాంతో కాదనలేకపోయాను’ అని ఒక్కసారి రీలు వెనక్కి తిప్పారు జర్నా గార్గ్.

ఎప్పటికీ అమ్మనే...

పిల్లల సలహా కాదనలేక... జర్నా గార్గ్ 2019లో తన మొబైల్‌తోనే వీడియోలు షూట్ చేసి ‘టిక్‌టాక్’లో వదిలారు. వాటికి మంచి ఆదరణ లభించింది. అది చూసి ఆమెకే ఆశ్చర్యం వేసింది. ఇక అప్పటి నుంచి వరుసగా హాస్య గుళికలు అప్‌లోడ్ చేస్తూ వచ్చారు. క్రమంగా వ్యూస్ వేలు, లక్షలు దాటాయి. హాస్యం పండించే కంటెంట్ క్రియేటర్‌గా జర్నా గార్గ్ పేరు నెట్టింట బాగా పరిచయం అయింది. ఆమె వీడియోలు లెక్కకు మించి సామాజిక మాధ్యమాల్లో షేర్ అయ్యాయి. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన ఆమె... సెలబ్రిటీగా మారిపోయారు. ఇంట్లో కూర్చొనే చేతి నిండా సంపాదిస్తున్నారు. డిజిటల్ తెర మీదనే కాకుండా... క్రమంగా బయట వేదికలపై కూడా ప్రత్యక్షమవుతూ వచ్చారు. ఇప్పుడు... క్షణం తీరిక లేని స్టాండప్ కమెడియన్‌గా దేశవిదేశాల్లో పర్యటిస్తూ... హాస్య ప్రియులను విశేషంగా అలరిస్తున్నారు. కెరీర్ పరంగా ఎంత ఎదిగినా... ఎంత బిజీగా ఉన్నా... తల్లిగా తన పాత్ర ఎప్పటికీ మారదంటారు ఆమె. ‘ఏ స్థాయికి వెళ్లినా నేను నేనే. అప్పటికీ ఇప్పటికీ బాధ్యతగల అమ్మను’ అంటారు జర్నా. ‘భారతీయ వలస తల్లి’గా విదేశాల్లో జర్నా పేరు బాగా పాపులర్.

అనుభవాల నుంచి...

ఒక తల్లిగా, ఇల్లాలిగా జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లకు హాస్యాన్ని జోడించి సున్నితంగా చెప్పడంలో జర్నా దిట్ట. మన ఇంట్లో జరిగే ఘటనలు, మన చుట్టూ ఉండే మనుషులు, వారి జీవన శైలి, ఎదురయ్యే అనుభవాలు... ఇవే ఆమెకు కంటెంట్. ఎవరినీ నొప్పించకుండా, సరదాగా కాసేపు నవ్వించడానికి ఆమె చేసే ప్రయత్నం లక్షల మంది మనసు దోచుకుంది. ‘నేను భారత్ నుంచి వలస వచ్చిన ఒక తల్లిని. ఒక అమ్మగా ప్రపంచంలో ఒక తల్లికి, పిల్లలకు సంబంధించిన కథలు నేను వినిపిస్తాను. అవి అందరికీ నచ్చుతాయి. అలా ఇతర దేశాలవారిని కూడా మెప్పించగలుగుతున్నందుకు సంతోషంగానే కాదు... గర్వంగానూ అనిపిస్తుంది’ అంటున్న జర్నా జోక్‌ల్లో అధిక శాతం కుటుంబంలో జరిగే నిత్య ఘట్టాలే ఉంటాయి.





అంతా సరదాగా..

‘మా ఇంట్లో అందరం చాలా సరదాగా ఉంటాం. అనవసర విషయాల గురించి ఆలోచించి బాధపడుతూ కూర్చోవడం అలవాటు లేదు. నా మాటలైతే ఎప్పుడూ హాస్యం జోడించే సాగుతుంటాయి. ఇప్పుడే కాదు... స్టాండప్ కమెడియన్‌గా మారక ముందు కూడా నేను ఇంతే. అందుకే నా కెరీర్, బయట నా షోస్ మా పిల్లలకు, మావారికి కొత్తగా అనిపించవు. మా అమ్మాయి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. మా అబ్బాయిలు వారికి నచ్చింది చేసుకుపోతున్నారు. మా నిజజీవిత క్షణాలను లెన్స్‌లో బంధిస్తుంటాం. అలాగే సామాజిక మాధ్యమాల్లో నేను పోస్టు చేసే వీడియోలన్నీ రెండే నిమిషాల్లో షూట్ చేసినవి. అదీ నా సెల్‌ఫోన్‌లో. కొన్ని వీడియోల్లో అయితే సరైన లైటింగ్ కూడా ఉండదు’ అంటారు జర్నా.

అరిచినా పట్టించుకోరు...

‘నేను ఇంట్లో సరదాగా ఉంటానని చెప్పాను కదా. కానీ అందులో కొంతే నిజం ఉంది. హోమ్‌వర్క్ చేయనప్పుడు, వండింది తిననప్పుడు... ఇలా తరచూ మా పిల్లలపై గట్టిగా కేకలు వేస్తూనే ఉంటాను. మా పిల్లల్ని డాక్టర్లను చేయాలనుకున్నా. ఆ విషయమే అరిచి చెప్పే ప్రయత్నం చేశా. వాళ్ల స్నేహితుల్ని కూడా కేకలు వేస్తుంటాను. కానీ వారెవరూ నన్ను సీరియస్‌గా తీసుకోరు. అదంతా సరదా అనుకొంటారు. ఇక నేను మాత్రం ఎంతని అరవగలను?’ అని తన కథ చెప్పే క్రమంలోనూ దానికి కాస్తంత హాస్యం జోడిస్తారు జర్నా. అలాగే అత్తా... కోడళ్ల కంటెంట్‌కు ఎప్పటికీ క్రేజ్ తగ్గదంటారు ఆమె. తన దగ్గర వారికి సంబంధించి పది పదిహేనేళ్లకు సరిపడా సరదా కథలు ఉన్నాయంటూ నవ్వేస్తారు జర్నా.

స్టాండప్ కమెడియన్‌గా జర్నా ప్రతిష్ఠాత్మక అవార్డులు కూడా గెలుచుకున్నారు. ‘కెవిన్ హార్ట్స్ లిఫ్ట్ కామిక్స్’తో పాటు 2021లో ‘లేడీస్ ఆఫ్ లాఫ్టర్ అవార్డ్’ అందుకున్నారు. హిల్లరీ క్లింటన్ తదితర మహామ హులతో కలిసి వేదిక పంచుకున్నారు. గత ఏడాది వెరైటీ మ్యాగజైన్ ప్రకటించిన ‘టాప్ 10 కామిక్స్’లో చోటు దక్కించుకున్నారు. జర్నా జర్నీలో ఇలాంటి మైలురాళ్లు ఎన్నో ఉన్నాయి.

కోల్‌కతా కేక

ఫైనల్లో నైట్‌రైడర్స్

రాణించిన శ్రేయాస్, వెంకటేశ్
చిత్తుగా ఓడిన సన్‌రైజర్స్
విజృంభించిన పేసర్ స్టార్క్


శ్రేయాస్ అయ్యర్ (24 బంతుల్లో 58 నాటౌట్)

అహ్మదాబాద్: లీగ్ దశలో నెంబర్‌వన్ ఆటతీరుతో అదరగొట్టిన కోల్‌కతా నైట్‌రైడర్స్ క్వాలిఫయర్-1లోనూ అదే జోరును ప్రదర్శించింది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌తో వహ్వా.. అనిపించుకుంటూ సునాయాసంగా ఐపీఎల్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, ఇప్పటిదాకా భారీస్కోర్లతో బెంబేలెత్తించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక మ్యాచ్‌లో చేతులెత్తేసింది. అత్యంత ఖరీదైన బౌలర్ మిచెల్ స్టార్క్ (3/34) ఆదిలోనే వెన్నువిరవడంతో రైజర్స్ కోలుకోలేకపోయింది. స్వల్ప ఛేదనను కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 58 నాటౌట్), వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 51 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో ముగించారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఓడిన రైజర్స్ శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో ఆడి మరోసారి ఫైనల్ కోసం ప్రయత్నించనుంది. ముందుగా సన్‌రైజర్స్ 19.3 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ త్రిపాఠి (35 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 55), క్లాసెన్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), కమిన్స్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) రాణించారు. స్టార్క్‌కు 3, వరుణ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా 13.4 ఓవర్లలోనే 2 వికెట్లకు 164 రన్స్ చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా స్టార్క్ నిలిచాడు.

శ్రేయాస్, వెంకటేశ్ హాఫ్ సెంచరీలు: స్వల్ప ఛేదనను కోల్‌కతా అలవోకగా ముగించింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (23), నరైన్ (21) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా.. మిగతా ఛేదనను శ్రేయాస్, వెంకటేశ్ ముగించారు. లక్ష్యం తక్కువగానే ఉండడంతో రైజర్స్ బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. ఫిల్ సాల్ట్ స్థానాన్ని భర్తీ చేస్తూ గుర్బాజ్ వేగంగా ఆడాడు. రెండో ఓవర్‌లోనే నరైన్ రెండు ఫోర్లు, గుర్బాజ్ సిక్సర్‌తో కమిన్స్ 20 పరుగులు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత భువీ ఓవర్‌లో గుర్బాజ్ 6,4తో 18 రన్స్ అందించాడు. నాలుగో ఓవర్‌లో అతడిని నటరాజన్ అవుట్ చేసినా అప్పటికే స్కోరు 44 పరుగులకు చేరింది. ఇక వచ్చీ రాగానే వెంకటేశ్ బ్యాట్‌కు పనిచెబుతూ వరుస ఫోర్లు సాధించాడు. దీంతో పవర్‌ప్లేలో స్కోరు 63/1కి చేరింది. ఆ తర్వాత నరైన్‌ను కమిన్స్ అవుట్ చేసినా.. శ్రేయాస్ రాకతో కేకేఆర్ మరో వికెట్ కోల్పోకుండా ఆడింది. ఇద్దరూ స్వేచ్ఛగా ఆడేయడంతో 10వ ఓవర్‌లోనే స్కోరు 100 దాటింది. వెంకటేశ్ ఓ సిక్సర్‌తో 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఇక 13వ ఓవర్‌లో శ్రేయాస్ చెలరేగి వరుసగా 6,4,6,6తో 22 పరుగులు రాబట్టడమే కాకుండా 24 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేస్తూ మ్యాచ్‌ను ముగించాడు. ఈ జోడీ అజేయంగా మూడో వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది.


మిచెల్ స్టార్క్ (3/34)


వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 51 నాటౌట్)

ఆదుకున్న త్రిపాఠి-క్లాసెన్: సహజంగా సన్‌రైజర్స్ ముందుగా బ్యాటింగ్‌కు దిగితే బౌలర్లు చేష్టలుడిగిపోవాల్సిందే. కానీ ఈసారి వారి ఆటతీరు అంచనాలకు భిన్నంగా సాగింది. ఆది నుంచే పరుగుల వరద పారించే అలవాటున్న ఈ జట్టును కోల్‌కతా బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. పవర్‌ప్లేలోనే జట్టు కీలక నాలుగు వికెట్లు కోల్పోయింది. వన్‌డౌన్ బ్యాటర్ రాహుల్ త్రిపాఠి, క్లాసెన్ మాత్రమే ప్రభావం చూపారు. చివర్లో కమిన్స్ బ్యాట్ ఝుళిపించడంతో కాస్త పరువు కాపాడుకుంది. మిగతా బ్యాటర్లు మూకుమ్మడిగా విఫలమయ్యారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (0) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ డకౌటయ్యాడు. తొలి ఓవర్ రెండో బంతికే స్టార్క్ అతడిని క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (3)ను రెండో ఓవర్‌లో వైభవ్ అవుట్ చేశాడు. మూడో ఓవర్‌లోనే త్రిపాఠి కూడా ఎల్బీ కావాల్సి ఉన్నా కేకేఆర్ రివ్యూకు వెళ్లకపోవడంతో బతికిపోయాడు. మరోవైపు నితీశ్ (9), షాబాజ్ (0)లను వరుస బంతుల్లో స్టార్క్ పెవిలియన్ చేర్చడంతో 39/4 స్కోరుతో రైజర్స్ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఈ దశలో త్రిపాఠి, క్లాసెన్ అడపాదడపా బౌండరీలతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. తొమ్మిదో ఓవర్‌లో త్రిపాఠి 4, క్లాసెన్ 6,4తో 18 పరుగులు వచ్చాయి. అటు త్రిపాఠి ఓ ఫోర్‌తో 29 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ 11వ ఓవర్‌లో క్లాసెన్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత జట్టు ఒక్కసారిగా తడబడింది. 14వ ఓవర్‌లో సమద్ (16)తో సమన్వయలోపంతో త్రిపాఠి రనౌటవడం భారీస్కోరుపై ప్రభావం చూపింది. ఆ వెంటనే ఇంపాక్ట్ ప్లేయర్ సన్వీర్‌ను నరైన్ డకౌట్ చేశాడు. మిగతా వికెట్లు కూడా టపటపా పడడంతో 16 ఓవర్లలో జట్టు స్కోరు 126/9. ఈ స్థితిలో కెప్టెన్ కమిన్స్ ఎడాపెడా బౌండరీలతో బ్యాట్ ఝుళిపించాడు. స్టార్క్ ఓవర్‌లో వరుసగా 6,4తో ఆకట్టుకున్నాడు. అలాగే ఆఖరి వికెట్‌కు 33 పరుగులు జోడించి జట్టు స్కోరును 150 దాటించాడు. ఆఖరి ఓవర్‌లో కమిన్స్ వికెట్‌తో రస్సెల్ వీరి ఇన్నింగ్స్‌కు తెర దించాడు.

1 ప్లేఆఫ్స్‌లో ఎక్కువ (2) 50+ స్కోర్లు సాధించిన కెప్టెన్‌గా శ్రేయాస్. ఈ క్రమంలో ధోనీ, రోహిత్, వార్నర్‌తో సమంగా నిలిచాడు.

4 ఐపీఎల్ ఫైనల్ చేరడం కోల్‌కతాకు ఇది నాలుగో సారి. గతంలో 2012, 2014, 2021లో తుదిపోరులో నిలిచింది. చెన్నై (10), ముంబై (6) తర్వాత ఎక్కువసార్లు ఫైనల్‌కు వచ్చిన జట్టిదే.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) స్టార్క్ 0, అభిషేక్ (సి) రస్సెల్ (బి) అరోరా 3, త్రిపాఠి (రనౌట్) 55, నితీశ్ (సి) గుర్బాజ్ (బి) స్టార్క్ 9, షాబాజ్ (బి) స్టార్క్ 0, క్లాసెన్ (సి) రింకూ (బి) వరుణ్ 32, సమద్ (సి) శ్రేయాస్ (బి) హర్షిత్ 16, సన్వీర్ (బి) నరైన్ 0, కమిన్స్ (సి) గుర్బాజ్ (బి) రస్సెల్ 30, భువనేశ్వర్ (ఎల్బీ) వరుణ్ 0, విజయకాంత్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.3 ఓవర్లలో 159 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-13, 3-39, 4-39, 5-101, 6-121, 7-121, 8-125, 9-126, 10-159; **బౌలింగ్:** స్టార్క్ 4-0-34-3, వైభవ్ 2-0-17-1, హర్షిత్ రాణా 4-0-27-1, నరైన్ 4-0-40-1, రస్సెల్ 1.3-0-15-1, వరుణ్ 4-0-26-2.

కోల్‌కతా: గుర్బాజ్ (సి) విజయకాంత్ (బి) నటరాజన్ 23, నరైన్ (సి) విజయకాంత్ (బి) కమిన్స్ 21, వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 51, శ్రేయాస్ (నాటౌట్) 58, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 13.4 ఓవర్లలో 164/2; వికెట్ల పతనం:** 1-44, 2-67; **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-28-0, కమిన్స్ 3-0-38-1, నటరాజన్ 3-0-22-1, విజయకాంత్ 2-0-22-0, హెడ్ 1.4-0-32-0, నితీశ్ 1-0-13-0.

నిలిచేదెవరు.. నిష్క్రమించేదెవరు?



ఎలిమినేటర్ పోరు నేడే

● జోరుమీదున్న బెంగళూరు
● ఒత్తిడిలో రాజస్థాన్

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

అహ్మదాబాద్: నిష్క్రమించే దశ నుంచి సంచలన ప్రదర్శనతో నాకౌట్ చేరింది ఒకరైతే.. ఆరంభంలో అదరగొట్టి ఆఖర్లో డీలాపడిన వాళ్లు మరొకరు. ఐపీఎల్‌లో భిన్న ప్రదర్శనలతో ప్లేఆఫ్స్‌కు చేరుకొన్న రాజస్థాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు.. బుధవారం జరిగే ఎలిమినేటర్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్ బెర్త్ కోసం క్వాలిఫయర్-2 ఆడనుండగా.. ఓడిన జట్టు నేరుగా ఇంటికి వెళ్లనుంది. వరుసగా 7 మ్యాచ్‌లు ఓడి నాకౌట్ ఆశలు దాదాపుగా ముగిసిన తరుణంలో.. బెంగళూరు అద్భుత ప్రదర్శనతో వరుసగా 6 మ్యాచ్‌లు గెలిచి ఔరా అని పించింది. డిఫెండింగ్ చాంప్ చెన్నైతో చావోరేవో మ్యాచ్‌లో సూపర్‌షోతో అలరించి ప్లేఆఫ్స్ చేరిన డుప్లెసి సేన.. ఎలిమినేటర్‌కు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. కోహ్లీ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలుస్తుండగా.. డుప్లెసి, పటీదార్, గ్రీన్, దినేశ్ రాణిస్తున్నారు. బౌలింగ్‌లో యశ్ దయాళ్ కీలకంగా మారాడు.

ఒక్కసారిగా గతితప్పి: తొలి 9 మ్యాచ్‌ల్లో 8 గెలిచి జోరుమీదున్న రాజస్థాన్.. చివర్లో గతితప్పింది. వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడిన తీరు జట్టులోని లోపాలను బహిర్గతం చేశాయి. ఆఖరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో.. మొత్తం 17 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్‌కు సిద్ధమైంది. కాగా, లీగ్ దశలో ఈ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్‌దే పైచేయి. బట్లర్ ఇంగ్లండ్ వెళ్లడంతో ఆర్ఆర్ బ్యాటింగ్‌లో దూకుడు లోపించింది. కెప్టెన్ శాంసన్, పరాగ్ ఈ సీజన్‌లో ఎక్కువగా జట్టు భారాన్ని మోయగా.. జైస్వాల్ నిలకడలేమితో ఇబ్బందులు పడుతున్నాడు. గాయపడిన హెట్‌మయర్ రాకతో లోయరార్డర్ బ్యాటింగ్ కొంత బలపడింది. బౌల్ట్, సందీప్ శర్మ, చాహల్‌లతో జట్టు బౌలింగ్ మెరుగ్గా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాజస్థాన్ బౌలింగ్‌కు.. బెంగళూరు బ్యాటింగ్‌కు మధ్య ప్రధాన పోటీ నడిచే అవకాశం ఉంది.

సుమిత్, మరియప్పన్‌కు స్వర్ణాలు

ప్రపంచ పారా అథ్లెటిక్స్



కోబ్ (జపాన్): వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో డిఫెండింగ్ చాంప్ సుమిత్ అంటిల్ టైటిల్‌ను నిలబెట్టుకోగా.. తంగవేలు మరియప్పన్, ఏక్తా భయన్ స్వర్ణాలు సాధించారు. పురుషుల ఎఫ్-64 జావెలిన్ త్రోలో సుమిత్ 69.50 మీటర్లు విసిరి పసిడి సాధించాడు. 2023 ఈవెంట్‌లో కూడా అంటిల్ స్వర్ణం నెగ్గాడు. అతడి సహచరుడు సందీప్ 60.41 మీ. విసిరి కాంస్యం దక్కించుకొన్నాడు. టి-63 హైజంప్‌లో మరియప్పన్ 1.88 మీ. దూకి విజేతగా నిలిచాడు. మహిళల ఎఫ్-51 క్లబ్ త్రోలో ఏక్తా 20.12 మీటర్లు విసిరి పసిడి పట్టేయగా.. కషిష్ లక్రా 14.56 మీ. విసిరి రజతం సాధించింది.

భారత రిలే జట్లకు రజతాలు

బ్యాంకాక్: ఆసియా రిలే అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు 4×400 మీటర్ల రిలే విభాగాల్లో రజత పతకాలు సాధించారు. మహిళల బృందం 3 నిమిషాల 33.55 సెకన్ల టైమింగ్‌తో రెండోస్థానంలో నిలిచింది. పురుషుల జట్టు 3 నిమిషాల 05.76 సెకన్లతో ద్వితీయస్థానంతో రేసు ముగించింది.

మళ్లీ వరల్డ్ నెం.1గా సాత్విక్ జోడీ



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ డబుల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో తెలుగు తేజం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జోడీ తిరిగి వరల్డ్ నెంబర్ వన్ పీఠాన్ని అధిరోహించింది. ఆల్ ఇంగ్లండ్, ఆసియా చాంపియన్‌షిప్‌లో పరాజయం తర్వాత సాత్విక్ ద్వయం అగ్రస్థానం నుంచి తృతీయ స్థానానికి పడిపోయింది. ప్రస్తుత సీజన్‌లో రెండు టైటిళ్లు నెగ్గడంతో సాత్విక్ జోడీ తిరిగి ప్రథమ స్థానానికి చేరుకుంది. సింగిల్స్‌లో సింధు 14 నుంచి 15వ ర్యాంక్‌కు పడిపోగా, ప్రణయ్ 9వ ర్యాంక్‌తో తిరిగి టాప్-10లో చోటు సంపాదించాడు. లక్ష్యసేన్ 14వ, కిడాంబి శ్రీకాంత్ 26వ, ప్రియాన్షు రజావత్ 33వ ర్యాంకుల్లో నిలిచారు. డబుల్స్‌లో తనీషా-అశ్విని పొన్నప్ప జోడీ 19వ స్థానంలో, ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జంట 29వ ర్యాంక్‌లో ఉన్నారు.

గాయత్రి జోడీ ముందంజ

కౌలాలంపూర్: గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ మలేసియా మాస్టర్స్ డబుల్స్‌లో రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ఏడో సీడ్ గాయత్రి జంట 21-14, 21-10తో హవాంగ్ యు-లియాంగ్ (చైనీస్ తైపీ) జోడీపై నెగ్గింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయర్స్‌లో సతీష్ కుమార్, ఆయూష్ షెట్టి, శంకర్ సుబ్రమణియన్ ప్రధాన పోటీలకు అర్హత సాధించలేకపోయారు.

పారిస్ కోటా రెజ్లర్లకు నో ట్రయల్స్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ బెర్తులు సాధించిన వారికి ట్రయల్స్ నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ప్రకటించింది. గాయపడే అవకాశం ఉందని కొందరు రెజ్లర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సమాఖ్య చీఫ్ సంజయ్ తెలిపాడు. వినేష్ (50 కి), అంతిమ్ పంగల్ (53 కి), అన్షు మాలిక్ (57 కి), నిషా దహియా (68 కి), రీతిక హుడా (76 కి)తోపాటు పురుషుల్లో అమన్ షెహ్రావత్ (57 కి) మాత్రమే ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

5 లక్షల కోట్ల డాలర్లు

సరికొత్త మైలురాయికి స్టాక్ మార్కెట్ వర్గాల సంపద

ముంబై: స్టాక్ మార్కెట్ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మంగళవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డు స్థాయి 5 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ ఈ మైలురాయిని చేరడం ఇదే తొలిసారి. చివర్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలతో పాటు మార్కెట్ సంపద కూడా కాస్త తగ్గి 4.97 లక్షల కోట్ల డాలర్ల (రూ.414.62 లక్షల కోట్లు)కు పరిమితమైంది. మార్కెట్ సంపద పరంగా అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాత భారత్ ఐదో స్థానంలో ఉంది. మరిన్ని విషయాలు..

- గత ఏడాది నవంబరు 29న బీఎస్ఈ మార్కెట్ క్యాప్ తొలిసారిగా 4 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని చేరింది.
- 2021 మే 24న 3 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని దాటగా.. 2017 జూలై 10న 2 లక్షల కోట్ల డాలర్లకు, 2007 మే 28న లక్ష కోట్ల డాలర్ల మార్క్‌కు చేరుకుంది.
- మార్కెట్ సంపద 2014 జూన్ 6న 1.5 లక్షల కోట్ల డాలర్లకు, 2020 డిసెంబరు 16న 2.5 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది.
- లక్ష కోట్ల డాలర్ల నుంచి 1.5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకునేందుకు 2,566 రోజులు లేదా 7 ఏళ్లకు పైగా సమయం పట్టింది. 1.5 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2 లక్షల కోట్ల డాలర్లకు పెరిగేందుకు 1,130 రోజులు పట్టింది. అంటే, లక్ష కోట్ల డాలర్ల నుంచి 2 లక్షల కోట్ల డాలర్లకు చేరుకునేందుకు 10 ఏళ్లు పట్టిందన్నమాట.
- 1,255 రోజుల్లో మార్కెట్ సంపద 2 లక్షల కోట్ల డాలర్ల నుంచి 2.5 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది.
- ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 1,713.05 పాయింట్లు (2.37 శాతం) పుంజుకుంది. ఈ ఏప్రిల్ 9న సూచీ ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి 75,124.28 వద్దకు చేరుకుంది.



మార్కెట్ సంపద పరంగా టాప్-10 కంపెనీలు

ర్యాంక్	కంపెనీ	రూ.లక్షల కోట్లు
1	రిలయన్స్ ఇండస్ట్రీస్	19.43
2	టీసీఎస్	13.83
3	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	11.08
4	ఐసీఐసీఐ బ్యాంక్	7.88
5	భారతీ ఎయిర్‌టెల్	7.62
6	ఎస్‌బీఐ	7.41
7	ఎల్ఐసీ	6.47
8	ఇన్ఫోసిస్	5.95
9	ఐటీసీ	5.43
10	హిందుస్థాన్ యూనిలీవర్	5.42

మిశ్రమంగా ముగిసిన సూచీలు

లాభ నష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. మంగళవారం ఇంట్రాడేలో 426 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. ట్రేడింగ్ నిలిచేసరికి, 52.63 పాయింట్ల నష్టంతో 73,953.31 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మాత్రం 27.05 పాయింట్ల లాభంతో 22,529.05 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 14 లాభపడగా.. మిగతా 16 నష్టపోయాయి. టాటా స్టీల్ షేరు 3.81 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సైతం 3.68 శాతం పుంజుకుంది. నెస్లే, మారుతి సుజుకీ షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా క్షీణించాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఇంట్రాడేలో సరికొత్త జీవనకాల గరిష్ఠాలను తాకినప్పటికీ, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.34 శాతం లాభంతో సరిపెట్టుకోగా.. స్మాల్‌క్యాప్ సూచీ 0.18 శాతం తగ్గింది.

ఫాలో ఆన్ పబ్లిక్ ఇష్యూకు ఐఆర్ఈడీఏ

గత ఏడాది నవంబరులోనే తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా రూ.2,150 కోట్లు సమీకరించిన ప్రభుత్వ రంగ ఎన్‌బీఎఫ్‌సీ ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఈడీఏ).. భవిష్యత్ మూలధన అవసరాల కోసం మలి విడత పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ)కు వచ్చే ఆలోచనలో ఉంది. ఎఫ్‌పీఓతో పాటు పర్‌పెక్చువల్ బాండ్లను సైతం జారీ చేయాలని కంపెనీ యోచిస్తున్నది.

ఆఫీస్ స్పేస్ ఐపీఓ ధరల శ్రేణి రూ.364-383

కో-వర్కింగ్ సేవల కంపెనీ ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓ బుధవారం ప్రారంభమై ఈ నెల 27న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.364-383గా నిర్ణయించింది. తద్వారా రూ.599 కోట్ల వరకు సమీకరించనుంది.

బిజినెస్

తొలి త్రైమాసికం వృద్ధి 7.5 శాతం

ఆర్‌బీఐ అంచనా

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మొదటి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.5 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా వేసింది. వస్తు సేవలకు డిమాండు పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆహారేతర వ్యయాల పెరుగుదల కూడా ఇందుకు దోహదపడనున్నట్టు తాజా బులెటిన్‌లో తెలిపింది. తీవ్రమైన భౌగోళిక, రాజకీయ ప్రతికూలతల మధ్యన కూడా భారత ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకోగలిగిందని పేర్కొంటూ ఏప్రిల్‌లో ఆర్థిక కార్యకలాపాల సూచీ (ఈఏఐ) పునరుజ్జీవం సాధించినట్టు తెలిపింది. అధిక సాంద్రత గల 27 కీలక సూచీల గమనాన్ని పరిగణనలోకి తీసుకుని డైనమిక్ ఫ్యాక్టర్ నమూనాలో ఈఏఐని నిర్మించారు. ఇదిలా ఉండగా 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక జీడీపీ గణాంకాలను, 2023-24 జాతీయాదాయం గణాంకాలను ప్రభుత్వం ఈ నెల 31వ తేదీన ప్రకటించనుంది. ఆర్థిక వ్యవస్థకు కీలకంగా పరిగణించే వాటిలో టోల్ వసూళ్ల సూచీ ఏప్రిల్‌లో 8.6 శాతం వృద్ధిని నమోదు చేయగా ఇదే నెలలో ఆటోమొబైల్ అమ్మకాలు 25.4 శాతం పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్నదన్న ఆశావహ దృక్పథం సర్వత్రా వెలువడుతోందని మైకేల్ దేవవ్రత పాత్రా నాయకత్వంలోని బృందం రచించిన ఆ నివేదిక వెల్లడించింది. ద్రవ్యోల్బణం విషయానికి వస్తే కూరగాయలు, తృణధాన్యాలు, పప్పులు, మాంసం, చేపల ధరలు సమీప భవిష్యత్తులో దాన్ని కాస్తంత అధికంగా 5 శాతానికి చేరువలో నిలుపుతాయని పేర్కొన్నారు.

సీయూబీ @రూ.లక్ష కోట్లు

చెన్నై: ప్రైవేట్ రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ (సీయూబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెండు కీలకమైన మైలురాళ్లను అధిగమించింది. ఏడాదిలో రూ.లక్ష కోట వ్యాపారాన్ని దాటడం ఒకటైతే రూ.1,000 కోట్ల నికర లాభం మైలురాయి మరొకటి. బ్యాంక్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎన్.కామకోడి ఈ విషయం వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఆదాయం 6 శాతం పెరిగి రూ.1,02,138 కోట్లకు చేరగా నికరలాభం కూడా 6 శాతం వృద్ధితో రూ.1,016 కోట్లుగా నమోదైందన్నారు. మార్చి 31 నాటికి మొత్తం డిపాజిట్లు రూ.55,567 కోట్లుగాను, రుణాలు రూ.46,418 కోట్లుగాను ఉన్నాయి. నాలుగో త్రైమాసికంలో ఆస్తులపై రాబడి 1.48 శాతంగా ఉన్నదని ఆయన చెప్పారు. అలాగే పారుబాకీలకు కేటాయింపులు కూడా గణనీయంగా తగ్గాయని, కొవిడ్ ముందు నాటి స్థాయికి తగ్గించుకునే దిశగా ముందుకు సాగుతున్నామని కామకోడి తెలిపారు. బీమా విభాగంలో మంచి వృద్ధిని తాము ఆశిస్తున్నట్టు ఆయన వెల్లడించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,510 ▼	68,300 ▼	99,000 ▼
ముంబై	74,214 ▲	67,980 ▲	92,873 ▲

హైదరాబాద్‌లో ఎంఫసిస్ జీసీసీ

హైదరాబాద్‌లో మరో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటైంది. ప్రముఖ ఐటీ కంపెనీ ఎంఫసిస్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ ఇన్‌ఫోనిక్స్ ఇన్నోసిటీ పేరుతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఎంఫసిస్ ఈ జీసీసీ ద్వారా తన అంతర్జాతీయ ఖాతాదారులకు కృత్రిమ మేధ (ఏఐ), జెన్-ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో సేవలు అందిస్తుంది. కంప్యూటింగ్, ఏఐ ఆధారిత రంగాలకు ఈ జీసీసీ ఇన్నోవేటివ్ హబ్‌లా పనిచేస్తుందని ఎంఫసిస్ తెలిపింది.

ఓఎన్‌జీసీ లాభం 19 రెట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో నికర లాభంలో 19 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2022-23 సంవత్సరంతో పోల్చితే కంపెనీ స్టాండ్ఎలోన్ నికర లాభం రూ.528 కోట్ల నుంచి రూ.9,869 కోట్లకు పెరిగింది. 2016 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 మధ్య కాలానికి వివాదాస్పద పన్నుల డిమాండు కోసం గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.9,235 కోట్లు కేటాయించినట్టు కంపెనీ వెల్లడించింది. అయితే కంపెనీ క్యూ4 ఆదాయం 4.6 శాతం తగ్గి రూ.34,637 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.1.38 లక్షల కోట్ల ఆదాయంపై రూ.40,526 కోట్ల చారిత్రక గరిష్ఠ నికర లాభం ఆర్జించింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు 2023-24 సంవత్సరానికి 50 శాతం (రూ.5 ముఖవిలువ గల ఒక్కో షేరుపై రూ.2.50) తుది డివిడెండుకు సిఫారసు చేసింది.

అజాద్ ఇంజనీరింగ్ లాభం రూ.15 కోట్లు

హైదరాబాద్: గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో అజాద్ ఇంజనీరింగ్ రూ.92.8 కోట్ల ఆదాయంపై రూ.14.9 కోట నికర లాభాన్ని ప్రకటించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.84.9 కోట్లుగా ఉండగా లాభం రూ.14.8 కోట్లుగా ఉంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నికర లాభం ఏకంగా 589 శాతం వృద్ధితో రూ.8.5 కోట్ల నుంచి రూ.58.6 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో ఆదాయం కూడా రూ.251.7 కోట్ల నుంచి రూ.340.80 కోట్లకు పెరిగింది.

- రిలయన్స్ రిటైల్‌కు చెందిన ఫ్యాషన్ బ్రాండ్ యూస్టా.. ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి ప్రవేశించింది. ఇందులో భాగంగా గుంటూరులో కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. టాలీవుడ్ నటి శ్రీలీల ఈ స్టోర్‌ను ప్రారంభించారు. యూస్టా ప్రస్తుతం తెలంగాణ సహా మరో ఆరు రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ).. నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ నుంచి సుపీరియర్ 100 ఆక్టేన్ ప్రీమియం ఇంధనం ఎక్స్‌పీ100ను తొలిసారిగా శ్రీలంకకు ఎగుమతి చేసింది. శ్రీలంకలో కార్యకలాపాలను విస్తరించటమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం లభించిందని ఐఓసీ పేర్కొంది.

ఐపీఓ నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ: కంపెనీల పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనలను సడలించింది. ఐపీఓ పత్రాలు సమర్పించాక ఇష్యూ సైజు తగ్గింపు లేదా పెంచుకునే విషయంలో మరింత వెసులుబాటు కల్పించింది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) సైజు మారితే మళ్లీ దరఖాస్తు సమర్పించాల్సిన అవసరం రూపాయల్లో ఇష్యూ సైజు లేదా విక్రయించనున్న షేర్ల సంఖ్యలో ఒక దానిపైనే ఆధారపడి ఉంటుందని సెబీ తెలిపింది.

మరిన్ని విషయాలు: మినిమమ్ ప్రమోటర్స్ కాంట్రిబ్యూషన్ (ఎంపీసీ) తగ్గిన పక్షంలో ప్రమోటర్‌గా గుర్తింపు లేకపోయినప్పటికీ, పబ్లిక్ ఆఫరింగ్ ముగిశాక ఈక్విటీ వాటాలో 5 శాతానికి మించి వాటా కలిగి ఉండే ప్రమోటర్ గ్రూప్ కంపెనీలు, వ్యక్తిగతేతర షేర్‌హోల్డర్లు కూడా ఎంపీసీ పరిమితి లోటును భర్తీ చేసేందుకు సెబీ వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం ఎంపీసీ పరిమితి 20 శాతంగా ఉంది. సాధారణంగా ఎంటర్‌ప్రెన్యూర్లు ప్రమోట్ చేసే కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుకు ముందే ఆయా మార్గాల్లో, పలు విడతల్లో ఫండింగ్ సేకరిస్తుంటాయి. ఆ సందర్భాల్లో ప్రమోటర్ల వాటా 20 శాతం ఎంపీసీ పరిమితి కంటే తగ్గవచ్చు. అయినప్పటికీ, ఐపీఓకు వచ్చేందుకు కొత్త నిబంధన దోహదపడనుంది.


- ప్రాథమిక ముసాయిదా పత్రాలను (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించిన తేదీకి ఏడాది ముందే కంపల్సరీ కన్వర్టబుల్ సెక్యూరిటీస్‌ను మార్చుకోవడం ద్వారా లభించిన ఈక్విటీ షేర్ల వాటాను సైతం ఎంపీసీ పరిమితి అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చని సెబీ తెలిపింది.
- ఏదైనా అసాధారణ పరిస్థితులు లేదా సందర్భంలో ఐపీఓ క్లోజింగ్ తేదీని ఒక రోజే పొడిగించే వెసులుబాటు కల్పించింది సెబీ. ఇప్పటివరకు కనీసం మూడు రోజులు పొడిగించాల్సి వచ్చేది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	గోదావరి	154
వరంగల్	150	విజయవాడ	154
కరీంనగర్	150	గుంటూరు	154
మహబూబ్‌నగర్	152	ఒంగోలు	154
కర్నూలు	152	చిత్తూరు	160
విశాఖపట్నం	146		

జగన్ సర్కార్ మరో కుట్ర

- 'ఏజెంట్ల' నేర చరిత్ర తనిఖీ పేరుతో కూటమి నేతల్ని ఇబ్బంది పెట్టే యత్నం
- ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): కౌంటింగ్ ఏజెంట్ల నేర చరిత్ర తనిఖీ పేరుతో టీడీపీ కూటమి నేతల్ని ఇబ్బంది పెట్టాలని జగన్ సర్కార్ చూస్తోందని తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు నక్కా ఆనంద్‌బాబు, పర్చూరి అశోక్‌బాబు, ఏఎస్ రామకృష్ణ తదితరులు మంగళవారం అమరావతి సచివాలయంలో అదనపు సీఈవోను కలిశారు. 'కౌంటింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియకు సంబంధించి కొందరు రిటర్నింగ్ అధికారులు ఇస్తున్న సర్క్యులర్లు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నాయి. ఐదేళ్లుగా టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టిన జగన్ సర్కార్.. నేరచరిత్ర తనిఖీ పేరుతో ఇప్పుడు కౌంటింగ్ ఏజెంట్లుగా కూర్చునే టీడీపీ కూటమి నేతల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తోంది. కౌంటింగ్ ఏజెంట్ల జాబితా ముందుగా రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తే... వారి నేర చరిత్రను పరిశీలిస్తామని రాజానగరం ఆర్వో సర్క్యులర్ జారీ చేశారు. గతంలో పోలింగ్ ఏజెంట్ల విషయంలోనూ ఇలాగే కొందరు ఆర్వోలు నిబంధనను పెట్టారు. ఈ విషయాన్ని సీఈవో దృష్టికి తీసుకెళ్లగా, ఈసీ మార్గదర్శకాల్లో అలాంటిదేమీ లేదని సర్క్యులర్ జారీ చేశారు. పోలింగ్ రోజు ఉదయం జాబితా ఇచ్చినా సరిపోతుందని సీఈవో స్పష్టం చేశారు. అయినా కొందరు ఆర్వోలు కౌంటింగ్ ఏజెంట్లను ఇబ్బంది పెడుతున్నారు. ఈసీ మార్గదర్శకాల్లో ఎక్కడా లేని ఈ అంశం కౌంటింగ్ ఏజెంట్ల నియామకం లోనూ ఉత్పన్నం కాదని సీఈవో తెలిపారు' అని టీడీపీ నేతలు రాష్ట్ర అదనపు సీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

ఏసీబీ వలలో ఏసీపీ!

- ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలు.. సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు అరెస్టు
- తెలంగాణలో 11 చోట్ల.. ఏపీలోని మూడు ప్రాంతాల్లో సోదాలు



ఏసీపీ ఉమామహేశ్వరరావు ఇంట్లో దొరికిన నగదు, బంగారం, పత్రాలు

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): ఏసీబీ వలకు పెద్ద అవినీతి తిమింగలం చిక్కింది! ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో.. హైదరాబాద్ కమిషనరేట్ సీసీఎస్‌లో ఏసీపీ (టీమ్-3)గా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు ఇంటిపై ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని ఆయన ఇంటితో పాటు.. ఆయన సంబంధీకుల ఇల్లు సహా.. తెలంగాణలో 11 చోట్ల, ఆంధ్రాలో మూడు చోట్ల (విశాఖ జిల్లా పెందుర్తి సమీపంలోని పులగాలిపాలెం, అనకాపల్లి జిల్లా రేలుగుంట, చోడవరం).. కలిపి మొత్తం 14 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ప్రస్తుతం ఉమామహేశ్వరరావు సాహితీ ఇన్‌ఫ్రా ప్రీ లాంచ్ పేరుతో జరిగిన రూ.1500 కోట్ల మోసం కేసులో కీలక విచారణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయనపై విపరీతమైన అవినీతి ఆరోపణలు రావడం, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు సమాచారం అందడంతో ఏసీబీ అధికారులు దాడులు చేసినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సురేంద్ర తెలిపారు. ఇప్పటి దాకా నిర్వహించిన సోదాల్లో రూ.37.5 లక్షల నగదు.. 60 తులాల బంగారం, 17 విలువైన ఆస్తిపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయనకు ఘట్‌కేసర్‌లో 5 చోట్ల, శామీర్ పేట, కూకట్‌పల్లి, మల్కాజిగిరిలో ఒక్కొక్కచోట, వైజాగ్, చోడవరంలో ఏడు చోట్ల, అశోక్‌నగర్‌లో ఏడుచోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. శామీర్‌పేటలో ఒక విల్లా కొనుగోలు చేసినట్టు తెలిసిందని ఏసీబీ జేడీ వెల్లడించారు. ఇప్పటివరకూ స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.3.46 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్లో వాటి విలువ రూ.25 కోట్లకు పైగానే ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా.. అధికారులు స్వాధీనం చేసుకున్న ఒక డైరీలో సందీప్ అనే పేరు రాసి ఉన్నట్టు సమాచారం. అది పోలీస్ అధికారి పేరేనా అని విలేకరులు ప్రశ్నించగా.. దానిపై పూర్తి స్పష్టత లేదని, ఉమామహేశ్వరరావు సైతం దానిపై ఎలాంటి సమాధానం చెప్పలేదని ఏసీబీ జేడీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సోదాల అనంతరం ఉమామహేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

పిన్నెల్లి అరాచకం

(మొదటి పేజీ తరువాయి)



అడ్డుకోబోయిన ఏజెంటును వేలు చూపించి బెదిరిస్తున్న రామకృష్ణారెడ్డి

పరిగణించి కఠిన చర్యలకు ఆదేశించింది. ఈ నెల 13న రెంటచింతల మండలంలోని పాల్వాయి గేటులో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుండగా.. అక్కడ టీడీపీకే ఎక్కువ ఓట్లు పోలవుతున్నాయని.. తనకు ఓట్లు వేయడం లేదన్న అక్కసుతో పిన్నెల్లి బరితెగించారు. గ్రామంలోని 202వ నంబర్ పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించి.. ఈవీఎంను ఎత్తి నేలకేసికొట్టారు. అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంటుపై ఆయన, ఆయన అనుచరులు దాడిచేశారు. అలాగే మరో ఏడు పోలింగ్ కేంద్రాల్లోనూ పిన్నెల్లి ఈవీఎంలు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఆ ఏజెంట్‌పై అదేరోజు బూత్ బయటే గొడ్డలితో దాడి చేశారు. 202వ బూత్ వీడియో మంగళవారం రాత్రి వెలుగు చూసింది. దీనిపై ఈసీ తీవ్రంగా స్పందించింది. అన్ని పోలింగ్ కేంద్రాల వీడియో ఫుటేజీని పల్నాడు జిల్లా ఎన్నికల అధికారులు పోలీసులకు అప్పగించారని.. విచారణ అనంతరం పిన్నెల్లిని నిందితుడిగా చేర్చినట్లు పోలీసులు తమకు తెలియజేశారని సీఈవో కార్యాలయం వెల్లడించింది. ఈవీఎంల ధ్వంసంలో ప్రమేయం ఉన్న వారందరిపైనా కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవలసిందిగా డీజీపీకి సీఈవో సూచించారని, దీనివల్ల భవిష్యత్‌లో ఎవరూ ఇటువంటి దుశ్చర్యలకు సాహసించరని తెలిపినట్లు పేర్కొంది. అయితే సిట్ రంగంలోకి దిగాక పోలీసులు పిన్నెల్లిపై కేసు పెట్టారా.. అంతకుముందే నమోదు చేశారా అన్న విషయంలో స్పష్టత లేదు. కాగా.. నియోజకవర్గంలో పోలింగ్ రోజు, ఆ మర్నాడు జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో పిన్నెల్లి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిని 14న గృహనిర్బంధం చేశారు. కానీ అర్ధరాత్రి వారిరువురూ ఇంటి నుంచి పరారయ్యారు. వారు తప్పించుకుపోతున్నా పోలీసులు చోద్యం చూశారన్న విమర్శలున్నాయి. సదరు పోలీసులపై కూడా నేటి వరకు చర్యలు తీసుకోలేదు.

పిన్నెల్లిపై అనర్హత వేటు వేయాలి: జూలకంటి

ఎన్నికల రోజున అంతకుముందు ఆ తర్వాత అనేక రకాల అరాచకాలకు పాల్పడిన మాచర్ల వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అనర్హత వేటు వేయాలని టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. రామకృష్ణారెడ్డి ఎన్నికల్లో పాల్గొనకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని.. సిట్ అధికారులు కేసులు నమోదు చేసి ఎమ్మెల్యే సోదరులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కౌంటింగ్ రోజున కూడా వారు ఇదేవిధంగా అరాచకాలకు పాల్పడే అవకాశం ఉందని.. అందుచేత కౌంటింగ్ కేంద్రాల్లోకి రాకుండా వారిని నిరోధించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్యం ఖూనీ: లోకేశ్

సొంత బాబాయిని, ఓటేసి గెలిపించిన ప్రజలను.. చివరకు ప్రజాస్వామ్యాన్ని కూడా సీఎం జగన్ ఖూనీ చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. ఓటమి భయంతో ఈవీఎంల ధ్వంసంతో పాటు దాడులకు తెగబడిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఫ్యాక్షన్ రాజకీయాలపై జూన్ 4న ప్రజలు అసలు సిసలు తీర్పు ఇవ్వబోతున్నారని 'ఎక్స్'లో పేర్కొన్నారు.







కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం లంకమాన్యం గ్రామంలో పోలీసుల తనిఖీలు, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లిలో గడ్డి వాములో తనిఖీ చేస్తున్న పోలీసులు, శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలంలో పశువులపాక గడ్డికుప్పల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రాష్ట్రమంతా రెడ్ అలర్ట్!

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకుండా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. జిల్లాల్లో ఎక్కడికక్కడ కార్డెన్ సెర్చ్ (తనిఖీలు) చేపట్టి గట్టి చర్యలు తీసుకోవాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించారు. ఈ ఆదేశాలతో ఎస్పీలు... జిల్లాల్లో బృందాలను ఏర్పాటుచేశారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసేవరకూ ఎలాంటి సెలవుల్లేవంటూ సిబ్బందితో పోలీసు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. పోల్ డే హింస జరిగిన ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించి.. ప్రతి ఇల్లూ, ప్రతి మలుపులోనూ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి మారణాయుధాలు ఉన్నా స్వచ్ఛందంగా ఇవ్వాలని, తాము గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయంటూ ఇళ్ల వద్దకెళ్లి అడుగుతున్నారు. కౌంటింగ్ హిస్టరీ షీట్స్ ఉన్న ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తున్నారు. సంఘ విద్రోహశక్తుల కదలికలపై నిఘాపెట్టి ఏ మాత్రం అనుమానం వచ్చినా అరెస్టు చేస్తున్నారు. వారిని దూరంగా ఉండే పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారు. పోలింగ్ రోజు హింసకు పాల్పడిన వేలాది మందిని వెతికేందుకు పదుల సంఖ్యలో పోలీసు బృందాలు తిరుగుతున్నాయి. రాష్ట్రం దాటి వెళ్లినవారిని సైతం రప్పించి మరీ అదుపులోకి తీసుకొంటున్నారు.

జిల్లాలు జల్లెడ...

నిఘా వర్గాల హెచ్చరికతోపాటు పోలీసులకు అందిన సమాచారంతో మంగళవారం వేకువజాము నుంచే జిల్లాల్లో కార్డన్ సెర్చ్ మొదలైంది. సమస్యాత్మక ప్రాంతాలు, అనుమానిత వ్యక్తులు, ముఖ్యమైన కూడళ్లు, గడ్డి వాములు, పశువుల పాకలు, పండ్ల తోటలు.....ఇలా ఒకచోటంటూ లేకుండా జల్లెడ పడుతున్నారు. కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలు, బరిసెలు, పేలుడు పదార్థాలు, మద్యం నిల్వలు, రికార్డుల్లేని వాహనాలు, అనుమానితుల కదలికలు ఏదీ వదిలిపెట్టడం లేదు. ఎటువంటి పత్రాలులేని 1104వాహనాలను జప్తు చేశామని, 482లీటర్ల నాటుసారా, సుమారు 480లీటర్ల నాన్ డ్యూటీ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, గుడివాడ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తిరిగి పోలీసులు తనిఖీలు సాగించారు. నూతన వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సమస్యాత్మక గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు, పరిసరాలు, గడ్డి వాములలో మంగళవారం సోదాలు నిర్వహించారు. మారణాయుధాల కోసం అణువణువూ గాలించారు. అనకాపల్లి జిల్లాలో పోలీసులు మంగళవారం తనిఖీలు జరిపారు. ఎటువంటి పత్రాలు లేని 119 ద్విచక్ర వాహనాలను, ఐదు ఆటోలను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇళ్లిళ్లూ గాలింపు..

శ్రీకాకుళం జిల్లాలోని పలాస నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గడ్డి కుప్పలను, పాడుబడిన షెడ్లను పోలీసులు తనిఖీచేశారు. నంద్యాల జిల్లావ్యాప్తంగా పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారికి, అనుమానితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 17మోటార్‌సైకిళ్లు, ఒక ఆటో, ఒక కారు... మొత్తం 19వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేని కారణంగా సీజ్ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవనగర్ వీసీ కాలనీలో 15మోటార్‌సైకిళ్లు, ఒక ఆటోను మొత్తం 16వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండాలని, మద్యం అమ్మేవారి సమాచారం ఇవ్వాలని నంద్యాల ఎస్పీ రఘువీర్ రెడ్డి ప్రజలకు సూచించారు. ఏలూరు జిల్లాలో ప్రతి రోజూ తనిఖీలను ఏదో ఒక ప్రాంతంలో నిర్వహిస్తూనే ఉన్నారు. వైఎస్సార్ కడప జిల్లా కలసపాడు మండలం చింతలపల్లెలో నాకాబంది, పోలీసు కవాతు నిర్వహించారు. ముద్దనూరు మండలం చింతకుంట గ్రామంలో గడ్డివాములు, ఇళ్లు తనిఖీ చేశారు. కడప నగరంలో మాక్ డ్రిల్ చేశారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలో కవాతు నిర్వహించారు. గుంటూరు జిల్లాలో ఎన్నికల పోలింగ్ బందోబస్తు విధులకు వచ్చిన కేంద్ర బలగాలతో పాటు తమిళనాడు పోలీసులు కూడా ఇక్కడే మకాం వేశారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పెట్రోల్, డీజిల్ బంకులలో బాటిళ్లలో ఇంధనం పోయడాన్ని ఇప్పటికే నిషేధం విధించారు. కౌంటింగ్ ముగిసేవరకు ఎవరికీ బాణాసంచా విక్రయాలు జరపరాదంటూ యజమానులకు నోటీసులు జారీచేశారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణం గాంధీనగర్, ఇందిరానగర్, చవటపాలెం, టిడ్కో ఇళ్ల సముదాయం తదితర ప్రాంతాలను పోలీసు బలగాలు చుట్టుముట్టి విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ దాదాపు ఇల్లిల్లూ గాలించారు. ప్రకాశం జిల్లా పొన్నలూరు, టంగుటూరు పంచాయతీ, వెలిగండ్ల మండలంలోని మరపగుంట్ల, కొత్తపట్నం మండలంలోని రెడ్డిపాలెం, మద్దిపాడు, గిద్దలూరు, మార్కాపురం పట్టణంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

మూడు రోజుల్లో 301ప్రాంతాల్లో తనిఖీలు: డీజీపీ గుప్తా

రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన మూడు రోజుల్లో 301 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి 4,668మందిని గుర్తించి, పలువురిని అరెస్టు చేశామని చెప్పారు. పోలింగ్ ముందు రోజు నమోదైన కేసుల్లో 1522, పోలింగ్ రోజు నమోదైన కేసుల్లో 2790, పోలింగ్ తర్వాత నమోదైన కేసుల్లో 356మందిని గుర్తించినట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు, ఆ తర్వాత ఏదైనా హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉన్నా, అనుమానిత వ్యక్తుల కదలికలపైనా పోలీసులకు(డయల్ 100) సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నేర నియంత్రణలో పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఓట్ల లెక్కింపు తర్వాతా కేంద్ర బలగాలు

ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జూన్ 4న ముగిసినా నెలాఖరు వరకూ కేంద్ర సాయుధ బలగాలను రాష్ట్రంలోనే కొనసాగించాలని సీఈసీ ఆదేశించింది. ఇప్పటికే కేంద్ర హోంశాఖ పంపిన 25 కంపెనీల ఫోర్స్...రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఉంది. కౌంటింగ్ అనంతరం అధికారంలోకి వచ్చే పార్టీ, ఓడిన పార్టీకి చెందిన శ్రేణులు పరస్పరం దాడులు చేసుకునే అవకాశం ఉందన్న నిఘా హెచ్చరికలతో ఈ బలగాలను కొనసాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై ప్రశాంత వాతావరణం ఏర్పడిన తర్వాతే కేంద్ర సాయుధ బలగాలు రాష్ట్రం నుంచి తిరిగి వెళ్లనున్నాయి.

టీడీపీ వర్గీయులపై కొడవళ్లతో దాడి

- శింగనమలలో వైసీపీ నాయకుల దాష్టీకం



పట్నం నగేశ్ ఇంటివద్ద గొడవకు దిగుతున్న వైసీపీ నాయకులు

శింగనమల, మే 21: ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేశారన్న ఆక్రోశంతో అనంతపురం జిల్లాలో వైసీపీ వర్గీయులు దాడులకు తెగబడుతున్నారు. శింగనమల మండలం శివపురం గ్రామానికి చెందిన బోయ పెద్దన్న ఎన్నికల్లో టీడీపీ తరపున పనిచేశారు. దీంతో వైసీపీ వర్గీయులు ప్రసాద్, మురళి, శేఖర్, రాజు, వెంకటరమయ్య, భాస్కర్, క్రాంతి తదితరులు మంగళవారం సాయంత్రం మద్యంతాగి పెద్దన్న ఇంటిపై దాడి చేశారు. తప్పించుకున్న పెద్దన్న తన అన్న కొండప్ప ఇంట్లోకి దూరాడు. వెంబడించిన వైసీపీ వర్గీయులు.. కొండప్ప, ఆయన కూతురు హిమజ కుమారి, అల్లుడు మురళి, పెద్దన్న భార్య పద్మావతిపై దాడి చేశా రు. తీవ్రగాయాల పాలైన నలుగురినీ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసినందుకు వైసీపీ అసమ్మతి నాయకుడు పట్నం నగేశ్ ఇంటిపై ఆ పార్టీ నాయకులు దాడికి యత్నించారు. ఈ ఘటన అనంతపురం జిల్లా శింగనమల మండలం చిన్నజలాలపురంలో మంగళవారం జరిగింది. శింగనమల వైసీపీ టికెట్‌ను సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వర్గీయుడైన వీరాంజనేయులుకు ఆ పార్టీ కేటాయించింది. దీంతో ఎమ్మెల్యే, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డిని వ్యతిరేకించే వర్గం టీడీపీ తరపున పనిచేసింది. వీరిలో పట్నం నగేశ్ ఉండ టంతో ఆగ్రహించిన సాంబశివారెడ్డి మేనమామ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఆయన బావమరిది బాలిరెడ్డి, సొదనపల్లి సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు నగేశ్ ఇంటికెళ్లి బకాయి డబ్బులు చెల్లించాలంటూ దూషణలకు దిగడంతో పాటు దాడికి యత్నించారు. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడినుంచి జారుకున్నారు. ఈ ఘటనపై శింగనమల పోలీస్‌స్టేషన్‌లో నగేశ్ ఫిర్యాదు చేశారు. శ్రీరామిరెడ్డికి తాను బకాయి లేనని, ఇవ్వాల్సిన రూ.3.50లక్షలు గతంలోనే ఇచ్చేశానని తెలిపారు.

దాడుల నిందితులపై 'హత్యాయత్నం' కేసులు

- ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లలో సెక్షన్ 307 చేర్పు
- కుట్ర కోణం, ప్రజా ప్రాతినిధ్య చట్టం కూడా...
- కోర్టుల్లో మెమోలు దాఖలు చేసిన పోలీసులు
- కొత్తగా పల్నాడు జిల్లాలో రెండు ఎఫ్ఐఆర్‌లు
- మొత్తంగా మూడు జిల్లాల్లో 35కు చేరిన కేసులు
- 1,370 నుంచి 1,435కు పెరిగిన నిందితుల సంఖ్య
- నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాల వేట
- హింసాత్మక ఘటనల్లో నిందితుల కోసం గాలింపు
- ఎవ్వరినీ వదిలి పెట్టొద్దు...: డీజీపీ గుప్తా ఆదేశం


అమరావతి, తాడిపత్రి(ఆంధ్రజ్యోతి)/నరసరావుపేట, మే 21: ఎన్నికల పోలింగ్ అనంతరం జరిగిన విధ్వంసంపై నమోదైన కేసుల్లో పోలీసు శాఖ బలమైన ఐపీసీ సెక్షన్లు చేర్చింది. దాడులకు పాల్పడిన నిందితులపై హత్యాయత్నం(ఐపీసీ 307), కుట్ర కోణం(120బీ)తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని కూడా చేర్చారు. ఈ మేరకు దర్యాప్తు అధికారులు ఆయా జిల్లాల్లోని కోర్టుల్లో మంగళవారం మెమో దాఖలు చేశారు. పల్నాడు జిల్లా మాచర్ల, నరసరావుపేట, గురజాలల్లో 22, తిరుపతి జిల్లా చంద్రగిరి, తిరుపతిలో 4, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 7 కేసులు నమోదవగా వాటిలో స్థానిక పోలీసులు బలమైన సెక్షన్లు చేర్చలేదు. వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధుల సిఫారసుతో పోస్టింగ్‌లు తెచ్చుకున్న పోలీసు అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారని గుర్తించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) క్షేత్రస్థాయిలో పర్యటించి దాడుల తీవ్రతను, అక్కడ లభ్యమైన ఆధారాలను పరిశీలించిన తర్వాత హత్యాయత్నం సెక్షన్ల నమోదుకు సిఫారసు చేసింది. ఈ జిల్లాల్లో నమోదైన దాదాపు అన్ని హింసాత్మక ఘటనల్లోనూ కుట్రకోణాన్ని గుర్తించి 120బీ చేర్చిన సిట్ అధికారులు పల్నాడు జిల్లాలో ఈవీఎంల ధ్వంసంపై ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని కూడా చేర్చారు. ఈ జిల్లాలో ఈవీఎంలు ధ్వంసం చేసినవారిపై మంగళవారం మరో రెండు కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటి వరకూ ఎన్నికల హింసకు సంబంధించి మూడు జిల్లాల్లో నమోదైన కేసుల సంఖ్య 35కు చేరింది. నిందితుల సంఖ్య 1,370 నుంచి 1,435కు చేరగా అరెస్టులు మాత్రం 300 దాటలేదు. పోలింగ్ ముగిసిన వెంటనే తమ అనుచరులు రాష్ట్రం వదిలి వెళ్లిపోయేందుకు అభ్యర్థులు అన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తించిన సిట్.. వారు ఎక్కడెక్కడ ఉన్నారో సమాచారం సేకరించి అక్కడికి పోలీసు బృందాలను పంపింది. సుమారు 30మందికి పైగా హిస్టరీ షీట్స్ తెరవదగిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరికొందరి ఆచూకీ లభించిందని, అరెస్టులు కొనసాగిస్తామని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసుల విషయమై మంగళవారం సాయంత్రం సిట్ ఐజీ వినీత్ బ్రిజిలాల్, గుంటూరు ఐజీ ఎస్ఎస్ త్రిపాఠీ, అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి బాజ్‌పాయ్, పల్నాడు, అనంతపురం, తిరుపతి ఎస్పీలతో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎవ్వరినీ వదిలి పెట్టొద్దని, కఠినంగా వ్యవహరించాలని బాధ్యులను జైల్లో వేసేవరకూ సిట్ బృందాలు అక్కడే ఉండి స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకోవాలని డీజీపీ ఆదేశించారు.

కొనసాగుతున్న సిట్ దర్యాప్తు

పోలింగ్ రోజు, ఆ తర్వాత హింసతో అట్టుడికిన అనంత, పల్నాడు జిల్లాల్లో సిట్ బృందాల దర్యాప్తు కొనసాగుతోంది. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి సిట్ బృందం మరోసారి వచ్చింది. సిట్ సభ్యులు శ్రీనివాసులు, భూషణం, శ్రీనివాస్.. తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దాడులకు సంబంధించిన వీడియోలు, రికార్డులను పరిశీలించారు. అల్లర్లకు ప్రధాన కారణంగా గుర్తించిన రాళ్లదాడిని ఎందుకు నియంత్రించలేకపోయారని స్థానిక పోలీసులను సిట్ ప్రశ్నించినట్లు తెలిసింది. గొడవలు జరిగే ప్రమాదం ఉందని ఎస్‌బీ అధికారులు ముందే గుర్తించి సమాచారం ఇచ్చారా? లేదా? సమాచారం ఇచ్చినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా? అనే కోణాల్లో సిట్ దర్యాప్తు చేస్తోందని సమాచారం. తాడిపత్రి గొడవల నేపథ్యంలో ఇప్పటికే ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ సస్పెండ్ అయ్యారు. సిట్ దర్యాప్తు తరువాత తమ పరిస్థితి ఏమిటోనని పోలీసులు ఆందోళన చెందుతున్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకూ సిట్ బృందం తాడిపత్రిలోనే తిష్ఠ వేస్తుందని ప్రచారం సాగుతోంది. దీంతో స్థానిక పోలీసులకు కంటి మీద కునుకు కరువైంది. కాగా, పల్నాడు జిల్లాలో చెలరేగిన హింసాత్మక ఘటనలపై జిల్లాలో సిట్ విచారణ కొనసాగుతోంది. మంగళవారం నరసరావుపేట రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో సిట్ అధికారి సౌమ్యలత కేసులకు సంబంధించి పలువురిని ప్రశ్నించినట్టు తెలిసింది. హింసాత్మక ఘటనలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. మాచర్ల ఘటనలకు సంబంధించి సుమారు 30మ ందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు పోలీసులు తెలిపారు. నరసరావుపేట, పమిడిపాడు ఘటనలకు సంబంధించి 11మందిని అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ నేత లాం కోటేశ్వరరావు, బీజేపీ నాయకుడు రామకృష్ణతోపాటు 11మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది. వీరందరినీ కోర్టులో హాజరు పరచనున్నట్టు పోలీసులు తెలిపారు.

బెంగళూరు రేవ్‌పార్టీలో తెలుగు నటి

- పార్టీలో పాల్గొన్నవారు 101 మంది
- వారిలో ప్రజా ప్రతినిధులు లేరు
- ప్రకటించిన నగర పోలీస్ కమిషనర్




కమిషనర్ దయానంద్

బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రేవ్ పార్టీలో తెలుగు సినీ నటి ఉన్నట్టు నగర పోలీసు కమిషనర్ దయానంద్ ప్రకటించారు. కమిషనరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవ్ పార్టీలో 101మంది పాల్గొన్నారని వెల్లడించారు. ఈ పార్టీలో ప్రజా ప్రతినిధులు ఎవరూ లేరని, ఓ తెలుగు నటి ఉన్నారని, ఆమె రక్త నమూనాలను సేకరించామని తెలిపారు. సీసీబీ బృందాలు దాడిచేసిన సమయంలో పలువురు డ్రగ్స్‌ను స్విమ్మింగ్‌పూల్, నీటి కుంటలతో పాటు బయట పడేశారని తెలిపారు. డాగ్ స్క్వాడ్స్ వాటిని గుర్తించాయన్నారు. రేవ్ పార్టీ చేసుకునేందుకు బెంగళూరు సురక్షితమని తెలుగు రాష్ట్రాలవారు వచ్చారా అని మీడియా ప్రశ్నించగా.. తాము దాడిచేసి గుర్తించామనేది ముఖ్యమన్నారు. తాను హైదరాబాద్‌లోని ఓ ఫాం హౌస్‌లో ఉన్నట్లు తెలుగు సినీనటి విడుదల చేసిన వీడియోపై ఆయన స్పందించారు. రేవ్ పార్టీలో ఆమె పాల్గొన్నారని, డ్రగ్స్ తీసుకున్నారా, లేదా అనేది నిర్ధారణ కాలేదన్నారు. పార్టీలో పాల్గొన్న 101మంది రక్త నమూనాలను సేకరించామని, త్వరలోనే నివేదికలు వస్తాయని తెలిపారు. రేవ్ పార్టీకి సంబంధించి వి రణధీర్(43), మహమ్మద్ అబూబక్కర్ సిద్ధిక్(29), ఎల్ వాసు(35), వైఎం అరుణ్‌కుమార్(35), నాగబాబు (32)ను అరెస్టు చేశామని కమిషనర్ తెలిపారు.

పార్టీ వెనుక కాకాణి మాఫియా: సోమిరెడ్డి

నెల్లూరు, మే 21(ఆంధ్రజ్యోతి): 'బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీ వెనుక మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాఫియా హస్తంఉంది. 2014 ఎన్నికల సమయంలో నమోదైన నకిలీ మద్యంకేసులో కాకాణి సహ ముద్దాయిలు నలుగురూ బెంగళూరుకు చెందినవారు. వారంతా డ్రగ్స్ ముఠాకు చెందిన వారే' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నెల్లూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరుతో ఉన్న స్టిక్కర్, కారుతో పాటు ఆయన పాస్‌పోర్టు, కొకైన్ దొరికాయి. రేవ్ పార్టీ జరిగిన ఫాం హౌస్ యజమాని గోపాల్‌రెడ్డితో కాకాణికి మంచి సంబంధాలున్నాయి. నేరం చేసిన ప్రతిసారీ బుకాయించడం కాకాణికి అలవాటే. నకిలీ మద్యం కేసు, నకిలీ డాక్యుమెంట్ల కేసు, అక్రమ క్వార్ట్జ్ రవాణా నేరాలను తాను చేసినట్లు ఆయన ఏనాడైనా ఒప్పుకున్నారా? నొటోరియస్ మాఫియాతో కాకాణికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ రేవ్ పార్టీలో ఏపీతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, గోవాలకు చెందిన అంతర్రాష్ట్ర ముఠాల హస్తం ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ జరపాలి. జూన్ 4 తర్వాత కేంద్రంలో మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం రాబోతోంది. ఏపీలోనూ ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. కాకాణి అక్రమాలను రెండు ప్రభుత్వాల ముందుంచుతా. ఆయన నడిపిన ల్యాండ్, మైనింగ్, లిక్కర్, ఫేక్ డాక్యుమెంట్ల మాఫియా... ఇప్పుడు డ్రగ్స్ మాఫియా... అన్నింటిపైనా విచారణ జరిపిస్తాం' అని సోమిరెడ్డి ప్రకటించారు.

మూలాలు విజయవాడలో..



లంకపల్లి వాసు

ప్రధాన నిందితుడు వాసు క్రికెట్ బుకీ.. బెజవాడలో అతిపెద్ద బుకీల నెట్‌వర్క్

విజయవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రేవ్ పార్టీ వ్యవహారం అటు తెలుగు సినీ పరిశ్రమతోపాటు తెలుగు రాష్ట్రాలనూ కుదిపేస్తోంది. తాజాగా ఇందులో విజయవాడ మూలాలు వెలుగులోకి వచ్చాయి. రేవ్ పార్టీకి సూత్రధారి అయిన వాసు అలియాస్ లంకపల్లి వాసు విజయవాడ వాసి. కొత్తపేటలోని ఆంజనేయవాగుకు చెందిన వాసు.. హైదరాబాద్, బెంగళూరు నుంచి క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తుంటాడు. విజయవాడలోనూ అతిపెద్ద బుకీల నెట్‌వర్క్‌ను విస్తరించాడు. వాసు ఆదాయానికి బెట్టింగ్‌లే ప్రధాన కారణమైనప్పటికీ పైకిమాత్రం వ్యాపారం, ఫార్మా రంగాల పేర్లను ఉపయోగించుకుంటున్నాడు. పుట్టినరోజు సందర్భంగా వాసు స్వయంగా బెంగళూరులోని ఫాంహౌస్‌లో పార్టీ ఏర్పాటు చేయగా.. విజయవాడకు చెందిన నలుగురు ప్రధాన బుకీలు మిగిలిన ఏర్పాట్లు చేసినట్టు తెలుస్తోంది. కొంతకాలంగా హైదరాబాద్‌లోనే మకాం వేసిన వాసు అక్కడినుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆయన పోలీసులకు చిక్కకుండా తిరగడం వెనుక అనేక కారణాలున్నాయని తెలుస్తోంది. డీజీపీ కార్యాలయంలో కొంతమంది అధికారుల పేర్లను వాసు బాగా ఉపయోగించుకున్నట్టు తెలిసింది. ఆయన అనుచరులు విజయవాడలోని కొంతమంది పోలీసులతో సంబంధాలు కొనసాగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. బెంగళూరులో పోలీసులకు చిక్కిన వాళ్లంతా తమ స్వస్థలం హైదరాబాద్ అని చెప్పారు. విజయవాడకు చెందిన వాళ్లు కూడా అదేపేరును వాడుకున్నారు. ఇప్పటివరకు బెట్టింగ్‌లోనే వాసు హస్తం ఉందని తేలగా, తాజాగా డ్రగ్స్ వ్యవహారంలోనూ ఆయన లీలలు వెలుగులోకి వచ్చాయి. రేవ్ పార్టీ కేసును బెంగళూరు పోలీసులు, డ్రగ్స్ కేసును నార్కోటిక్ విభాగ పోలీసులు నమోదు చేశారు. ఈ రెండింటిలోను వాసు ప్రధాన నిందితుడు. అతనికి సహకరించే బుకీలు ఒక్కొక్కరూ పది ఫోన్ నంబర్లు వాడుతున్నట్టు తెలిసింది. బెట్టింగ్‌ల మీద సంపాదించిన డబ్బుతో విజయవాడలోని గాంధీనగర్‌లో వాసు తన స్నేహితుడితో కలిసి రూ.6కోట్లతో ఒక స్థలంతో పాటు కొత్తపేటలో ఓ కార్పొరేటర్ ఇంటిని కూడా కొనుగోలు చేశాడు. కొన్నాళ్ల క్రితం ఒక పోలీసు ఉన్నతాధికారి కుటుంబంలో వచ్చిన వివాదంలో వాసుకు సంబంధించిన బుకీ సాక్ష్యం చెప్పినట్టు తెలిసింది. బెంగళూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లలో పోలీసుల నంబర్లు ఉన్నాయని తేలింది. విజయవాడకు చెందిన కొంతమంది బుకీలతో కలిసి వాసు బెంగళూరులో హైటెక్ పబ్‌ను ఏర్పాటు చేశాడని, ఇందులో ఆంజనేయవాగుకు చెందిన వారి భాగస్వామ్యం ఉందని తెలిసింది.

'క్యాట్' ఉత్తర్వులు కొట్టేయండి!

- సస్పెన్షన్‌కు కారణాలు ఉన్నాయి
- వీటిని క్యాట్ గుర్తించలేక పోయింది
- ఐపీఎస్ ఏబీవీపై సర్కారు పిటిషన్
- రేపు హైకోర్టు ధర్మాసనం విచారణ



అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ)ను రెండోసారి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ఆయనను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్) ఈ నెల 8న ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ట్రిబ్యునల్ ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా ఉన్నాయని వ్యాజ్యంలో పేర్కొన్నారు. సస్పెన్షన్‌కు తగిన కారణాలు ఉన్నాయని, వీటిని గుర్తించడంలో ట్రిబ్యునల్ విఫలమైందని పేర్కొన్నారు. వెంకటేశ్వరరావుపై నమోదు చేసిన కేసులో ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశామని తెలిపారు. ఈ దశలో ఆయనను తిరిగి సర్వీసులోకి తీసుకుంటే ట్రయల్ కోర్టులో విచారణపై ప్రభావం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. సీఎస్ తరఫున సాధారణ పరిపాలనశాఖ డిప్యూటీ సెక్రెటరీ జయరామ్ అఫిడవిట్ వేశారు. ఈ వాజ్యాన్ని వేసవి సెలవుల ప్రత్యేక ధర్మాసనం ఈ నెల 23న విచారించనుంది.

రేపటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- 24 నుంచి ఫీజుల చెల్లింపు

అమరావతి, మే 21 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభమవుతుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సీహెచ్ నాగరాణి ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ పరీక్షకు 142035 మంది హాజరుకాగా వారిలో 124430 మంది అర్హత సాధించారని తెలిపారు. 24 నుంచి జూన్ 2 వరకు పదిరోజుల పాటు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఫీజులు చెల్లించేందుకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. 27 నుంచి జూన్ 3 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 31 నుంచి జూన్ 5 వరకు ఆప్షన్ల ఎంపిక, జూన్ 7న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు 10 నుంచి 14 తేదీలోగా ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. 10 నుంచే తరగతులు మొదలవుతాయని తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 5లక్షల మంది

- 24 నుంచి పరీక్షలు

అమరావతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలకు 5,03,459 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఇంటర్ విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. వారిలో జనరల్ విద్యార్థులు ఫస్టియర్‌లో 346393 మంది, సెకండియర్‌లో 121545 మంది, ఒకేషనల్ కోర్సుల్లో ఫస్టియర్‌లో 19479 మంది, సెకండియర్‌లో 16042 మంది విద్యార్థులున్నారు. 24 నుంచి జూన్ 1 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని, ఇందుకోసం 861 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని మండలి తెలిపింది. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

కొత్తగా రూ.2వేల కోట్ల అప్పు

- 50 రోజుల్లోనే రూ.19వేల కోట్ల రుణం

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారు కొత్తగా మరో రూ.2,000 కోట్ల అప్పులు తెచ్చింది. మంగళవారం ఆర్బీఐ నిర్వహించిన వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు విక్రయించి ఈ రుణం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు వాడుకునేందుకు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.47,000 కోట్ల అప్పులకు అనుమతి ఇచ్చింది. అయితే మొదటి 50రోజుల్లోనే జగన్ ప్రభుత్వం ఆర్బీఐ నుంచే రూ.19వేల కోట్ల చేబదులు తెచ్చింది. కేంద్రం మొదటి 6నెలలకు ఇచ్చిన అప్పుల పరిమితిలో ఇంకా రూ.28వేల కోట్లు మిగిలి ఉంది.

2 కోట్ల గంజాయి సీజ్



రవి, చంద్రల నివాసంలో గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న కర్ణాటక పోలీసులు

- కర్నూలు జిల్లాలో పట్టుకొన్న కర్ణాటక పోలీసులు
- ఆదోని మండలం సంతెకూడ్లూరుకు చెందిన అన్నదమ్ములు అరెస్ట్
- గుట్టుచప్పుడు కాకుండా మిరపతోటలో సాగు

ఆదోని, మే 21:మిరపతోటలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేసి.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విక్రయిస్తున్న అన్నదమ్ముల గుట్టును కర్ణాటక పోలీసులు రట్టు చేశారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం సంతెకూడ్లూరు గ్రామంలో మంగళవారం రూ.2 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని బళ్లారి నగరంలో గంజాయి విక్రయాలు జరుగుతుండటంతో అక్కడి పోలీసులు నిఘా ఉంచారు. గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులను తమదైన శైలిలో విచారించగా, కర్నూలు జిల్లా ఆదోని మండలం సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు రవి, చంద్ర ద్వారా తాము గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో కర్ణాటక పోలీసులు మంగళవారం సంతెకూడ్లూరుకు వచ్చి రవి, చంద్రల ఇంటిని సోదా చేయగా 50 కిలోల గంజాయి బస్తాలు కనిపించాయి. వాటి విలువ రూ.2 కోట్లుగా పోలీసులు తెలిపారు. రవి, చంద్రలను అరెస్టు చేశారు. రవి, చంద్ర గత కొన్నేళ్లుగా తమ మిరప తోటలో గంజాయి మొక్కలను గుట్టుగా సాగు చేస్తున్నట్టు గుర్తించారు. గంజాయి మొక్కలున్న ప్రాంతానికి కూలీలు, ఇతరులెవరూ వెళ్లకుండా వారు జాగ్రత్త పడినట్టు సమాచారం. ఆ గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్టు తెలిసింది.

'పొరుగు మద్యం' కిక్కు!

- ఎన్నికల్లో ఏరులై పారిన ఇతర రాష్ట్రాల మద్యం
- 14 కోట్ల విలువైన మద్యం పట్టివేత
- 19,345 కేసులు నమోదు..
- 20 వేల మందికిపైగా అరెస్టు

(గుంటూరు, కర్నూలు-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో పొరుగు రాష్ట్రాల మద్యం ఏరులై పారింది. రాష్ట్రంలో మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పక్క రాష్ట్రాలలోని సరిహద్దు జిల్లాల నుంచి భారీగా మద్యం అక్రమ రవాణా జరిగింది. పైగా రాష్ట్రంలో నాసిరకం మద్యం మాత్రమే లభిస్తుండడంతో వైసీపీ అభ్యర్థులు సైతం ఆ మద్యాన్ని ఓటర్లకు పంపిణీ చేయడం ఇష్టం లేక పక్క రాష్ట్రాల మద్యానికే ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి వందల కోట్ల విలువ చేసే నాన్ డ్యూటీ పెయిడ్ మద్యంతో పాటు, మన రాష్ట్రంలో తయారైన మద్యమూ సరఫరా అయిఉంటుందని అంచనా వేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16నుంచి మే 11 వరకూ ఎక్సైజ్, ఎస్ఈబీ, పోలీసులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన మద్యమే 1,80,426లీటర్లు ఉంది. అలాగే బీరు 40,337లీటర్లు పట్టుకున్నారు. వీటి విలువ రూ.14కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. 19,345 కేసులు నమోదు చేసి, 20,165 మందిని అరెస్టు చేశారు. 1,512 వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన మద్యమే ఈ స్థాయిలో ఉంటే, తమ కళ్లుగప్పి తరలించింది భారీగానే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా అనంతపురం జిల్లాలో 640 కేసులు నమోదు కాగా, 685మందిని అధికారులు అరెస్టు చేశారు. ఆ తర్వాత శ్రీ సత్యసాయి జిల్లాలో 623 కేసులు నమోదుకాగా, 658 మందిని అరెస్టు చేశారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 17,333 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. ఆ తర్వాత(రెండో స్థానం) కాకినాడ జిల్లాలో 13,500 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు.

నిద్రావస్థలో అధికార యంత్రాంగం..

విశేషమేమిటంటే తూర్పు గోదావరి జిల్లాలో కేవలం 5 కేసులే నమోదు కాగా, 8 మందిని అరెస్టు చేసినట్లు చూపారు. ఇతర రాష్ట్రాల నుంచి అత్యధిక మద్యం సరఫరా అయ్యే జిల్లాలో స్వల్ప కేసులు నమోదు చేయడం చూస్తే అక్కడి అధికార యంత్రాంగం ఎంత నిద్రావస్థలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారపార్టీ నేతల కనుసన్నల్లో పనిచేసిన అధికార యంత్రాంగం దాడులను మొక్కుబడిగానే నిర్వహించినట్లు గణాంకాల ద్వారా వెల్లడవుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఓట్ల కొనుగోలు ధర పెరగడంతోపాటు, మద్యం పంపిణీ కూడా ఈ ఎన్నికల్లో భారీ స్థాయిలో జరిగింది. నోటిఫికేషన్ వెలువడిన నాటినుంచే ఓటర్లను మద్యం మత్తులో ముంచేశారు. రోజూ ఉదయం నుంచే మద్యం స్లిప్పులను అభ్యర్థులు తమ కార్యాలయాలవద్ద పంపిణీ చేశారు. ప్రతి రోజూ ఒక్కో వార్డుకు ఇన్నేసి మద్యం కేసులు అని కేటాయించి ఓటర్ల గొంతు ఆరకుండా చూశారు. పల్నాడు జిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థి మద్యం ఖర్చే 10కోట్లు దాటిందని ప్రచారం జరుగుతోంది. మహిళా నాయకురాళ్లు సైతం అభ్యర్థుల వద్ద పట్టుబట్టి మరీ తమ ప్రాంతంలో పంపిణీకి ఎక్కువ సంఖ్యలో మద్యం కేసులు తీసుకెళ్లిన దాఖలాలున్నాయి.

నంద్యాలలో రూ.55 లక్షల గోవా మద్యం సీజ్

నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద ఈ నెల 3న ఓ లారీలో తరలిస్తున్న రూ.54.43 లక్షల విలువైన గోవా మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గోవాకు చెందిన హరీష్ దీపక్ హిమ్మాన్ష్, మహారాష్ట్రలోని పుణేకు చెందిన జితేంద్ర రాజ్‌కుమార్ గిద్వాని, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన రాజేశ్‌మీనా(లారీ డ్రైవర్), సునీల్ సింగ్ (లారీ ఓనర్)లను మహానంది పోలీసులు అరెస్టు చేశారు. అలాగే, ఈ నెల 10న గోవా నుంచి ఏపీకి తరలిస్తున్న రూ.2.07 కోట్లు విలువైన గోవా మద్యంను తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ పోలీసులు సీజ్ చేశారు. ఈ రెండు ఘటనలకు తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు లింక్ ఉన్నట్లు తెలుస్తోంది. దీని వెనుక అధికార పార్టీ ముఖ్య నేతల పాత్ర ఉన్నట్లు పోలీస్ విచారణలో తేలినట్లు తెలిసింది. కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు గోవా మద్యం తరలించినట్లు సమాచారం. కాకినాడ జిల్లా రావులపాలెంకు చెందిన కేవీఆర్ త్రినాథ్ ద్వారానే గోవా మద్యం సరఫరా అంతా సాగినట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవలే తెలంగాణ పోలీసులు త్రినాథ్‌ను విచారించగా, మద్యం లారీ లోడ్ కాకినాడకు చెందిన వర్మకు వెళ్లాల్సిందని వెల్లడించినట్లు సమాచారం. ఎవరీ వర్మ..? అని పోలీసులు ఆరా తీస్తే.. తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన అధికార పార్టీ ముఖ్య నాయకుడి ప్రధాన అనుచరుడని తెలిసింది. ఈ మద్యం మాఫియా వెనుక అదే ప్రాంతానికి చెందిన ఓ సివిల్ కాంట్రాక్టర్, 2009 నుంచి నాలుగు పర్యాయాలు మూడు పార్టీల టికెట్‌పై పోటీ చేసిన అధికార పార్టీ ముఖ్య నాయకుడి పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఆయన పేరు లేకుండా చేసుకోవడానికి తెలంగాణ పోలీసులపై దేశంలో ప్రముఖ సోలార్ పవర్ కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. పలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఓ ఎమ్మెల్యే, ఓ దళితుడిని హత్య చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముఖ్య నాయకుడు, ఓ ముఖ్య పార్టీ అధ్యక్షుడిపై పోటీ చేసిన అభ్యర్థి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలినట్లు తెలిసింది. అయితే ఆ పేర్లు బయటకు రాకుండా పోలీసులు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. గోవా మద్యం కేసులను సీబీఐకి అప్పగించి సమగ్ర దర్యాప్తు చేయిస్తే ఢిల్లీ తరహా మద్యం కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

రామేశ్వరం కేఫ్ పేలుడు కేసు..

ఎన్ఐఏ అదుపులో అనుమానితుడు

- ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లోనూ తనిఖీలు
- 11 మంది అదుపులోకి.. కీలక పత్రాలు సీజ్

హైదరాబాద్/రాయదుర్గం/బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రత్యేక బృందాలు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి నాలుగు రాష్ట్రాల్లోని 11 ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న అనుమానితుడిని వికారాబాద్‌లో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. మార్చి 1న రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడు కేసులో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు అనుమానిస్తున్న ముసావిర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ తాహాను కోల్‌కతాలో ఎన్ఐఏ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తదుపరి దర్యాప్తులో షాజిబ్, మతీన్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎన్ఐఏ బృందాలు మంగళవారం సోదాలు చేపట్టాయి. వికారాబాద్‌లో ఎన్ఐఏ అదుపులోకి తీసుకున్న వ్యక్తి పుణెకు చెందిన పండ్ల వ్యాపారి అని, అతని స్వస్థలం నాందేడ్ అని అధికారులు వివరించారు. రామేశ్వరం కేఫ్ పేలుడు తర్వాత ఆయన వికారాబాద్‌లో తలదాచుకుంటున్నట్లు గుర్తించామన్నారు. అతనికి గతంలోనూ ఉగ్రవాద కేసులతో సంబంధాలున్నాయని, కర్ణాటక పోలీసులు నమోదు చేసిన ఉగ్రవాద కేసులో శిక్ష కూడా పడ్డట్లు వివరించారు.

రాయదుర్గంతో లింకులు

తాజా తనిఖీలు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా రాయదుర్గంలోనూ జరిగాయి. అక్కడ సోహెల్ అనే యువకుడిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సోహెల్‌కు.. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు ఎన్ఐఏ ఆధారాలను సేకరించింది. సోహెల్ తండ్రి అబ్దుల్లా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, రిటైర్ అయ్యారు. సోహెల్ బెంగళూరులో టెకీగా పనిచేస్తున్నా.. కొవిడ్ సమయం నుంచి వర్క్-ఫ్రమ్-హోమ్ చేస్తున్నారు. అంతకు ముందు బెంగళూరులో ఉన్నప్పుడు కూడా ఉగ్రవాద సంస్థలకు చెందిన వారి రూమ్‌లలో ఉండేవాడు. సోహిల్ రెండేళ్ల క్రితం హజ్ యాత్రకు వెళ్లొచ్చారు. సౌదీలో అతనికి ఉగ్రవాద సంస్థల నేతలతో పరిచయాలేర్పడ్డాయి. వారితో వాట్సాప్‌లో చాటింగ్ కొనసాగించారు. సోహిల్ సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపామని ఎన్ఐఏ అధికారులు వివరించారు.

కర్ణాటక, తమిళనాడు, కేరళల్లో..

ఎన్ఐఏ అధికారులు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోనూ మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. బెంగళూరులోని కుమారస్వామి లేఅవుట్, బసవశంకరి ప్రాంతాల్లో నాలుగు చోట్ల ఎన్ఐఏ దాడులు జరిగాయి. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో వైద్యులు డాక్టర్ జాఫర్ ఇక్బాల్, డాక్టర్ నయీం సాదిక్ నివాసాల్లో తనిఖీలు చేశారు. మొత్తమ్మీద దక్షిణాది రాష్ట్రాల్లో జరిపిన సోదాల సందర్భంగా 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కొందరు 2012 బెంగళూరు, హుబ్లీ ఉగ్రవాద కుట్ర కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు వివరించారు. ఈ తనిఖీల్లో కీలక పత్రాలు, సాంకేతిక ఆధారాలను సేకరించినట్లు తెలిపారు.

ఒడిశాకు తుఫాన్ ముప్పు!

- నేడు అల్పపీడనం.. ఎల్లుండికి వాయుగుండంగా మార్పు
- 25న రాత్రి తుఫాన్ తీరం దాటే అవకాశం
- 23 నుంచి రాష్ట్రంలో పెరగనున్న ఎండలు, వడగాడ్పులు
- 30 కల్లా కేరళలోకి నైరుతి రుతుపవనాలు?

విశాఖపట్నం, అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో మంగళవారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో బుధవారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత అది ఈశాన్యంగా పయనించి ఈనెల 24వ తేదీకల్లా వాయుగుండంగా బలపడి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించనుందని, ఆ తర్వాత మరింత బలపడి ఈశాన్యంగా పయనిస్తుందని వాతావరణశాఖ తెలిపింది. ఈశాన్యంగా పయనించే క్రమంలో తుఫాన్‌గా మారి ఈ నెల 25వ తేదీ రాత్రి ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటుతుందని కొందరు వాతావరణ నిపుణులు అంచనా వేశారు. అయితే, తుఫాన్‌గా మారి ఉత్తర ఒడిశా తీరం దిశగా పయనిస్తుందని మరో నిపుణుడు తెలిపారు. ఆ ప్రభావంతో ఈనెల 24వ తేదీ నుంచి ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో వర్షాలు పెరుగుతాయన్నారు. 23వ తేదీ నుంచి మధ్య బంగాళాఖాతం పరిసరాలు అల్లకల్లోలంగా మారుతున్నందున మత్స్యకారులు అటు వైపు వెళ్లరాదని హెచ్చరించారు. ఇప్పటికే దక్షిణ అండమాన్ పరిసరాలను తాకిన నైరుతి రుతుపవనాలు తుఫాన్ ప్రభావంతో అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమరిన్ ప్రాంతంలో మరిన్ని భాగాలకు విస్తరించనున్నాయి. నెలాఖరు నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించేలా తుఫాన్ దోహదం చేస్తుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. నెలాఖరులోగా కేరళకు ఆనుకుని ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని, దీంతో ఈనెల 30వ తేదీ నాటికే కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయని వెల్లడించారు.

ద్రోణి ప్రభావంతో వర్షాలు..

ఉత్తర కోస్తాలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. నైరుతి బంగాళాఖాతంలో ఆవరించిన ఉపరితల ఆవర్తనం నుంచి తమిళనాడు మీదుగా రాయలసీమ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. అనంతపురం జిల్లా నార్పలలో 26.5, చిత్తూరులో 22.5, జీడీ నెల్లూరులో 21.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనేకచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. కర్నూలులో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడనున్న నేపథ్యంలో ఈనెల 23వ తేదీ తర్వాత ఎండలు పెరిగి వడగాడ్పులు వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణుడొకరు హెచ్చరించారు.

మరో నాలుగు రోజులు వర్షాలు

రానున్న నాలుగు రోజులు రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. బుధవారం విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

అనంతలో గాలివాన బీభత్సం

అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. నగరంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. అర్ధరాత్రి ఒంటి గంట వరకూ అంధకారం అలుముకుంది. కొన్ని కాలనీల్లో ఉదయం వరకూ కరెంటు రాలేదు. ప్రధాన రహదారులు, కాలనీలు జలమయమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ దెబ్బతింది. మంగళవారం రాత్రి వరకూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 162 స్తంభాలు, 12 ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. హిందూపురంలో 52.8, రాప్తాడులో 45.2, అనంతపురంలో 37.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- అనంతపురం క్రైం

సుప్రీంకూ అదే స్క్రిప్టు!

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ సుప్రీంకోర్టుకు ఆధారాలు సమర్పించారు. వాటిని పరిశీలించిన కోర్టు.. ఎన్జీటీ ఆదేశాలను ఏపీ సర్కారు, రెండు కాంట్రాక్టు సంస్థలు ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన రీచ్‌ల్లో జిల్లా కలెక్టర్లు, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నిపుణుల కమిటీలు వేర్వేరుగా పరిశీలన చేసి నివేదికలు ఇవ్వాలని ఈ నెల 11వ తేదీన ఆదేశించింది. కలెక్టర్లు ఇసుక రీచ్‌లను సందర్శించి అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆధారాలతో కోర్టుకు నివేదించాలి. అయితే ఈ నివేదికలు ఎలా ఉండాలన్నదానిపై జగన్ ప్రభుత్వానికి ఓ స్పష్టత ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్జీటీకి 26 జిల్లాలకుగాను 23 జిల్లాల కలెక్టర్లు ఒకే ఫార్మాట్‌లో నివేదిక ఇచ్చారు. తాము తనిఖీ చేసిన ఇసుక రీచ్‌ల్లో ఇంతకు ముందు మైనింగ్ చేసిన ఆనవాళ్లు లేవని.. ఇప్పుడు ఇసుక తవ్వకాలు జరిపిన ఆనవాళ్ల లేవని.. భారీ యంత్రాలను ఉపయోగించలేదని వారు పేర్కొన్నారు. మిగతా మూడు జిల్లాల కలెక్టర్లు తమ పరిధిలో ఇసుక రీచ్‌లే లేవని నివేదించారు. ఈ నివేదికలను చూసి ఎన్జీటీ విస్మయం వ్యక్తం చేస్తూ నివేదికలన్నీ ఒకే ఫార్మాట్‌లో ఉన్నాయేమిటి.. ముందే మాట్లాడుకుని రాశారా అని ప్రశ్నించింది. వారి నివేదికలకు పూర్తి భిన్నంగా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నిపుణుల జాయింట్ కమిటీ రిపోర్టులు ఉన్నాయి. కృష్ణా, గోదావరి, నాగావళి, వంశధార నదుల పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా రెండు టన్నుల బకెట్ సామర్థ్యం కలిగిన జేసీబీలను ఉపయోగిస్తున్నారని ఆధారాలతో కేంద్ర బృందం ఎన్జీటీకి నివేదికలు ఇచ్చింది. ప్రభుత్వ పెద్దల ఆదేశం మేరకే కలెక్టర్లు ఏకవాక్య నివేదికలు ఇచ్చారని తేలిపోయింది. అయితే అప్పటికే జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టు నుంచి స్టే పొందడంతో ఎన్జీటీ తీర్పు ఇవ్వలేదు. కేసును సుప్రీంకోర్టుకే అప్పగించింది. సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసును విచారించి మరోసారి ఇటు కలెక్టర్లు, ఇటు కేంద్ర బృందం వేర్వేరుగా విచారణ జరపాలని ఆదేశించింది. కలెక్టర్లు సుప్రీంకోర్టుకు ఇచ్చే నివేదికల విషయంలోనూ సేమ్ స్క్రిప్టును అమలు చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. ఎన్జీటీని తప్పుదోవ పట్టించినట్లుగానే సుప్రీంకోర్టుకు కూడా సింగిల్ ఫార్మాట్ నివేదికలు ఇప్పించాలని నిర్ణయించారు. 'మా జిల్లాల పరిధిలో ఇంత కు ముందు గానీ, ఇప్పుడు గానీ ఇసుక తవ్వకాలకు భారీ యంత్రాలను ఉపయోగించడం లేదు. అక్రమ తవ్వకాలనేవే లేవు' అని ఒకే ఫార్మాట్‌లో రిపోర్టులివ్వాలని కలెక్టర్లకు ప్రభుత్వంలో అత్యంత కీలకమైన ముఖ్య అధికారి మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ల నివేదిక ఎలా ఉండాలో గనుల శాఖ ఉన్నతాధికారి ఓ ఫార్మాట్‌ను రూపొందించారు. దాని ప్రకారమే కలెక్టర్లు అక్షరం పొల్లుపోకుండా నివేదిక ఇవ్వాలని ముఖ్య అధికారి వారితో ఇప్పటికి మూడుసార్లు ఫోన్లో మాట్లాడినట్లు తెలిసింది. అయితే కోడ్ తర్వాత కొన్ని జిల్లాలకు కొత్త కలెక్టర్లు వచ్చారు. గత ఫిబ్రవరిలో వారికంటే ముందున్న కలెక్టర్లు ఇచ్చిన నివేదికలను వారికి గుర్తుచేస్తూ అదే ఫార్మాట్‌లో నివేదికలు ఇవ్వాలని ముఖ్య అధికారి ఒత్తిడి చేస్తున్నారు. ఇక ఇదే విషయంపై ముఖ్యనేత వద్ద పనిచేస్తున్న వసూల్ రాజా రంగంలోకి దిగారు. కలెక్టర్లకు నాలుగు రోజుల క్రితం ఫోన్ చేసినట్లు తెలిసింది. 'మళ్లీ జగనే సీఎంగా రాబోతున్నారు. మనం ఇంతకు ముందు నిర్ణయించిన ఫార్మాట్‌లోనే నివేదికలు తయారు చేయండి. ఎన్జీటీకి ఒకలా, సుప్రీంకు మరోలా నివేదికలు ఇస్తే మీరే దొరికిపోతారు. నివేదికలు తారుమారైతే మీరే దోషులుగా సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. జగన్ సార్ వచ్చాక కూడా మీరే కలెక్టర్లుగా కొనసాగుతారు. కాబట్టి మన ఫార్మాట్‌లోనే పంపండి' అని మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. తాజాగా గత రెండ్రోజులుగా వసూల్ రాజా వద్ద ఉన్న ఓ నీలకంఠుడు ఇదే విషయమై వారితో మాట్లాడుతున్నట్లు తెలిసింది. 'సార్ చెప్పిన దానికి భిన్నంగా మీరు ఏం పంపినా మాకు ఇక్కడ తెలిసిపోతుంది' అని బెదిరిస్తున్నట్లు సమాచారం.

కలెక్టర్లకు విషమ పరీక్షే..

ఇసుక అక్రమ తవ్వకాలపై కలెక్టర్లతోపాటు కేంద్ర, అటవీ, పర్యావరణ శాఖలోని నిపుణుల బృందం కూడా సుప్రీంకోర్టుకు వేర్వేరుగా నివేదికలు ఇవ్వనుంది. ఇది ఒకరకంగా కలెక్టర్లకు విషమ పరీక్ష లాంటిదే. ప్రభుత్వ పెద్దలు, ముఖ్య అధికారి, వసూల్ రాజా కోరిక మేరకు నివేదికలు ఇస్తే.. వాటితో కేంద్ర బృందం రిపోర్టులకు పొంతన లేకుండా ఉంటే కలెక్టర్లు సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురవుతారు. వాస్తవాలకు భిన్నంగా నివేదికలు ఇస్తే తాము అడ్డంగా దొరికిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

62 ఏళ్లు నిండేవరకు వారిని

సర్వీసులో కొనసాగించండి

- ఇప్పటికే పదవీ విరమణ చేసి 62 ఏళ్లు పూర్తికాని వారికి ఉపశమనం
- రాష్ట్ర సర్కారుకు హైకోర్టు ఆదేశం
- వ్యవసాయ పరపతి సంఘాలకు సంబంధించి కోర్టును ఆశ్రయించిన వారికే వర్తింపు



అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు.. ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ(పీఏసీఎస్) ఉద్యోగులకు వర్తిస్తాయని హైకోర్టు స్పష్టం చేసింది. 62 ఏళ్లు నిండేవరకు పీఏసీఎస్ ఉద్యోగులను సర్వీసులో కొనసాగించాలని అధికారులను ఆదేశించింది. వ్యాజ్యాలు విచారణలో ఉండగా 60 ఏళ్లకే పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఇప్పటికీ 62 ఏళ్లు నిండకుంటే వారిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని తేల్చిచెప్పింది. వారికి వేతన బకాయిలను కూడా చెల్లించాలని పేర్కొంది. ఈ ఉత్తర్వులు 60 ఏళ్లు పూర్తికాకముందు కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లకు మాత్రమే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు ఇచ్చారు. పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తమకు కూడా వర్తింప చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పలు ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వారి తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. పదవీ విరమణ వయసు పెంచుతూ ప్రభుత్వం చేసిన చట్టం పిటిషనర్లకు వర్తిస్తుందన్నారు. దీంతో పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ పీఏసీఎస్‌లు కూడా తీర్మానాలు చేశాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పదవీ విరమణ వయసును పెంచే విషయంలో ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. కో ఆపరేటివ్ సొసైటీల రిజిస్ట్రార్ తీర్మానాలను ఆమోదించనంత వరకు వాటికి ఎలాంటి విలువ ఉండదన్నారు. ఈ విషయంలో హైకోర్టు ధర్మాసనం ఇప్పటికే తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు పిటిషనర్లకు వర్తించదని స్పష్టం చేశారు. 62 ఏళ్ల వయసు నిండే వరకు పీఏసీఎస్ ఉద్యోగులను సర్వీసులో కొనసాగించాలని ఆదేశించారు.

కిర్గిస్థాన్‌లో బిక్కుబిక్కుమంటూ..

- భారతీయ విద్యార్థుల దీన స్థితి.. విదేశీ విద్యార్థులపై స్థానికుల దాడులు
- వారం రోజులుగా నిద్రాహారాలకు దూరం



బిష్కెక్‌లో తెలుగు విద్యార్థులతో మాట్లాడుతున్న స్థానిక పోలీసులు

దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా), మే 21: వైద్య విద్యను అభ్యసించేందుకు కిర్గిస్థాన్ వెళ్లిన భారతీయ విద్యార్థులు అక్కడ వారం రోజులుగా నిద్రాహారాలు కరువై బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. విదేశీ విద్యార్థులున్న విద్యా సంస్థలు, హాస్టళ్లపై అక్కడి పౌరులు కొందరు దాడులకు పాల్పడుతున్నారు. దీంతో వారు హాస్టళ్ల నుంచి బయటికి రావాలంటేనే భయపడిపోతున్నారు. కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లోని యూనివర్సిటీలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన పలువురు విద్యార్థులు చదువుకుంటున్నారు. సాయంత్రం ఆరు గంటలైతే గదుల్లో లైట్లు ఆర్పేసి గడపాల్సిన పరిస్థితి నెలకొందని అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం నాగయ్యపేటకు చెందిన బి వినయ్ కుమార్‌రాజు తెలిపారు. మంగళవారం ఆయన ఫోన్ ద్వారా దేవరాపల్లి విలేకరులతో మాట్లాడాడు. ఈ నెల 13వ తేదీ రాత్రి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు విదేశీ విద్యార్థులను వేధించడం మొదలుపెట్టారని, తాము ఉంటున్న ప్రాంతంలో పలు హాస్టళ్లలో చొరబడి డబ్బులు, వస్తువులు తీసుకుపోయారని తెలిపారు. అల్లర్ల నేపథ్యంలో ఈ నెల 19న పాకిస్థాన్‌కు చెందిన 180 మంది విద్యార్థులను ప్రత్యేక విమానంలో బిష్కెక్ నుంచి తరలించినట్టు చెప్పారు. "ఇక్కడ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. స్వదేశానికి వచ్చేయాలని ఉంది. అయితే జూన్ 15తో విద్యా సంవత్సరం ముగుస్తుంది. ఒక వారం తర్వాత ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ఇక్కడి ప్రభుత్వం చెబుతోంది. ఇక్కడి విద్యార్థుల భద్రతపై భారత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి" అని వినయ్ కుమార్‌రాజు వేడుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

విజయవాడ ● బుధవారం 22 మే 2024
diksuchi@andhrajyothy.com

ఎన్‌జీ రంగా వర్సిటీలో కోర్సులు

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ దూరవిద్య విభాగం- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు(రెండు నెలలు). గ్రామీణ రైతులు, మహిళలు, యువత దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై నుంచి సెప్టెంబరు వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.

కోర్సులు: మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకం.

అర్హత: వయోపరిమితి నిబంధనలు లేవు. తెలుగు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి.

శిక్షణ: రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి పాఠ్య ప్రణాళిక పుస్తకం ఇస్తారు. వారానికి ఒక రోజు చొప్పున మొత్తం ఏడు ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. ఒక్కో తరగతి సమయం 2 గంటలు. ఇందులో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు నిర్వహిస్తారు. వీటికి అభ్యర్థుల అటెండెన్స్ తప్పనిసరి. అభ్యర్థి ఎంపిక చేసుకొన్న స్టడీ సెంటర్లో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు పూర్తయిన తరవాత పరీక్ష ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **చిరునామా:** డీన్(వ్యవసాయం) కార్యాలయం, పరిపాలన భవనం, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు- 522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in



ఐజీడీటీయూడబ్ల్యూలో పీజీ, పీహెచ్‌డీ

ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమన్(ఐజీడీటీయూడబ్ల్యూ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. పీజీలో ఎంటెక్, ఎంప్లాన్, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆసక్తిగల మహిళలు జూన్ 7 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

- దరఖాస్తు ఫీజు రూ.1000
- వెబ్‌సైట్: igdtuw.ac.in

ఎంటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 86 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) 25, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ 25, ఐటీ(సైబర్ సెక్యూరిటీ) 18, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(వీఎల్ఎస్ఐ డిజైన్) 18 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ/ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఎలక్ట్రానిక్స్/ ఫిజిక్స్/మేథ్స్/స్టాటిస్టిక్స్) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంప్లాన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్ అర్బన్ ప్లానింగ్. మొత్తం 13 సీట్లు ఉన్నాయి. కనీసం 60 శాతం మార్కులతో బీఆర్క్/బీ ప్లానింగ్ లేదా సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఏ(సోషియాలజీ); (ఎంఏ/ఎమ్మెస్సీ)(జాగ్రఫీ/ఎకనామిక్స్) ఉత్తీర్ణులు కూడా అర్హులే.

ముఖ్య సమాచారం

- **వయసు:** 2024 సెప్టెంబరు 30 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో సీయూఈటీ ర్యాంక్ ఆధారంగా భర్తీ చేస్తారు.
- **మొదటి కౌన్సెలింగ్:** జూన్ 18
- **రెండో కౌన్సెలింగ్:** జూలై 2

ఎంసీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో 76 సీట్లు ఉన్నాయి. మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బీసీఏ/బీఐటీ/బీఐఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. డిగ్రీ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అభ్యర్థులకు ప్రవేశం కల్పిస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో సీయూఈటీ స్కోర్ ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 14 నుంచి
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 26
- **మొదటి కౌన్సెలింగ్:** జూలై 1
- **రెండో కౌన్సెలింగ్:** జూలై 8
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూలై 10

పీహెచ్‌డీ

- ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ సౌకర్యం కల్పిస్తారు. వీరికి నెలకు రూ.10,000ల చొప్పున అయిదేళ్లపాటు స్టయిపెండ్ ఇస్తారు. బోధన నైపుణ్యం ఉన్నవారిని జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్‌లుగా నియమిస్తారు. వీరికి మొదట నెలకు రూ.38,440, తరవాత నెలకు రూ.43,400ల ఫెలోషిప్ ఇస్తారు. రీసెర్చ్ పేపర్ సబ్మిట్ చేసి పేటెంట్ పొందినవారికి క్యాష్ ప్రైజ్ కింద రూ.5,00,000 ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: మొత్తం 117 సీట్లు ఉన్నాయి. వీటిలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ 16, ఐటీ/కంప్యూటర్ అప్లికేషన్స్ 28, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ 5, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 16, మెకానికల్ అండ్ ఆటొమేషన్ ఇంజనీరింగ్ 29, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ 5, ఫిజిక్స్ 10, కెమిస్ట్రీ 4, మేథమెటిక్స్ 1, మేనేజ్‌మెంట్ 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంజనీరింగ్ స్పెషలైజేషన్లకు సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్స్‌కు బీఎస్సీ(మేథ్స్, సైన్సెస్) డిగ్రీతోపాటు ఎంసీఏ పూర్తిచేసి ఉండాలి. సైన్స్ స్పెషలైజేషన్లకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీ; ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌కు కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ/75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఆర్కిటెక్చర్/ప్లానింగ్) పూర్తిచేసి ఉండాలి. మేనేజ్‌మెంట్ విభాగానికి కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/టెక్నాలజీ/కామర్స్/ఎకనామిక్స్/బిహేవియరల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి.


ఎంపిక: అభ్యర్థులు రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్టు రాయాల్సి ఉంటుంది. ఇందులో 50 శాతం ప్రశ్నలను రీసెర్చ్ మెథడాలజీ నుంచి, మిగిలిన ప్రశ్నలను సంబంధిత సబ్జెక్టు నుంచి అడుగుతారు. ఈ పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. సంస్థలో ఫుల్ టైమ్ బోధన సిబ్బందిగా పనిచేస్తున్నవారు, స్పాన్సర్డ్ అభ్యర్థులు, యూజీసీ/సీఎస్ఐఆర్ నుంచి జేఆర్ఎఫ్/నెట్ లేదా గేట్ వ్యాలిడ్ స్కోరు ఉన్న అభ్యర్థులు రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్టు రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం

- **రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఆర్ఏటీ) తేదీ:** జూన్ 26
- **ఆర్ఏటీ ఫలితాలు విడుదల:** జూలై 1
- **ఇంటర్వ్యూకి అర్హులైన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** జూలై 3
- **ఇంటర్వ్యూలు:** జూలై 8 నుంచి 11 వరకు
- **పీహెచ్‌డీకి ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూలై 22

ఇండియన్ ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్

ఖాళీలు 90



జనవరి 2025లో ప్రారంభమయ్యే 52వ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశానికి ఇండియన్ ఆర్మీ దరఖాస్తులు కోరుతోంది. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన వారికి బీటెక్ కోర్సు, లెఫ్టినెంట్ కొలువులకు ఉచిత శిక్షణ ఇస్తారు.

- టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 52వ కోర్సు(టీఈఎస్)-జనవరి 2025

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్) లేదా దానికి సమానమైన పరీక్షతో పాటు జేఈఈ(మెయిన్స్) 2024లో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 16.5 నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: జేఈఈ(మెయిన్స్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

కోర్సు శిక్షణ: మొత్తం ఐదేళ్ల కోర్సు శిక్షణ కొనసాగుతుంది. ఇందులో ఏడాదిపాటు బేసిక్ మిలిటరీ ట్రెయినింగ్, నాలుగేళ్లు టెక్నికల్ ట్రెయినింగ్ ఇస్తారు. శిక్షణ, కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్నవారికి ఇంజనీరింగ్(బీఈ/బీటెక్) డిగ్రీ అందజేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 13

వెబ్‌సైట్: joinindianarmy.nic.in/

ఐఐటీఎంలో ప్రాజెక్ట్ పోస్టులు

ఖాళీలు 65

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ(ఐఐటీఎం)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ప్రాజెక్ట్ సైంటిస్ట్-3: 4 పోస్టులు
2. ప్రాజెక్ట్ సైంటిస్ట్-2: 11 పోస్టులు
3. ప్రాజెక్ట్ సైంటిస్ట్-1: 4 పోస్టులు
4. ట్రెయినింగ్ కో ఆర్డినేటర్: 1 పోస్టు
5. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 2 పోస్టులు
6. ప్రాజెక్ట్ అసోసియేట్-2: 08 పోస్టులు
7. ప్రాజెక్ట్ అసోసియేట్-1: 33 పోస్టులు
8. రీసెర్చ్ అసోసియేట్(డీప్ ఓషియన్ మిషన్): 2 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, నెట్/సీఎస్ఐఆర్-యూజీసీ/గేట్ స్కోరుతోపాటు పని అనుభవం అవసరం.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 18

వెబ్‌సైట్: https://www.tropmet.res.in/

కొచ్చిన్ షిప్‌యార్డులో జనరల్ వర్కర్లు

ఖాళీలు 15

కొచ్చిన్ షిప్‌యార్డు లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన జనరల్ వర్కర్(క్యాంటిన్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: 7వ తరగతి, ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఫుడ్ ప్రొడక్షన్/ఫుడ్ అండ్ బేవరేజెస్ సర్వీస్‌లో ఏడాది సర్టిఫికెట్ కోర్సు లేదా గుర్తింపు పొందిన సంస్థ నుంచి క్యాటరింగ్ అండ్ రెస్టారెంట్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల ఒకేషనల్ సర్టిఫికెట్ ఉత్తీర్ణులై ఉండాలి. మలయాళ భాషలో పరిజ్ఞానంతోపాటు సంబంధిత రంగంలో పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 మే 22 నాటికి 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: రాత, ప్రాక్టికల్ పరీక్షలు తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 22

వెబ్‌సైట్: cochinshipyard.in/

SCHOLARSHIP ALERT

NextGen Edu Scholarship 2024-25

Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/EYGDS1

UK-India TOEFL Scholarship

Description: UK-India TOEFL Scholarship 2024 is a program that supports Indian students pursuing full-time UG/PG studies in the UK. This opportunity is offered by the Educational Testing Service (ETS), in collaboration with the National Indian Students and Alumni Union (NISAU).



Eligibility: Open to Indian citizens applying to undergraduate or postgraduate courses at UK universities. Applicants must have taken the TOEFL iBT test between April 1 and July 15, 2024, with a minimum score of 75.

Prizes & Rewards: A one-time scholarship of 2,50,000 each for 10 students

Last Date to Apply: 15-07-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/TOEF1

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion

Last Date to Apply: 01-10-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1

buddy4study.com

లిటిల్స్




మీకు తెలుసా?

- చిలుక జాతికి చెందిన ఈపక్షిని రెయిన్‌బో లోరీకీట్స్ అంటారు ఇది ఇంద్రధనుస్సు రంగులమయంగా ఉంటుంది.
- పొడవు 30 సెం.మీ. వరకు ఉంటుంది. బరువు 75 గ్రాముల నుంచి 157 గ్రాములు ఉంటుంది. వింగ్ స్పాన్ 24 సెం.మీ. వరకూ ఉంటుంది.
- ఈ చిలుకలు ఎక్కువగా ఆస్ట్రేలియాలో కనిపిస్తాయి.
- నారింజ, నీలం, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు పచ్చ.. రంగులు వేసినట్లుండే ఈ పక్షి ఎక్కువగా పండ్లు, ద్రాక్ష, యాపిల్స్, నట్స్ తినటానికి ఇష్టపడుతుంది.
- వీటి ముక్కు, కాలి గోళ్లు బలమైనవి. ముక్కు సాయంతో చెట్టు మీద కిందికి వేలాడగలదు.



- చెట్టు తొర్రల్లో, చెట్ల పైన, రాళ్ల మధ్య ఇవి గూడు కట్టుకుంటాయి.
- రెండు గుడ్లు మాత్రమే పెడతాయి. ఇరవై ఐదు రోజుల పాటు తల్లి పక్షి మాత్రమే గూటిలో ఉంటుంది.
- ఇవి మాట్లాడటంలో, కొత్త పదాలను నేర్చుకోవటంలో ముందుంటాయి. మనుషులతో ఫ్రెండ్లీగా, ప్రేమగా ఉంటాయి.
- ఇవి పెంపుడు పక్షులు. అయితే ఆస్ట్రేలియాలో వీటిని పెంచుకోవటం నేరం.
- వందలుగా గుంపులు వస్తాయి. ఇవి గట్టిగా అరుస్తాయి. జనాలను డిస్టర్బ్ చేస్తుంటాయి.
- వీటి జీవనకాలం 30 సంవత్సరాలు.

సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



ఎన్ని చేపలు ఉన్నాయి?



డైలీ సుడోకు - 313

			3				8	
		2		4			9	
	8			7				3
5				3		8		
8		3	4		9	2		6
		6		5				4
7				6			2	
	4			2		6		
	6				1			

సుడోకు - 312 సమాధానం

8	3	6	7	2	9	4	1	5
9	5	2	4	1	6	8	7	3
7	1	4	8	3	5	9	2	6
1	7	5	9	6	8	3	4	2
3	2	8	1	7	4	6	5	9
4	6	9	3	5	2	1	8	7
5	8	7	6	4	3	2	9	1
2	9	3	5	8	1	7	6	4
6	4	1	2	9	7	5	3	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.